మీడియాకు సంబంధించిన అన్ని విషయాల కోసం 9246213493
సహాయ
మీడియా సర్వీసు రి.
3-7-255,మన్సూరాబాద్,ఎల్బీనగర్,హైదరాబాద్-68

www.navabhoomi.in | epaper.navabhoomi.in | RNI No:TELTEL:82083

అనుక్షణం
# నవభూమి
ANUKSHANAM
NAVABHOOMI TELUGU DAILY
నవతరం తెలుగు దినపత్రిక




Published from Hyderabad and Vijayawada
ఎడిటర్ : అజీద్
హైదరాబాద్ | 10 మంగళవారం | డిసెంబర్ 2024 | పేజీలు 8-12 | వెల: రూ.6 | సంపుటి:3 సంచిక: 85
Navabhoomi daily fallows..





## జయ జయహే
# తెలంగాణ తల్లి


- 20 అడుగుల తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించిన సీఎం రేవంత్ రెడ్డి
- తెలంగాణ తల్లి విగ్రహాన్ని అధికారికంగా ఆమోదిస్తూ తెలుగులో ఉత్తర్వులు జారీ
- ప్రతి ఏటా డిసెంబర్ 9న తెలంగాణ తల్లి అవతరణ ఉత్సవాన్ని జరపాలని నిర్ణయం
- తెలంగాణ తల్లి జాతి అస్తిత్వ, ఆత్మగౌరవ ప్రతీక కాబట్టి.. చిత్ర రూపాన్ని వక్రీకరించడం, వేరే విధంగా చూపడాన్ని నిషేధిస్తున్నట్లు ప్రకటన
- తెలంగాణ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన గురించి సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో వివరణ

2

## ఏపీలో మరో రేషన్
# బియ్యం కలకలం

- ఈసారి విశాఖ పోర్టులో పట్టుబడిన రేషన్ బియ్యం
- విశాఖ పోర్టును మంత్రి నాదెండ్ల మనోహర్ ఆకస్మిక తనిఖీ
- బియ్యం స్మగ్లింగ్‌కు గేట్ వేగా మారినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వైజాగ్ పోర్ట్‌లో తనిఖీలు
- కంటైనర్ ఫ్రైట్ స్టేషన్లో ఎగుమతికి సిద్ధంగా వున్న బియ్యాన్ని గుర్తించి సీజ్ చేయమని ఆదేశాలు

2





**విశాఖపట్నం-నవభూమిబ్యూరో**

ఏపీలో రేషన్ బియ్యం అక్రమ రవాణా నిరాటంకంగా సాగిపోతోంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రేషన్ బియ్యం అక్రమ రవాణా విషయంలో కూటమి నేతలు తీవ్ర విమర్శలు చేసేవారు. కానీ ఇప్పుడు కూటమి ప్రభుత్వం వచ్చి ఆరు నెలలు అవుతున్నా రేషన్ బియ్యం అక్రమ రవాణా దందాకు మాత్రం చెక్ పడటం లేదు. ఇప్పటికే కాకినాడ పోర్టులో దొరికిన రేషన్ బియ్యంపై వివాదం కొనసాగుతుండగానే.. సోమవారం విశాఖ పోర్టులో మరో దందా బయటపడింది. సోమవారం విశాఖ పోర్టును పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. బియ్యం స్మగ్లింగ్ కు గేట్ వేగా

# ఏపీ నెక్స్ట్ సీఎస్‌గా విజయానంద్?

- ఏపీ సీఎస్‌గా తెరపైకి రెండు పేర్లు
- శ్రీలక్ష్మీ, విజయనంద్ పేర్ల పరిశీలన
- ప్రస్తుత సీఎస్ నీరబ్ త్వరలో పదవీ విరమణ
- సీనియర్ల జాబితాలో ఉన్న శ్రీలక్ష్మీ
- గత ప్రభుత్వంతో అంటకాగినట్లు ఆరోపణ
- అందుకే ఆమెను పక్కన పెట్టి విజయానంద్‌కు ఛాన్స్



**అమరావతి-నవభూమిబ్యూరో**

శ్రీలక్ష్మి సీనియరే కానీ... ఏపీ నెక్స్ట్ సీఎస్‌గా ఇంట్రస్టింగ్ పేరు! అవును... ప్రస్తుత ఏపీ చీఫ్ సెక్రటరీ నీరబ్ కుమార్ ప్రసాద్ మరి కొద్ది కాలంలో పదవీ విరమణ చేయనున్నారు! ఈ తరుణంలో ఏపీకి కాబోయే సీఎస్ ఎవరనేదానిపై ఆసక్తికర చర్చ తెరపైకి వచ్చింది. ఏపీలో సార్వత్రిక ఎన్నికల ఫలితాల అనంతరం ఏర్పడిన కూటమి ప్రభుత్వంలోని అధికారుల ఎంపికలో అత్యంత జాగ్రత్తలు తీసుకుంటున్నారని అంటున్నారు. ఈ క్రమంలోనే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా నీరబ్ కుమార్ ప్రసాద్‌కు బాధ్యతలు అప్పగించారు చంద్రబాబు. అయితే... ఈయన మరికొద్ది కాలంలో పదవీ విరమణ చేయనున్నారు. దీంతో.. నెక్స్ట్ సీఎస్ పై ఇంట్రస్టింగ్ చర్చ తెరపైకి వచ్చింది. అవును... ప్రస్తుత ఏపీ చీఫ్ సెక్రటరీ నీరబ్ కుమార్ ప్రసాద్ మరి కొద్ది కాలంలో పదవీ విరమణ చేయనున్నారు! ఈ తరుణంలో ఏపీకి కాబోయే సీఎస్ ఎవరనే దానిపై ఆసక్తికర చర్చ తెరపైకి వచ్చింది. దానికి కారణం... ఎప్పటిలాగానే సీనియారిటీ

## ఆర్బీఐ కొత్త గవర్నర్‌గా
# సంజయ్ మల్హోత్రా

- కేంద్ర ఆర్థికశాఖలో రెవెన్యూ కార్యదర్శిగా వ్యవహరిస్తున్న సంజయ్ మల్హోత్రాకు కొత్త గవర్నర్‌గా నియామకం
- ఆర్బీఐ గవర్నర్‌గా నియమిస్తూ కేంద్రం ఉత్తర్వులు జారీ
- మూడేళ్ల పాటు ఈ పదవిలో కొనసాగబోతున్న సంజయ్
- 1990 బ్యాచ్ రాజస్థాన్ క్యాడర్ ఐఏఎస్ అధికారి



**న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో**

దేశంలో బ్యాంకులకే బ్యాంకు అయిన రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు కొత్త గవర్నర్‌గా ఐఏఎస్ అధికారి సంజయ్ మల్హోత్రా నియమితుల య్యారు. ప్రస్తుతం కేంద్ర ఆర్థికశాఖలో రెవెన్యూ కార్యదర్శిగా వ్యవహరిస్తున్న సంజయ్ మల్హోత్రాను తదుపరి ఆర్బీఐ గవర్నర్‌గా నియమిస్తూ కేంద్రం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన మూడేళ్ల పాటు ఈ పదవిలో కొనసాగబోతున్నారు. ఎల్లుండి సంజయ్ మల్హోత్రా బాధ్యతలు చేపట్టబోతున్నారు. 1990 బ్యాచ్ రాజస్దాన్ క్యాడర్ ఐఏఎస్ అధికారి అయిన సంజయ్ మల్హోత్రా ప్రభుత్వంలో వివిధ హెూదాల్లో పనిచేశారు. సంజయ్ మల్హోత్రా ఐఐటీ కాన్పూర్ విద్యార్థి. 1989లో బీటెక్ కంప్యూట ర్స్ సైన్స్ పట్టా తీసుకున్నారు. అనంతరం ప్రిన్స్‌టన్ యూనివర్సిటీ నుండి మాస్టర్స్ పూర్తి చేశారు. గతంలో ఆర్థిక శాఖ కార్యదర్శిగా కూడా -2లో

## రాజ్యసభ ఛైర్మన్‌పై
# అవిశ్వాసం

- ఇండియా కూటమి సంచలన నిర్ణయం..!
- అదానీ అంశంతో పాటు పలు సమస్యలను ప్రస్తావిస్తున్న విపక్ష కూటమికి, అధికార పక్షం నుంచి మొండిచేయి
- ఈ నేపథ్యంలో ఉభయసభల్లో వాయిదాల పర్వం
- రాజ్యసభ ఛైర్మన్ జగ్‌దీప్‌ధన్‌కర్ విషయంలో విపక్షాలు అసంతృప్తి
- ధన్‌కర్‌పై అవిశ్వాసం పెట్టేందుకు సిద్ధమవుతున్న కూటమి

2

**న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో**

పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో ఉభయ సభలు విపక్షాల నిరసనలతో అట్టుడుకుతున్నాయి. ముఖ్యంగా అదానీ అంశంతో పాటు పలు సమస్య లను ప్రస్తావిస్తున్న విపక్ష ఇండియా కూటమికి, అధికార పక్షం నుంచి మొండిచేయి ఎదురవుతోంది. ఈ నేపథ్యంలో ఉభయసభల్లో వాయిదాల



# పవన్‌ను లేపేస్తాం

- వరుస బెదిరింపు కాల్స్, మెసేజ్‌లు..!
- విచారించమని డీజీపీని ఆదేశించిన హెూంమంత్రి
- కాల్ చేసిన వ్యక్తిని పట్టుకున్న పోలీసులు

2



**అమరావతి-నవభూమిబ్యూరో**

ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కార్యాలయ సిబ్బందికి ఆగంతకుడి నుంచి బెదిరింపు కాల్స్ వచ్చాయి. చంపేస్తామని హెచ్చరించిన ఆగంతకుడు. ఆ క్రమంలో అభ్యంతకర భాషతో హెచ్చరిస్తూ మెసేజులు పంపించాడు. పేషీ సిబ్బంది బెదిరింపు కాల్స్, మెసేజులను ఉప ముఖమంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. పేషీ అధికార్లు బెదిరింపు కాల్స్, మెసేజుల విషయాన్ని పోలీసు ఉన్నతాధికారులకు

## నాగబాబుకు
# మంత్రి పదవి

- చంద్రబాబు కీలక నిర్ణయం 2
- అధికారికంగా ప్రకటన విడుదల
- 4కు జనసేన మంత్రుల సంఖ్య



**అమరావతి-నవభూమి**

మెగా బ్రదర్ నాగబాబు మంత్రి పదవి చేపట్టడం ఖాయమైంది. నాగబాబుకు రాజ్యసభ చాన్స్ ఇస్తారం

## తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు
# 16 వరకు వాయిదా



- నేడు ప్రారంభమైన శీతాకాల అసెంబ్లీ సమావేశాలు
- తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటుపై సీఎం ప్రకటన
- విగ్రహావిష్కరణకు అందరూ రావాలని సభ్యులకు ఆహ్వానం

2

**హైదరాబాద్-నవభూమిబ్యూరో**

తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ఈ నెల 16వ తేదీకి వాయిదా పడ్డాయి. అసెంబ్లీ సమావేశాలు ఈరోజు ప్రారంభమయ్యాయి. సభ ప్రారంభం కాగానే సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటుపై ప్రకటన చేశారు. ఈరోజు సాయంత్రం సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి సభలో వెల్లడించారు. ఈ విగ్రహావిష్కరణకు అందరూ రావాలంటూ సభాముఖంగా ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా మంత్రులు, సభ్యులు తమ తమ అభిప్రాయాలను తెలిపారు.

అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కావడానికి ముందు బీఆర్ఎస్ నేతలు అసెంబ్లీ ఎదుట నిరసనకు దిగారు. రంగంలోకి దిగిన పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు.

## చెన్నమనేని రమేష్‌పై హైకోర్టు ఆగ్రహం

2



# బీజేపీ రాజ్యసభ ఎంపీగా ఆర్ కృష్ణయ్య

- ముగ్గురితో జాబితా విడుదల..!
- ఒకటి బీజేపీకి..రెండు టీడీపీకి
- టీడీపీ నుంచి బీద మస్తాన్‌రావు,సతీష్
- నేడు నామినేషన్ దాఖలు చేసే అవకాశం



**అమరావతి-నవభూమిబ్యూరో**

త్వరలో జరిగే రాజ్యసభ ఎన్నికల్లో పోటీ చేసే ముగ్గురు అభ్యర్థుల జాబితాను బీజేపీ ఇవాళ విడుదల చేసింది. ఇందులో వైసీపీ మాజీ ఎంపీ, బీసీ నేత ఆర్ కృష్ణయ్యకు ఏపీ నుంచి పోటీ చేసే అవకాశం కల్పించారు. అలాగే హర్యానా నుంచి రేఖా శర్మ, ఒడిషా నుంచి సుజీత్ కుమార్ ను అభ్యర్థులుగా ఎంపిక చేశారు. వీరు త్వరలో రాజ్యసభకు జరిగే ఉపఎన్నికల్లో ఆయా రాష్ట్రాల నుంచి పోటీ చేయబోతున్నారు. వాస్తవానికి ఏపీలో వైసీపీలో రాజ్యసభ సభ్యులుగా ఉన్న మోపిదేవి వెంకటరమణ, బీద మస్తాన్ రావు, ఆర్ కృష్ణయ్య ఈ మధ్యే ఆ పార్టీకి, తమ పదవులకు రాజీనామా చేశారు. దీంతో వీరి రాజీనామాల్ని రాజ్యసభ ఛైర్మన్ ఆమోదించారు. ఈ నేపథ్యంలో ఏపీలో కూటమి నుంచి ముగ్గురు అభ్యర్థుల్ని గెలిపించుకునే అవకాశం ఉండటంతో ఆర్ కృష్ణయ్యకు బీజేపీ నుంచి అవకాశం కల్పించారు. అలాగే మిగిలిన రెండు సీట్లకు టీడీపీ అభ్యర్థుల్ని నిలబెట్టబోతోంది.

వైసీపీకి, ఎంపీ పదవులకు రాజీనామాలు చేసిన ముగ్గురు నేతల్లో ఆర్ కృష్ణయ్యకు బీజేపీ తిరిగి అవకాశం కల్పిస్తుండగా.. బీద మస్తాన్ రావుకు టీడీపీ అవకాశం ఇస్తోంది.


మూడో సీటుకు మాత్రం మోపిదేవి వెంకటరమణకు బదులుగా సానా సతీష్ కు అవకాశ దక్కనుంది.

ఇవాళ వీరిద్దరి పేర్లను టీడీపీ ప్రకటించబోతోంది. అనంతరం రేపు వీరు ఎంపీ అభ్యర్థులుగా నామినేషన్ దాఖలు చేస్తారు. రేపటితో రాజ్యసభ ఎన్నికల అభ్యర్థుల నామినేషన్ల గడువు ముగియనుంది.

## క్రిస్మస్ పండగకు
# 3 రోజుల సెలవులు

- 24 నుంచి 26 వరకు క్రిస్మస్ సెలవులను ప్రకటించిన సర్కార్
- 24న క్రిస్మస్ ఈవ్, 25న క్రిస్మస్, 26న బాక్సింగ్ డే జనరల్ హాలీడేలు
- తెలంగాణ వ్యాప్తంగా మూడు రోజులు స్కూళ్లకు హాలీడేస్

2



**హైదరాబాద్-నవభూమిబ్యూరో**

క్రిస్మస్ పండగకు తెలంగాణ ప్రభుత్వం సెలవులను ప్రకటించింది. హైదరాబాద్ తోపాటు తెలంగాణలోని అన్ని జిల్లాలకు వరుసగా మూడు రోజులు సెలవులు రానున్నాయి. డిసెంబర్ 24 నుంచి 26 వరకు ప్రభుత్వం క్రిస్మస్ సెలవులను ప్రకటించింది. దీంతో తెలంగాణలో అన్ని స్కూళ్లకు వరుసగా మూడు రోజులు సెలవులు రానున్నాయి. డిసెంబర్ 24న క్రిస్మస్ ఈవ్, 25న క్రిస్మస్, 26న బాక్సింగ్ డే జనరల్ హాలీడే కావడంతో వరుసగా మూడు రోజులు సెలవులు వస్తున్నాయి. తెలంగాణ వ్యాప్తంగా మూడు రోజులు స్కూళ్లకు హాలీడేస్ ఉండనున్నాయి. కాగా, 2023లో క్రిస్మస్ వేడుకలకు తెలంగాణ ప్రభుత్వం ఐదు రోజులు సెలవులు ప్రకటించింది. డిసెంబర్ 22

# నాకు ప్రాణహాని ఉంది

- మంచు మనోజ్, మౌనికపై సీపీకి మోహన్ బాబు ఫిర్యాదు
- మోహన్ బాబు కుటుంబంలో తీవ్ర విభేదాలు!
- ఇప్పటికే పోలీసులకు ఫిర్యాదు చేసిన మంచు మనోజ్
- తాజాగా రాచకొండ సీపీకి లేఖ రాసిన మోహన్ బాబు
- మనోజ్ నుంచి తనకు ముప్పు ఉందని వెల్లడి
- తనకు రక్షణ కల్పించాలని మోహన్‌బాబు విజ్ఞప్తి

2



**హైదరాబాద్-నవభూమిబ్యూరో**

టాలీవుడ్ సీనియర్ నటుడు మోహన్ బాబు కుటుంబంలో వివాదాలు రచ్చకెక్కాయి. ఇప్పటికే మంచు మనోజ్ పోలీసులకు ఫిర్యాదు చేయగా... తాజాగా మోహన్ బాబు

# యూటీఎఫ్ గెలిచింది

**గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బై పోల్‌లో యూటీఎఫ్ విజయం**

**అమరావతి-నవభూమిబ్యూరో**

గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బై పోల్ లో యూటీఎఫ్ విజయం సాధించింది. హెూరా హెూరీగా సాగిన ఉప ఎన్నికల పోరు లో తొలి రౌండ్ కౌంటింగ్‌లోనే యూటీఎఫ్ అభ్యర్థి గోపీ మూర్తి గెలుపొందారు. ఇక్కడ గెలుపును ఉపాధ్యాయ సంఘాలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. అయితే, యూటీఎఫ్ ఇక్కడ మరో సారి తమ పట్టు నిరూపించుకుంది. కౌంటింగ్ పూర్తి కాకుండా తొలి రౌండ్ లో 50 శాతానికి పైగా ఓట్లను దక్కించుకున్న గోపీ మూర్తి విజయం పైన ప్రకటన ఇక లాంఛనంగా మారింది. ఈ సాయంత్రానికి అధికారికంగా ఫలితం వెల్లడి కానుంది. గోదావరి పరిధిలోని అయిదు జిల్లాల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో యూటీఎఫ్ విజయం సాధించింది. తొలి ప్రాధాన్యత ఓట్లతో గోపీ మూర్తి కావాల్సిన మెజార్టీ నెంబర్ సాధించారు. ఈ నెల 5న జరిగిన ఎన్నిక ల్లో మొత్తం 15,495 మంది ఉపాధ్యాయులు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. కాగా, 50 శాతం పైగా ఓట్లను దక్కించుకోవటంతో గోపీ మూర్తి విజయం ఖాయమైంది. కొత్తగా గెలిచిన ఎమ్మెల్సీ కు రెండేళ్ల రెండు నెలల పదవీ కాలం మిగిలి ఉంది. 2లో

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
2 | హైదరాబాద్
మంగళవారం
10 । డిసెంబర్ । 2024




# హైదరాబాద్‌లో దట్టంగా అలుముకున్న పొగమంచు..

**హైదరాబాద్-నవభూమి:** హైదరాబాద్‌లో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఆదివారం ఉదయం నగరంలో వర్షం కురిసింది. రోజంతా మేఘావృతమై ఉంది. సోమవారం ఉదయానికి పరిస్థితి మారిపోయింది. జీహెచ్ఎంసీ వ్యాప్తంగా భారీగా మంచు కురుస్తున్నది. దట్టంగా మంచు అలుముకున్నన్నది. ఉదయం 8 గంటలు అయితే మంచు తెరలు వీడకపోవడంతో నగరవాసులు ఇబ్బందులు పడుతున్నారు. వాహనదారులు సమస్యలు ఎదుర్కొంటున్నారు. రోడ్లపై ముందు వెళ్తున్న వెహికల్స్ కనిపించకపోవడంతో లైట్లు వేసుకుని జర్నీ చేస్తున్నారు.

కాగా, రాష్ట్రంలో ఈ ఏడాది భిన్న వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. వానకాలంలో ఎండలు దంచికొట్టగా.. చలికాలంలో వర్షాలు కురుస్తున్నాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన పరిస్థితులే ఇందుకు కారణమని వాతావరణ కేంద్రం అధికారులు చెప్తున్నారు. కాగా, బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో ఆదివారం ఉదయం హైదరాబాద్‌లో వర్షం కురిసింది. ఈ నెల 14,15 తేదీల్లో అండమాన్ సమీపంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉన్నట్టు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. దీంతో 16,17తేదీల్లో రాష్ట్రంలో వర్షాలు కురిసే



# చెన్నమనేని రమేష్‌కు తెలంగాణ హైకోర్టులో చుక్కెదురు




**హైదరాబాద్-నవభూమి:** వేములవాడ మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్‌కు తెలంగాణ హైకోర్టులో చుక్కెదురైంది. కోర్టును తప్పుదోవ పట్టించినందుకు హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. చెన్నమనేని రమేష్ పిటిషన్ డిస్మిస్ చేసింది. పదిన్నర ఏళ్లపాటు హైకోర్టులో చెన్నమనేని రమేష్ కేసు సుదీర్ఘ విచారణ జరిగింది. విచారణ సమయంలో కోర్టుకు తప్పుడు సమాచారం ఇవ్వడంతో పాటు ఫేక్ డాక్యుమెంట్లు సమర్పించారని కోర్టు మండిపడింది. చెన్నమనేని రమేష్‌కు హైకోర్టు రూ.30 లక్షల జరిమానా విధించింది. ఆది శ్రీనివాస్‌కు రూ.25 లక్షలు చెల్లించాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. మరో రూ.5 లక్షలు హైకోర్టు లీగల్ సర్వీస్ అథారిటీకి చెల్లించాలని ఆదేశించింది. నెల రోజుల్లో చెల్లింపులు పూర్తిచేయాలని చెన్నమనేని రమేష్‌కు హైకోర్టు ఆదేశించింది. నెలరోజుల పాటు ఆర్డర్‌ను సస్పెన్షన్‌లో ఉంచాలని చెన్నమనేని రమేష్ న్యాయవాది కోరారు. చెన్నమనేని రమేష్ పౌరసత్వ పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టులో ఇవాళ(సోమవారం) విచారణ జరిగింది.

కాగా.. ఈరోజు తీర్పు నేపథ్యంలో మరికొన్ని అంశాలను న్యాయమూర్తి. ప్రస్తావించారు. ఇన్ని రోజులు చెన్నమనేని రమేష్ ఏ పాస్ పోర్ట్ మీద ట్రావెల్ చేస్తున్నారని హైకోర్టు ప్రశ్నించింది. జర్మనీ పాస్ పోర్ట్ మీద ట్రావెల్ చేశారని చెన్నమనేని తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. ఇప్పటికి జర్మనీ పాస్ పోర్ట్ ఉందని న్యాయవాది తెలిపారు. పాస్ పోర్ట్ ప్రామాణికం కాదని చెన్నమనేని తరపు న్యాయవాది తెలిపారు. ఇండియన్ పాస్ పోర్ట్ ఉందా అని న్యాయస్థానం ప్రశ్నించింది. లేదని కోర్టుకు తెలిపారు. చెన్నమనేని తరపు న్యాయవాది.. అన్ని వాదనలు పరిగణనలోకి తీసుకున్నామని హైకోర్టు తెలిపింది. తుది తీర్పు ప్రకటిస్తామని హైకోర్టు చెప్పింది. ఈరోజు హైకోర్టు తీర్పు వాయిదా వేసింది.

**2009లో రాజకీయాల్లోకి చెన్నమేని రమేష్‌బాబు అరంగ్రేటం..**

రాజన్న సిరిసిల్ల జిల్లా రాజకీయాల్లో చెన్నమనేని కుటుంబాలు లేకుండా చూడలేము. వేములవాడ నియోజకవర్గంలోని కోనరావుపేట మండలం నాగారం నుంచి మొదలైన చెన్నమనేనిల రాజకీయ ప్రస్థానం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా సాగింది. రాజేశ్వర్‌రావు వారసుడిగా 2009లో ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చిన చెన్నమేని రమేష్‌బాబు వరుసగా ఎన్నిక ల్లో గెలుస్తూ వస్తున్నారు. బీఆర్ఎస్ పార్టీలోనూ చురుకుగా రమేష్‌బాబు ఉన్నారు. 2009లో సార్వత్రిక ఎన్నికల్లో వేములవాడ నుంచి టీడీపీ అభ్యర్థిగా రమేష్‌బాబు పోటీ చేయగా ప్రత్యర్థిగా ఆది శ్రీనివాస్ నిలిచారు. స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి చవిచూసిన శ్రీనివాస్ రమేష్‌బాబు ఎన్నిక చెల్లదని తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో పౌరసత్వం పొందారని హైకోర్టును ఆశ్రయించారు.

**సుప్రీంకోర్టులో పిటిషన్**

2010 జూన్‌లో జరిగిన ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా రమేష్‌బాబు పోటీ చేసిన సందర్భంలోనూ ఆది శ్రీనివాస్ ఎన్నికల కమిషన్‌ను ఆశ్రయించారు. అప్పుడు ఎన్నికల కమిషన్‌షెడ్యూల్‌ను నిలిపివేసింది. హైకోర్టును బీఆర్ఎస్ పార్టీ ఆశ్రయించగా ఆరు నెలల్లోపు ఎన్నికలు నిర్వహించాల్సి ఉండటంతో ఎన్నికలు జరపాలని చెప్పింది. హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఉప ఎన్నికల్లో హైకోర్టు నిర్ణయాన్ని సుప్రీంకోర్టు తప్పు పట్టడం చర్చనీయాంశంగా మారింది. అప్పటి నుంచి రమేష్‌బాబు పౌరసత్వంపై ఆది శ్రీనివాస్ పోరాటం చేస్తూనే వచ్చారు. 2013లో రమేష్‌బాబు పౌరసత్వాన్ని శాసనసభ సభ్యత్వాన్ని హైకోర్టు రద్దు చేసింది. రమేష్‌బాబు సుప్రీం కోర్టును ఆశ్రయించి స్టే పొందారు. 2014 ఎన్నికల్లో మరోసారి రమేష్‌బాబు గెలుపొందారు. కేంద్ర హోంశాఖ సుప్రీంకోర్టు ఆదేశాలతో 2017లో రమేష్‌బాబు పౌరసత్వాన్ని రద్దు చేసింది. హోంశాఖ హైకోర్టును సంప్రదించవచ్చని పేర్కొనడంతో మళ్లీ హైకోర్టుకు చేరుకుంది.

# విద్యార్థులకు గుడ్ న్యూస్... స్కూళ్లకి వరుసగా సెలవులు




**హైదరాబాద్-నవభూమి:** తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలలకు వరుస సెలవులు వచ్చాయి. డిసెంబర్ 25వ తేదీ క్రిస్మస్. ఈ పర్వదినాన్ని పురస్కరించుకొని వరుసగా మూడు రోజులపాటు పాఠశాలకు సెలవులు ప్రకటించాయి. దీంతో డిసెంబర్ 24వ తేదీ నుంచి 26వ తేదీ వరకు పాఠశాలలు సెలవులు ఇచ్చేశారు. డిసెంబర్ 24వ తేదీ క్రిస్మస్ ఈవ్, 25వ తేదీ క్రిస్మన్ పర్వదినం, 26వ తేదీ బాక్సింగ్ డే సందర్భంగా సెలవులు ఇచ్చాయి. ఇక హైదరాబాద్ లోని పలు స్కూళ్లకు డిసెంబర్ 24వ తేదీ ఆప్షనల్ హాలిడేగా ఉంటుంది. డిసెంబర్ 25వ తేదీ క్రీస్తు జన్మదినం సందర్భంగా క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహిస్తారు. అలాగే డిసెంబర్ 26వ తేదీ బాక్సింగ్ దినోత్సవం జరుపుకుంటారు. ఇది సాధారణ సెలవు దినంగా భావిస్తారు.జీసెస్ క్రీస్తు.. డిసెంబర్ 25వ తేదీని జన్మించారు. ఆయన జన్మదినాన్ని పురస్కరించుకొని ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది ప్రజలు.. క్రిస్మస్ వేడుకలను ఘనంగా జరుపుకోనున్నారు. ఆ క్రమంలో క్రిస్మస్ చెట్లను అలంకరించడం, పాటలు పాడటంతోపాటు బహుమతులు ఇచ్చి పుచ్చుకుంటారు. ఇక క్రిస్మస్ ఈవ్ సెలవు ఐచ్ఛికం. ఈ నేపథ్యంలో హైదరాబాద్ లోని పలు పాఠశాలలు రెండు లేదా మూడు రోజుల సెలవులు ప్రకటించే అవకాశముంది.

# గ్రూప్-2 హాల్ టికెట్‌పై అభ్యర్థి ఫొటో తప్పనిసరి.. నిబంధనలు ఇవే..!



**హైదరాబాద్-నవభూమి:** ఈ నెల 15, 16 తేదీల్లో నిర్వహించనున్న గ్రూప్-2 ఎగ్జామ్స్‌కు సంబంధించిన హాల్ టికెట్లు విడుదలైన సంగతి తెలిసిందే. ఈ రెండు రోజుల్లో రెండు సెషన్లలో పరీక్షలు నిర్వహించనున్నారు. అయితే పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు తప్పనిసరిగా తమ హాల్ టికెట్లపై పాస్ పోర్ట్ సైజ్ ఫొటోను అతికించుకోవాలి. లేని యెడల సదరు అభ్యర్థిని పరీక్షకు అనుమతించబోమని అధికారులు స్పష్టం చేశారు.అభ్యర్థులు బ్లాక్ లేదా బ్లూ బాల్ పాయింట్ పెన్‌ను మాత్రమే వినియోగించాలని సూచించారు. ఇక ప్రభుత్వంచే జారీ చేయబడ్డ గుర్తింపు కార్డును పరీక్షా కేంద్రం వద్ద చూపిస్తేనే అనుమతించనున్నారు. పాస్ పోర్ట్, పాన్ కార్డు, ఓటర్ ఐడీ, ఆధార్ కార్డు, గవర్నమెంట్ ఎంప్లాయ్ ఐడీ, డ్రైవింగ్ లైసెన్స్‌ను గుర్తింపు కార్డు కింద పరిగణించనున్నారు.ఇక ఉదయం సెషన్‌కు ఉదయం 8.30 గంటల నుంచి, మధ్యాహ్నం సెషన్‌కు 1.30 నుంచి పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించనున్నారు. మార్నింగ్ సెషన్‌కు ఉదయం 9.30 గంటలకు, మధ్యాహ్నం సెషన్‌కు 2.30 గంటలకు పరీక్షా కేంద్రాల గేట్లు మూసివేయనున్నారు. అంటే పరీక్ష ప్రారంభానికి అర గంట ముందే గేట్లు క్లోజ్ చేయనున్నారు. ఆ తర్వాత ఎవరికి అనుమతి ఉండదని స్పష్టం చేశారు.క్యాలికులేటర్స్, పేజర్స్, సెల్ ఫోన్స్, ట్యాబ్లెట్స్, పెన్ డ్రైవ్‌లు, సెల్ ఫోన్స్, బ్లూ టూత్ డివైజెస్, వాచ్, మ్యాథమేటికల్ టేబుల్స్, లాగ్ బుక్స్, లాగ్ టేబుల్స్, వాలెట్స్, హ్యాండ్ బ్యాగ్స్, పౌచెస్, రైటింగ్ ప్యాడ్స్, నోట్స్, చార్ట్స్, జ్యువెలరీ (మంగళసూత్రం, గాజులకు అనుమతి ఉంది) వంటి వస్తువులకు అనుమతి లేదు. షూ ధరించిన అభ్యర్థులకు అనుమతి లేదు.

# సింగపూర్‌లో ఉద్యోగాలంటూ చీటింగ్




**హైదరాబాద్-నవభూమి:** సింగపూర్‌లో ఉద్యోగాలు, వీసాలు ఇప్పిస్తామంటూ నమ్మిస్తూ మోసాలకు పాల్పడుతున్న ఇద్దరిని నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. డీసీపీ సుదీంద్ర కథనం ప్రకారం.. ఆసిఫ్‌నగర్‌కు చెందిన ఏరువ అభిషేక్‌రెడ్డి గతంలో సింగపూర్‌కు జాబ్ వీసాపై వెళ్లి వచ్చాడు. అదే అనుభవంతో హిమాయత్‌నగర్‌లోని కుబేరా టవర్‌లో జేఎంజేరెడ్డి పేరుతో జాబ్ కన్సల్టెన్సీ ప్రారంభించాడు.ఇతనికి కరీంనగర్‌కు చెందిన తుమ్మ చిన్నమ్మ అనే మహిళ సహకారం అందిస్తోంది. విదేశాల్లో ఉద్యోగాలు కావాలనుకునే వారిని ఆకర్షిస్తూ సింగపూర్‌లో మంచి ఉద్యోగాలిప్పిస్తామని, వీసా, ప్లేస్‌మెంట్ మొత్తం చేయిస్తామంటూ నమ్మిస్తారు. వీరి మాటలు నమ్మి సుమారు 25 మంది వరకు వారిని సంప్రదించగా, నిరుద్యోగుల నుంచి రూ. 83 లక్ష ల వరకు వసూలు చేశారు.డబ్బులు వసూ లు చేసిన తరువాత కన్సల్టెన్సీలో ఉండకుం డా, ఫోన్ చేసినా లిఫ్ట్ చేయకుండా దాటవేత ధోరణిని ప్రదర్శిస్తూ తప్పించుకు తిరుగుతూ తమ కార్యాలయాన్ని అల్వాల్‌కు మార్చారు. బాధితులు నారాయణగూడ, అల్వాల్ పోలీస్‌స్టేషన్‌లలోనూ ఫిర్యాదు చేశారు. అప్పటి నుంచి ఇద్దరు నిందితులు అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ సైదులు బృందం రంగంలోకి దిగి ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి, కారును స్వాధీనం చేసుకున్నారు.

# జయ జయహే తెలంగాణ తల్లి

**హైదరాబాద్-నవభూమిబ్యూరో:** తెలంగాణ తల్లి విగ్రహాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం సాయంత్రం ఆవిష్కరించారు. బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయం ప్రాంగ ణంలో ఏర్పాటు చేసిన 20 అడుగుల కాంస్య విగ్రహాన్ని సీఎం రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అధికారులు పాల్గొన్నారు. ఆకుపచ్చ చీర, గుండుపూసలు, హారం, ముక్కుపుడక, కడియాలు, మెట్టలతో పాటు చాకలి ఐలమ్మ, సమ్మక్క–సారక్క పోరాట స్ఫూర్తితో తెలంగాణ తల్లి విగ్రహాన్ని రూపొందించారు. వరి, జొన్న, సజ్జలు, మొక్కజొన్నలు, ఆ తల్లి చేతిలో కనిపించేలా రూపకల్పన చేశారు. కవి అందెశ్రీ తోపాటు పలువురు ప్రముఖులను ఈ సందర్భంగా సత్కరించారు. తెలంగాణ తల్లి విగ్రహాన్ని అధికారికంగా ఆమోదిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తెలుగులో ఉత్తర్వులు జారీ చేసింది. ప్రతి ఏటా డిసెంబర్ 9న తెలంగాణ తల్లి అవతరణ ఉత్సవాన్ని జరపాలని నిర్ణయించింది. తెలంగాణ తల్లి జాతి అస్తిత్వ, ఆత్మగౌరవ ప్రతీక కాబట్టి.. చిత్ర రూపాన్ని వక్రీకరించడం, వేరే విధంగా చూపడాన్ని నిషేధిస్తున్నట్లు ప్రకటించింది. తెలంగాణ రూపాన్ని వక్రీకరించడం, వేరే విధంగా చూపడాన్ని నిషేధిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. తెలంగాణ చిత్రాన్ని బహిరంగంగా లేదా సోషల్ మీడియాల్లో మాటలు, చేతలతో అగౌరర్చడం, ధ్వంసం చేయడం, కాల్చడం, అవహేళన చేయడం, అవమానించడం, కించపరచడాన్ని నేరంగా పరిగణించనున్నట్లు పేర్కొంది.ఇక నుంచి డిసెంబర్ 9న తెలంగాణ తల్లి అవతరణ ఉత్సవాన్ని రాష్ట్ర, జిల్లా, మండలాల్లోని ప్రభుత్వ కార్యాలయాల్లో అధికార కార్యక్రమంగా జరుపుకోవాలని ప్రభుత్వం తెలిపింది. రాష్ట్ర బహుజనుల పోరాట పటిమ, సాంస్కృతిక, సంప్రదాయక, వ్యవసాయ పద్ధతులను, శ్రమించే జీవనశైలిని, భావితరాలకు స్ఫూర్తిని కలిగించే చిహ్నంగా తెలంగాణ తల్లి ఉండాలని ప్రభుత్వం భావించినట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది. మరోవైపు, సోమవారం జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో తెలంగాణ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన గురించి సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. "చరిత్ర ఉన్నంతవరకు తెలంగాణ ప్రజల గుండెల్లో మధుర జ్ఞాపకంగా నిలిచిపోయే అంశాన్ని ఈ రోజు మీ అనుమతితో నేను పవిత్ర శాసనసభలో ప్రస్తావిస్తున్నానని.. పేర్కొంటూ.. "నా తెలంగాణ కోటి రతనాల వీణ నా తెలంగాణ తల్లి కంజాత వల్లి.. అన్న మహాకవి దాశరథి మాటలు నిత్య సత్యాలు తెలంగాణ జాతికి నిరంతర స్ఫూర్తి వ్యాఖ్యలు. ఈ భూ ప్రపంచంలోని ఏ జాతికైనా గుర్తింపు గౌరవం ఆ జాతి అస్తిత్వమే. అస్తిత్వానికి మూలం సంస్కృతి. ఆ సంస్కృతికి ప్రతిరూపమే తల్లి అని సీఎం రేవంత్ పేర్కొన్నారు.

# రాజ్యసభ ఛైర్మన్‌పై అవిశ్వాసం

(1వపేజీ తరువాయి)పర్వం కూడా కొనసాగుతోంది. అదే సమయంలో రాజ్యసభ ఛైర్మన్ జగ్ దీప్ ధన్ కర్ విషయంలో విపక్షాలు తీవ్ర అసంతృప్తిగా ఉన్నాయి. దీంతో ధన్‌కర్‌పై అవిశ్వాసం పెట్టేందుకు సిద్ధమవుతున్నాయి. ప్రధాన విపక్షం కాంగ్రెస్ పార్టీతో రాజ్యసభ ఛైర్మన్ జగ్ దీప్ ధన్ కర్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టించి తాము మద్దతివ్వడమా లేక ఇండియా కూటమి అంతా ఏకమై ఈ అవిశ్వాస తీర్మానం పెట్టాలా అన్న దానిపై చర్చిస్తున్నట్లు తెలుస్తోంది. రాజ్యసభ ఛైర్మన్‌గా ఉంటూ అధికార పక్షానికి వంత పాడుతున్నారనేది ధన్ కర్‌పై ప్రధాన అభియోగం. దీనిపై పలుమార్లు ఆయన్ను కలిసి చర్చించినా ఫలితం లేకపోవడంతో అవిశ్వాసం పెట్టి తీరాలని విపక్షాలు భావిస్తున్నాయి. "రాజ్యసభ ఎంపీ సీట్లో డబ్బు కట్టలు–పార్లమెంట్లో కలకలం..!" వాస్తవానికి లోక్ సభతో పోలిస్తే పెద్దల సభ అయిన రాజ్యసభలో ఎంపీల సస్పెన్షన్లతో పాటు దూకుడు నిర్ణయాలు దాదాపుగా ఉండేవి కాదు. కానీ కొంతకాలంగా పరిస్థితి మారుతోంది. అదే సమయంలో విపక్షాల నుంచి ఎదురవుతున్న డిమాండ్లను ధన్ కర్ అస్సలు పట్టించుకోవడం లేదని, అధికార పక్షానికి పూర్తి అనుకూలంగా వ్యవహరిస్తున్నారనే చర్చ సాగుతోంది. ఈ నేపథ్యంలో ధన్ కర్‌ను అవిశ్వాసం పెట్టి ఇరుకునపెట్టాలని ఇండియా కూటమి భావిస్తోంది. అయితే రాజ్యసభలో తాజాగా మెజార్టీలోకి వచ్చిన అధికార ఎన్డీఏ.. అవిశ్వాసాన్ని అడ్డుకునే అవకాశాలున్నాయి.

# నాగబాబుకు మంత్రి పదవి

(1వపేజీ తరువాయి)టూ జరిగిన ప్రచారానికి నేటితో తెరపడింది. జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి నాగబాబును రాష్ట్ర మంత్రివర్గంలోకి తీసుకోవాలని నిర్ణయించినట్టు సీఎం చంద్రబాబు ఓ ప్రకటనలో తెలిపారు. ఏపీలో 175 అసెంబ్లీ స్థానాలు ఉండగా, పాతికమంది మంత్రులకు అవకాశం ఉంది. ప్రస్తుతం చంద్రబాబు క్యాబినెట్ లో 24 మంది మంత్రులు ఉన్నారు. జనసేన పార్టీకి 4 మంత్రి పదవులు ఇవ్వాల్సి ఉండగా, ప్రస్తుతం పవన్ కల్యాణ్, నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేశ్ మంత్రులుగా ఉన్నారు. ఇప్పుడు జనసేన నుంచి నాలుగో మంత్రిగా నాగబాబు క్యాబినెట్ లోకి ఎంట్రీ ఇవ్వనున్నారు.

# యూటీఎఫ్ గెలిచింది

(1వపేజీ తరువాయి)ఈ రోజు కాకినాడ జేఎన్టీయూలో 14 టేబు ళ్లలో కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. లెక్కింపు ప్రారంభమైన సమయం నుంచి గోపీ మూర్తి ఆధిక్యత కొనసాగుతోంది. 2/3 ఓట్లతో గోపీ మూర్తి విజయం ఖాయం చేసుకున్నారు. "కాకినాడ పోర్టుపై సీబీఐ లేదా సీఐడీ దర్యాప్తు? షిప్ సంగతీ తేల్చబోతున్న ఏపీ కేబినెట్..!" ఈ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఐదు జిల్లాల పరిధిలో 16,737 మంది ఓటర్లు ఉన్నారు. కానీ 15,490 ఓటర్లు మాత్రమే ఓటు హక్కును వినియోగించుకున్నారు. కాకినాడ జిల్లాలో మొత్తం 3418 మంది ఓటర్లు ఉన్నారు.

# నాకు ప్రాణహాని ఉంది

(1వపేజీ తరువాయి)కూడా పోలీసులను ఆశ్రయించారు. తన చిన్న కుమారుడు మంచు మనోజ్, కోడలు మౌనికపై చర్యలు తీసుకోవాలంటూ మోహన్ బాబు రాచకొండ పోలీస్ కమిషనర్ కు ఫిర్యాదు చేశారు. మంచు మనోజ్ నుంచి తనకు ముప్పు ఉందని పేర్కొన్నారు. తనకు రక్షణ కల్పించాలని పోలీసులను కోరారు. ఈ మేరకు మోహన్ బాబు సీపీకి లేఖ రాశారు. మళ్లీ తన ఇంటికి వచ్చి, కొందరు సంఘ విద్రోహ శక్తులతో కలిసి అలజడి సృష్టిస్తున్నాడని మోహన్ బాబు తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ రోజు ఉదయం తన నివాసంలో పరిచయం లేని కొత్త వ్యక్తులు ఉండడాన్ని గమనించానని, తాను ఆఫీసుకు వెళ్లగానే, తన ఇంటి వద్ద పరిస్థితి బాగా లేదని సిబ్బంది సమాచారం అందించారని వివరించారు. "మనోజ్ కు చెందినవారుగా భావిస్తున్న 30 మంది వ్యక్తులు నా నివాసంలోకి చొరబడేందుకు ప్రయత్నించారు. తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని నా సిబ్బందిని బెదిరించారు. మంచు మనోజ్, మౌనికల ఆజ్ఞల మేరకే వారు అలా ప్రవర్తించారు. నా ఇంటిని ఆక్రమించుకోవడమే కాకుండా, నా సిబ్బందిని బెదిరించారు. వారు నా ఇంటిలోనే తిష్ట వేసి, నా కోసం కాచుకుని ఉన్నట్టు తెలిసింది. అందువల్ల నాకు ముప్పు ఉండడంతో, నా ఇంటికి వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఈ కుట్రకు కారకులు మనోజ్, మౌనిక. ఇప్పుడు నా వయసు 78 సంవత్సరాలు. ఈ వయసులో ఇలాంటి పరిస్థితులు ఎదుర్కోవాల్సి రావడంతో నాకు తీవ్ర ముప్పు ఉందని భావిస్తున్నాను. నా ఆస్తులు కూడా ప్రమాదంలో పడ్డాయి. అందుకే నా కొడుకు మనోజ్, కోడలు మౌనికపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను. నా నివాసం నుంచి మనోజ్, మౌనికలతో పాటు, ఇతర సంఘ విద్రోహ శక్తులను పంపించివేయండి. ముప్పు ఉన్న దృష్ట్యా నాకు తగిన భద్రత కల్పించండి... ఎలాంటి భయం లేకుండా ఇంటికి వెళ్లేలా చర్యలు తీసుకుంటారని ఆశిస్తున్నాను" అంటూ మోహన్ బాబు తన లేఖలో పేర్కొన్నారు. మోహన్ బాబు ఈ లేఖ ప్రతులను పహాడీ షరీఫ్ ఎస్సై, ఏసీపీ... మహేశ్వరం డీసీపీకి కూడా పంపారు.

### పవన్‌ను లేపేస్తాం..

(1వపేజీ తరువాయి)తెలిపారు. ఏపీ సచివాలయంలోని రెండో బ్లాక్ లో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పేషీ ఉంది. ఇవాళ పవన్ కళ్యాణ్ లేని సమయంలో పేషీకి ఆయన్ను చంపేస్తామంటూ ఆగంతకుల నుంచి బెదిరింపు కాల్స్ తో పాటు మెసేజ్ లు కూడా వచ్చాయి. ఇందులో పవన్ ను అసభ్య భాషలో జారీ చేసిన హెచ్చరికలు కూడా ఉన్నాయి. దీంతో పేషీ సిబ్బంది ఆందోళనకు గురయ్యారు. విషయాన్ని పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన సూచన మేరకు పేషీ సిబ్బంది పోలీసు ఉన్నతాధికారుల దృష్టికి విషయం తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన పోలీసు ఉన్నతాధికారులు.. పవన్ కళ్యాణ్ పేషీకి ఎక్కడ నుంచి ఈ బెదిరింపు కాల్స్, మెసేజ్ లు వచ్చాయో ఆరా తీస్తున్నారు. పవన్ తో పాటు మరే ఇతర మంత్రి పేషీకి అయినా ఇలా కాల్స్ వచ్చాయోమోనని పరిశీలిస్తున్నారు.

# ఆర్బీఐ కొత్త గవర్నర్‌గా సంజయ్ మల్హోత్రా

(1వపేజీ తరువాయి)సంజయ్ పనిచేశారు. రెవెన్యూ కార్యదర్శిగా పన్ను వసూళ్లను పెంచడంలోనూ, జీఎస్టీ రూపురేఖలు మార్చడంలో మల్హోత్రా కీలక పాత్ర పోషించారు. విద్యుత్, ఆర్థిక, పన్ను విధింపు, ఐటీ, మైనింగ్ రంగాల్లో 30 ఏళ్లుగా పనిచేస్తున్న అనుభవం ఆయనకు ఉంది. "ఏపీలో సంపద సృష్టించడం అంటే అప్పులు చేయడమే– సింపుల్ లాజిక్: మరో రూ.2,000 కోట్ల రుణం" రాజస్థాన్ విద్యుత్ ఒప్పందాలు చేసుకోవడంలో సంజయ్ ది కీలక పాత్ర. కేంద్ర విద్యుత్ శాఖ అదనపు కార్యదర్శిగా పనిచేసిన సమయంలో సంజయ్ మల్హోత్రా డిస్కంల ప్రైవేటీకరణతో పాటు పలు సంస్కరణలు తీసుకొచ్చారు. 2020లో ఆర్ఈసీ ఛైర్మన్, ఎండీగా కూడా ఆయన పనిచేశారు. ప్రస్తుతం ఆర్బీఐ గవర్నర్ గా ఉన్న శక్తికాంత దాస్ పదవీకాలం రేపటితో ముగియనుంది. దీంతో ప్రస్తుతం ఆర్థికశాఖలో రెవెన్యూ కార్యదర్శిగా పనిచేస్తున్న ఆయనను ఇవాళ కేబినెట్ నియామకాల కమిటీ ఆర్బీఐ కొత్త గవర్నర్ గా ఎంపిక చేసింది. ఆర్బీఐకి 26వ గవర్నర్ గా ఆయన బాధ్యతలు చేపట్టబోతున్నారు.

# తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు 16 వరకు వాయిదా

(1వపేజీ తరువాయి)అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యాక సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ తల్లి విగ్రహం నమూనా అంశంపై వివరణ ఇచ్చారు. విగ్రహం నమూనా మార్పుపై అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య వాగ్వాదం జరిగింది. పలువురు సభ్యులు కొన్ని సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆ తర్వాత ప్రతి సంవత్సరం డిసెంబర్ 9న తెలంగాణ తల్లి ఆవిర్భావ దినోత్సవ వేడుకలను అధికారికంగా జరుపుకోవాలని సభలో నిర్ణయించారు. అనంతరం సభను 16వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ ప్రకటించారు.

# క్రిస్మస్ పండగకు 3 రోజుల సెలవులు

(1వపేజీ తరువాయి)నుంచి 27 వరకు సెలవులు ఇచ్చింది. ఏసు క్రీస్తు జన్మదినాన్ని పురస్కరించుకుని క్రిస్మస్ పండగను ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది క్రిస్టియన్ సోదరులు వేడుకగా జరుపుకుంటారు. క్రిస్మస్ చెట్లను అలంకరించడం, పాటలు పాడటం, కేక్‌లు పంచుకోవడం, బహుమతులు ఇచ్చిపుచ్చుకోవడం వంటి సంప్రదాయాలు అనుసరిస్తారు. క్రిస్మస్ గ్రీటింగ్స్ పేరిట మోసాలు: అలర్ట్ క్రిస్మస్ పండగను ఆసరాగా చూసుకునే కొందరు సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారు. క్రిస్మస్ శుభాకాంక్షలు.. మెర్రీ క్రిస్మస్, మీరు మా ప్రియమైన కస్టమర్.. ఈ గిఫ్ట్ మీ కోసమే..' అంటూ అపరిచిత వ్యక్తుల నుంచి మీకు సందేశాలతో కూడిన శుభాకాంక్షలు వెల్లువెత్తితే మీరు జాగ్రత్తగా ఉండాల్సిందే. ఇలాంటి మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.ఏదో బహుమతి వస్తుందంటూ ఆశతో దుండగులు పంపిన లింక్స్‌పై క్లిక్ చేస్తే.. ఫోన్లో మాల్వేర్ ఇన్‌స్టాల్ అయి, వ్యక్తిగత డేటా చోరీ చేస్తారని హెచ్చరిస్తున్నారు. సైబర్ మోసగాళ్లు ఇదో రకం కొత్త మోసానికి పాల్పడుతున్నారని అన్నారు. తెలియని వ్యక్తుల నుంచి క్రిస్మస్ విషెస్ అంటూ వచ్చే సందేశాలను క్లిక్ చేయవద్దని సూచించారు. అప్రమత్తంగా లేకుంటే.. మీ బ్యాంక్ ఖాతాలు ఖాళీ అవుతాయని హెచ్చరించారు.


# ఏపీలో మరో రేషన్ బియ్యం కలకలం

(1వపేజీ తరువాయి)మారినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వైజాగ్ పోర్ట్‌లో తనిఖీలు చేశారు. ఇందులో అక్రమ రవాణా వ్యవహారం వెలుగుచూసింది. కంటైనర్ ఫ్రైట్ స్టేషన్లో ఎగుమతికి సిద్ధంగా వున్న బియ్యాన్ని మంత్రి గుర్తించారు. దీన్ని సీజ్ చేయాలని అక్కడికక్కడే ఆదేశాలు ఇచ్చారు. దీంతో మొత్తం 483 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ప్రత్యేక బృందాలు సీజ్ చేశాయి. " వాస్తవానికి కాకినాడ పోర్టు నుంచి రేషన్ బియ్యం అక్రమ రవాణాపై నిఘా పెరగడంతో రెండు నెలలుగా అక్రమార్కులు విశాఖ పోర్ట్ ను ఎంచుకున్నట్లు గుర్తించారు. కాకినాడ పోర్టుకు బదులుగా విశాఖ పోర్టు నుంచే విదేశాలకు అక్రమంగా రేషన్ బియ్యం ఎగుమతి చేస్తున్నట్లు గుర్తించారు. "ఏపీలో ఉచిత గ్యాస్ సిలెండర్లు అప్పటి నుంచే–షరతులివే–మంత్రి ప్రకటన..!" ఇవాళ పట్టుకున్న బియ్యం రేషన్ బియ్యంగానే గుర్తించారు. అనంతరం దీన్ని మంత్రి దగ్గరుండి సీజ్ చేయించారు. అయితే నెల రోజుల వ్యవధిలోనే ఇలా రాష్ట్రంలోని రెండు పోర్టుల్లో రేషన్ బియ్యం భారీగా పట్టుబడటం కలకలం రేపుతోంది.

# ఏపీ నెక్స్ట్ సీఎస్‌గా విజయానంద్?

(1వపేజీ తరువాయి)జాబితాను పరిగణలోకి తీసుకుంటే ఓ ఆసక్తికర పేరు వచ్చిందని అంటున్నారు. ఆమెకు చంద్రబాబు ఏమాత్రం అంగీకారం తెలపరని నొక్కి చెబుతున్నారు. ఎందుకంటే... సీనియారిటీ జాబితాలో టాప్‌లో ఉన్న పేరు యర్రా శ్రీలక్ష్మి అని చెబుతున్నారు. దీంతో... మరో అధికారి పేరు తెరపైకి వస్తోంది. ఉమ్మడి ఏపీలో, కాంగ్రెస్ ప్రభుత్వంలో, వైఎస్సార్ సీఎంగా ఉన్నప్పుడు శ్రీలక్ష్మి చాలా కీలకంగా వ్యవహరించారని అంటారు! ఇక జగన్ అక్రమాస్తుల కేసులో ఆమె జైలుకు సైతం వెళ్లి వచ్చారు. అయితే... రాష్ట్ర విభజన అనంతరం ఏపీలో వైసీపీ ప్రభుత్వ ఏర్పడిన తర్వాత ఆమెకు కీలక పదవి దక్కింది. ఇందులో భాగంగా.. రాష్ట్ర మున్సిపల్ అండ్ అర్బన్ డెవలప్ మెంట్ డిపార్ట్ మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీగా ఆమె వ్యవహరించారు. అయితే... వైసీపీ సర్కార్ పోయి కూటమి ప్రభుత్వం కొలువుదీరినప్పటి నుంచి నేటి వరకూ ఆమెకు పోస్టింగ్ ఇవ్వలేదు! చంద్రబాబు మనసులో మరో పేరు!: సీనియరిటీ సంగతి కాసేపు పక్కనపెడితే.. చంద్రబాబు చూపు మాత్రం ఓ అధికారివైపు ఉందని అంటున్నారు. ఇందులో భాగంగా.. ఏపీ ఎనర్జీ డిపార్ట్ మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న కే విజయానంద్ పేరును బాబు పరిశీలిస్తున్నారని అంటున్నారు. ఈయన సీనియారిటీ పైనా, సమర్థతపైనా బాబుకు సదాభిప్రాయం ఉందని చెబుతున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఏపీ జెన్ కో, ఏపీ ట్రాన్స్ కో సీఎండీగా పనిచేసిన విజయానంద్.. రాష్ట్ర విభజన దగ్గర నుంచి నేటి వరకూ విద్యుత్ శాఖకే సేవలందిస్తున్నారు. ఏపీలో ప్రభుత్వాలు మారినా.. ఆయన పనిచేసే శాఖ మాత్రం మారడం లేదు. దీంతో... దీనికి ఆయనకు విద్యుత్ శాఖపై ఉన్న పట్టే కారణం అని అంటున్నారు. ట్రాన్స్ కో, జెన్ కో సీఎండీ కంటే ముందు ఉమ్మడి నల్గొండ, రంగారెడ్డి జిల్లాల కలెక్టర్ గానూ పని చేసిన విజయానంద్.. గతంలో ఇన్ ఛార్జ్ సీఎస్ గానూ పనిచేసిన అనుభవాన్ని కలిగి ఉన్నారు. ఇదే సమయంలో.. రాష్ట్ర ఎన్నికల సంఘం సీఈవోగానూ బాధ్యతలు నిర్వహించారు! దీంతో... ఈయన సమర్థతపైనే బాబు ఆసక్తి కనబరుస్తున్నారని అంటున్నారు.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
3
హైదరాబాద్
మంగళవారం
10 । డిసెంబర్ । 2024



# గుర్రపు బండిని వేగంగా ఢీకొట్టిన కారు.. తర్వాత ఏం

**లక్నో-నవభూమి:** వేగంగా వెళ్తున్న కారు ఒక గుర్రపు బండిని ఢీకొట్టింది. దీంతో ఆ గుర్రం ఏడు అడుగుల మేర గాలిలోకి ఎగిరింది. సుమారు 20 అడుగుల దూరంలో పడిన గుర్రం అక్కడికక్కడే చనిపోయింది. ఈ ప్రమాదంలో ఐదుగురు వ్యక్తులు గాయపడ్డారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఉత్తరప్రదేశ్‌లోని బాగ్‌పట్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. సోమవారం ఉదయం 9 గంటల సమయంలో కొందరు వ్యక్తులు ఒక గుర్రం బండిపై ప్రయాణించారు. బాగ్‌పట్‌లోని గౌరీపూర్ ప్రాంతంలో రోడ్డు మలుపు నుంచి ఢిల్లీ-సహారన్‌పూర్ హైవేలోకి ఆ గుర్రం బండి ప్రవేశించింది.



కాగా, జాతీయ రహదారిపై ఒక కారు వేగంగా దూసుకెళ్లింది. ఆ రహదారిపైకి ప్రవేశించిన ఆ గుర్రం బండిని బలంగా ఢీకొట్టింది. ఈ ధాటికి ఆ గుర్రం ఏడు అడుగుల మేర గాలిలోకి ఎగిరింది. సుమారు 20 అడుగుల దూరంలో అది పడింది. తీవ్రంగా గాయపడిన ఆ గుర్రం అక్కడికక్కడే చనిపోయింది. గుర్రం బండిలో ప్రయాణించిన వారితో సహా ఐదుగురు వ్యక్తులు ఈ సంఘటనలో గాయపడ్డారు. మరోవైపు ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. తీవ్రంగా గాయపడిన ఐదుగురు వ్యక్తులను ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గుర్రం మృతికి కారణమైన కారును గుర్తించారు. కాగా, ఆ ప్రాంతంలోని సీసీటీవీలో రికార్డైన వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

## ఏకాభిప్రాయం ద్వారా 'ఇండియా బ్లాక్' లీడర్‌ను ఎన్నుకుంటాం: తేజస్వీ యాదవ్



**పాట్నా-నవభూమి:** ప్రతిపక్షాల కూటమి 'ఇండియా' బ్లాక్ లీడర్‌ను ఏకాభిప్రాయం ద్వారా ఎన్నుకుంటామని ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ తెలిపారు. టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీతో సహా కూటమికి చెందిన ఏ సీనియర్ నాయకుడైనా నాయకత్వం వహించడం పట్ల తనకు ఎలాంటి అభ్యంతరం లేదని అన్నారు. పలు రాష్ట్రాల్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘోర పరాజయాన్ని చవిచూసింది. ఈ నేపథ్యంలో 'ఇండియా' బ్లాక్ కూటమికి కాంగ్రెస్ నాయకత్వంపై పలు ప్రాంతీయ పార్టీలు అసంతృప్తి వ్యక్తం చేశాయి. కూటమిని లీడ్ చేసేందుకు కొత్త సారథి కావాలని ఆశిస్తున్నాయి.
ఈ నేపథ్యంలో తేజస్వీ యాదవ్ మీడియాతో మాట్లాడారు. 'కూటమికి మమతా బెనర్జీ నాయకత్వం వహించడంలో మాకు ఎలాంటి సమస్య లేదు. కానీ బీజేపీ వ్యతిరేక కూటమిలో చాలా మంది సీనియర్ రాజకీయ నాయకులున్నారన్నది గుర్తించుకోవాలి. కూటమి నేతను ఎన్నుకోవడంపై కలిసి కూర్చుని సమిష్టి నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉంది. అయితే అన్ని పార్టీల ఏకాభిప్రాయం ద్వారానే ఇది జరుగుతుంది' అని అన్నారు. మరోవైపు 'ఇండియా' కూటమికి నేతృత్వం వహించడంపై టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ ఆసక్తి చూపారు. బెంగాల్ సీఎం పదవిని నిర్వహిస్తూనే 'ఇండియా' బ్లాక్ బాధ్యతలను కూడా చేపట్టగలనని అన్నారు. ఎన్సీపీ (ఎస్పీ) చీఫ్ శరద్ పవార్ కూడా దీనికి మద్దతిచ్చారు. మమతా బెనర్జీ సమర్థురాలని, 'ఇండియా' బ్లాక్‌కు నేతృత్వం వహించే హక్కు ఆమెకు ఉందని అన్నారు.

## కారులో చెలరేగిన మంటలు.. నడిరోడ్డుపై బుగ్గిబుగ్గి..



**న్యూఢిల్లీ-నవభూమి:** ఈ మధ్య కాలంలో రోడ్లపై పరుగులు పెడుతుండగానే వాహనాల్లో మంటలు చెలరేగుతున్న ఘటనలు పెరిగిపోతున్నాయి. బస్సులు, కార్లు, బైకులు అన్న తేడా లేకుండా అన్ని రకాల వాహనాలు ఇలాంటి అగ్ని ప్రమాదాల్లో చిక్కుకున్నాయి. కొన్ని ఘటనల్లో భారీగా ప్రాణ నష్టం కూడా జరిగింది. మెజారిటీ ఘటనల్లో మాత్రం ప్రాణ నష్టం తప్పింది. తాజాగా అలాంటిదే మరో ఘటన చోటుచేసుకుంది. రోడ్డుపై రయ్యిమని దూసుకెళ్తున్న కారులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ప్రమాదాన్ని గమనించిన డ్రైవర్ వెంటనే కారును ఆపేసి బయటికి పరుగులు తీశాడు. ఆ తర్వాత మంటలు మరింత చెలరేగడంతో కారు పూర్తిగా కాలి బూడిదైంది. ఆ ప్రాంతంలో దట్టంగా పొగలు కమ్ముకున్నాయి. మహారాష్ట్ర రాజధాని ముంబైలోని జోగేశ్వరీ బ్రిడ్జిపై ఈ ఘటన చోటుచేసుకుంది. ప్రమాదానికి సంబంధించి మరిన్ని వివరాలు తెలియాల్సి ఉందని పోలీసులు చెప్పారు.

## ఇంట్లో పేలుడు.. ముగ్గురు మృతి, పలువురికి గాయాలు



**కోల్‌కతా-నవభూమి:** ఒక ఇంట్లో పేలుడు సంభవించింది. పేలుడు ధాటికి ఇంటి పైకప్పు కూలిపోయింది. ఈ సంఘటనలో ముగ్గురు మరణించారు. పలువురు గాయపడ్డారు. ఆ ఇంట్లో బాంబులు తయారు చేస్తుండగా ఈ పేలుడు జరిగినట్లు పోలీసులు అనుమానిస్తున్నా రు. పశ్చిమ బెంగాల్‌లోని ముర్షిదాబాద్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. ఆదివారం రాత్రి ఖయర్తాలా ప్రాంతంలోని ఒక ఇంట్లో దేశీయ బాంబులు పేలాయి. పేలుడు ధాటికి ఇంటి పైకప్పు కూలిపోయింది. రాత్రి వేళ పేలుడు శబ్దం విని స్థానికులు భయాందోళన చెందారు. కాగా, ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఈ పేలుడులో ముగ్గురు మరణించగా పలువురు గాయపడినట్లు తెలిపారు. మృతులను మామున్ మొల్లా, సకీరుల్ సర్కార్, ముస్తాకిన్ షేక్‌గా గుర్తించినట్లు చెప్పారు. మామున్ మొల్లా ఇంట్లో దేశీయ బాంబులు తయారు చేస్తున్నట్లు పోలీసులు అనుమానం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో బాంబులు పేలడంతో ముగ్గురు వ్యక్తులు మరణించినట్లు భావిస్తున్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఆప్ రెండో జాబితా విడుదల.. సిసోడియా స్థానం మారింది




**న్యూఢిల్లీ-నవభూమి:** వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఆమ్ ఆద్మీ పార్టీ దూకుడుగా వ్యవహరిస్తోంది. ఇప్పటికే 11 మందితో తొలి జాబితాను రిలీజ్ చేసిన అధికార ఆప్.. తాజాగా 20 మంది అభ్యర్థులతో రెండో జాబితాను కూడా విడుదల చేసింది. ఇక ఈ లిస్ట్‌లో మాజీ ఉపముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా పేరు ఉంది. ఆయన ఈసారి పట్పర్‌గంజ్ అసెంబ్లీ స్థానం నుంచి కాకుండా.. జంగ్‌పురానుంచి బరిలోకి దిగనున్నారు. ఇక ఇటీవలే ఆప్‌లో చేరిన ఉపాధ్యాయుడు అవధ్ ఓజాకు పట్పర్‌గంజ్ స్థానాన్ని కేటాయించారు. ఢిల్లీ అసెంబ్లీలో మొత్తం 70 స్థానాలు ఉన్నాయి. 2020లో జరిగిన ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ 70 స్థానాల్లో 62 స్థానాలను గెలుచుకున్న విషయం తెలిసిందే.

# నోయిడా ఎయిర్‌పోర్ట్‌లో రన్‌వేపై విజయవంతంగా విమానం ల్యాండింగ్..!



**న్యూఢిల్లీ-నవభూమి:** నోయిడా అంతర్జాతీయ విమానాశ్రయం రన్‌వేపై తొలి విమానం విజయవంతంగా ల్యాండ్ అయ్యింది. సోమవారం మధ్యాహ్నం 1.31 గంటల సమయంలో ఎయిర్‌పోర్ట్‌లోని రన్‌వేపై విమానాన్ని ల్యాండ్ చేసిన చరిత్ర సృష్టించింది. ఢిల్లీ నుంచి తొలి వాణిజ్య విమానం కేవలం పది నిమిషాల్లోనే నోయిడా ఎయిర్‌పోర్ట్‌లోని ఫ్లయింగ్ జోన్‌కు చేరుకున్నది. ఒకటిన్నర గంటల పాటు విమానాశ్రయం చుట్టూ చక్కర్లు కొట్టింది. సక్సెస్‌ఫుల్‌గా ఫ్లైట్ ల్యాండింగ్‌తో రెండున్నర దశాబ్దాల ప్రయత్నాల తర్వాత విమానాశ్రయ చరిత్రలో మరో విజయం నమోదైంది. ఈ సందర్భంగా విమానానికి వాటర్ కెనన్‌లతో సెల్యూట్ చేశారు. ఇండిగోకు చెందిన ఏ320 విమానం రన్‌వేపై విజయవంతంగా ల్యాండ్ అయిన సందర్భంలో ప్రభుత్వ సీనియర్ అధికారులతో పాటు కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి సైతం ఉన్నారు. నోయిడా ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ రన్‌వే ట్రయల్‌కు డీజీసీఏ డిసెంబర్ 15 వరకు డెడ్‌లైన్ విధించింది. అంతకు ముందు ట్రయల్ రన్‌కు నవంబర్ 30న నిర్ణయించగా.. డీజీసీఏ తనిఖీల నేపథ్యంలో గడువును పొడిగించారు. విమానాశ్రయంలో క్యాట్-1, క్యాట్-3 డివైజెస్‌ను అమర్చారు. దాంతో పొగమంచులో విమానం ఎత్తు, విజిబులిటీ గురించిన సమాచారాన్ని అందిస్తాయి. ఎయిర్‌పోర్ట్‌లో ఇన్‌స్ట్రుమెంట్ ల్యాండింగ్ సిస్టమ్ సైతం ఇన్‌స్టాల్ చేశారు. విమానం బీచ్ కింగ్ ఎయిర్ 360 ఈఆర్ ద్వారా అక్టోబర్ 10 నుంచి 14 వరకు పరీక్షించారు. దట్టమైన పొగమంచు, చీకట్లో కూడా విమానాలను ల్యాండ్ సులభంగా చేసేందుకు వీలుంటుంది. విమానాశ్రయంలో 3900 మీటర్ల పొడవు, 60 మీటర్ల వెడెల్పుతో తొలి రన్‌వే పూర్తయ్యింది. రన్‌వేపై మార్కింగ్, లైటింగ్ పనులు పూర్తయ్యాయి. నోయిడా విమానాశ్రయం తొలి దశలో 1,334 హెక్టార్లలో నిర్మిస్తున్నారు. సంవత్సరానికి 1.2కోట్ల మంది ఇక్కడి నుంచి రాకపోకలు సాగించేందుకు అవకాశం ఉంటుంది. అయితే, ఈ విమానాశ్రయాన్ని నాలుగు దశల్లో విస్తరిస్తారు. 2050 నాటికి పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే 7కోట్ల మంది సేవలు అందిస్తుంది. త్వరలోనే ఈ ఎయిర్‌పోర్ట్‌ను ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించనున్నారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 6వ తేదీ తర్వాత విమాన సర్వీస్‌ల బుకింగ్స్ మొదలవనున్నాయి. ఏప్రిల్ 17 నాటికి ఎయిర్‌పోర్ట్ నుంచి వాణిజ్య విమానాలు ప్రారంభమవుతాయి.


### డ్రీమర్ ఓకే, బర్త్ రైట్ సిటిజన్ షిప్ నాట్ ఓకే...

# ట్రంప్ సంచలన వ్యాఖ్యలు!



**అమెరికా-నవభూమి:** అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్ చేయబోయే పాలనపై ప్రపంచ వ్యాప్తంగా ఆసక్తికరమైన చర్చ జరుగుతుంది. ప్రధానంగా ప్రెసిడెంట్ గా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం ట్రంప్ తన దృష్టంగా వలసదారులపై కేంద్రీకరించే అవకాశం ఉందని అంటున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆ అంచనాలకు బలం చేకూర్చే వ్యాఖ్యలు చేశారు. ఎన్.బీ.సీ. న్యూస్ కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇందులో భాగంగా... అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత బర్త్ రైట్ సిటిజన్ షిప్ ని రద్దు చేయడంతోపాటు దేశంలోని అక్రమ వలసదారులందరినీ బహిష్కరించాలని కోరుతున్నారు. అయితే... "డ్రీమర్స్" అని పిలవబడే వలసదారులను మాత్రం రక్షించాలనుకుంటున్నారు. : అమెరికాకు కాబోయే ప్రెసిడెంట్ ట్రంప్ అధికారంలోకి వచ్చిన మొదటి రోజునే జన్మహక్కు పౌరసత్వాన్ని రద్దు చేయడానికి కార్యనిర్వాహక చర్య తీసుకోవాలని యోచిస్తున్నట్లు తెలిపారు. తల్లితండ్రుల ఇమ్మిగ్రేషన్ స్థితితో సంబంధం లేకుండా యూఎస్ లో జన్మించిన ఎవరికైనా జన్మహక్కు పౌరసత్వం ఇవ్వబడుతుంది. దీని ట్రంప్ రద్దుచేయాలని బలంగా ఫిక్సయ్యారు! వాస్తవానికి... జన్మహక్కు పౌరసత్వాన్ని రద్దు చేయడం అంత ఈజీ కాదని.. ఈ విషయంలో ట్రంప్ ప్లాన్స్ సులభంగా సాధించబడవని అంటున్నారు. ఈ చర్య ఎన్నో న్యాయపరమైన సవాళ్లను ఎదుర్కోవాల్సి ఉంటుందని చెబుతున్నారు. ఈ హక్కు యూఎస్ రాజ్యాంగ సవరణ ద్వారా రాగా.. 1989లో సుప్రీంకోర్టు మద్దతు తెలిపింది! లోక్‌సభలో దుమారం అక్రమ వలసదారుల సాముహిక బహిష్కరణ!: జనవరి 20న డొనాల్డ్ ట్రంప్ అధికారం చేపట్టినప్పటి నుండి అక్రమ వలసలను జాతీయ అత్యవసర పరిస్థితిగా ప్రకటించి.. దేశవ్యాప్తంగా అణిచివేతకు ఆదేశాలివ్వాలని కూడా భావిస్తున్నారని చెబుతున్నారు. వాస్తవానికి... 2022 జనవరి నాటికే యూఎస్ డిపార్ట్మెంట్ ఆఫ్ హోంల్యాండ్ సెక్యూరిటీ అమెరికాలో సుమారు 11 మిలియన్ల అక్రమ వలసదారులను అంచనా వేసింది. ఇప్పుడు వీరి సంఖ్య మరింత పెరిగి ఉంటుందని అంటున్నారు. ఈ నేపథ్యంలో... చట్టపరమైన హోదా లేకుండా ఉన్న అందరినీ బహిష్కరించాలని ట్రంప్ బలంగా భావిస్తున్నారు. అయితే... దీనికి చాలా నియమాలు, నిబంధనలు, చట్టాలు ఉన్నాయని ట్రంపే చెబుతున్నారు. %ూశ్రీంశీ =ఝఃం% - లోదుస్తులు, చెప్పులపై వినాయకుడి బొమ్మలు... వాల్ మార్ట్ పై నిప్పులు! 'డ్రీమర్'లను రక్షించే ఆలోచన!: మరోపక్క బాల్యంలోనే తల్లితండ్రులతో పాటు అమెరికాకు వలస వచ్చి అక్కడే పెరిగి పెద్దయిన వలసదారులు (డ్రీమర్స్) విషయంలో ట్రంప్ సానుకూల వ్యాఖ్యలు చేయడం గమనార్హం. ఈ సందర్భంగా వీరి గురించి స్పందించిన ట్రంప్... చాలా చిన్న వయసులోనే దేశానికి తీసుకురాబడిన వీరు ఇప్పుడు మధ్య వయస్కులని ట్రంప్ అన్నారు. వీరంతా ఇప్పుడు అమెరికాలో భాగమైపోయారని.. వీరు వారి వారి మూల దేశపు భాష కూడా మాట్లాడరని అన్నారు. వారిని అమెరికా వదులుకోదన్నట్లుగా ట్రంప్ వ్యాఖ్యానించారు! కాగా... బాల్యంలోనే తల్లితండ్రులతోపాటు అమెరికాకు వలస వచ్చి అక్కడే పెరిగి పెద్దయిన వలసదారులను (డీమర్స్) వెనక్కి తిప్పిపంపకుండా నిరోధిస్తున్న ప్రభుత్వ విధానం చట్టవిరుద్ధమని ఫ్లోరిడాలోని జిల్లా కోర్టు 2023 సెప్టెంబర్ లో తీర్మానించిన సంగతి తెలిసిందే.

# హిమాచల్‌ప్రదేశ్‌లో భారీగా హిమపాతం.. మైనస్ డిగ్రీలకు పడిపోయిన ఉష్ణోగ్రతలు



**న్యూఢిల్లీ-నవభూమి:** ఉత్తరాదిని మంచు దుప్పటి కప్పేసింది జమ్మూకశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్ లోని చాలా ప్రాంతాల్లో విపరీతంగా మంచు పడుతోంది. హిమాచల్ ప్రదేశ్‌లోని సిమ్లా కుఫ్రి, స్పితి, ఖరపత్తర్, మనాలీ సహా పలు ప్రాంతాల్లో ఈ సీజన్‌లో మొదటిసారి మంచు పడింది. దీంతో ఆయా ప్రాంతాలు కనుచూపు మేర శ్వేత వర్ణాన్ని సంతరించుకున్నాయి. రహదారులు, ఇళ్లు, భవనాలు, చెట్లు, వాహనాలు, ఎత్తైన కొండలపై పడుతున్న మంచు దృశ్యాలు ఆకట్టుకుంటున్నాయి. సందర్శకులు మంచు వర్షాన్ని ఆస్వాదిస్తున్నారు. మరోవైపు మంచు కారణంగా ఉష్ణోగ్రలు క్షీణించాయి. రాష్ట్ర వ్యాప్తంగా చలి తీవ్రత పెరిగింది. టాబో నగరంలో ఉష్ణోగ్రతలు ఏకంగా మైనస్ 13 డిగ్రీల సెల్సియస్‌కు పడిపోయాయి. కుకుమ్‌సేరిలో మైనస్ 6.9 డిగ్రీల సెల్సియస్, కల్పలో మైనస్ 3.3 డిగ్రీల సెల్సియస్, రెకాంగ్ పియోలో మైనస్ 1 డిగ్రీల సెల్సియస్, నార్కండలో మైనస్ 0.8 డిగ్రీల సెల్సియస్‌తో అత్యంత శీతల పరిస్థితులు నెలకొన్నాయి.

# ముడుపులు ముడితేనే పనులు.. దేశంలో పెచ్చరిల్లిన అవినీతి!



**న్యూఢిల్లీ-నవభూమి:** గడచిన ఏడాది కాలంలో తాము ముడుపులు చెల్లించినట్లు దాదాపు 66 శాతం వ్యాపార సంస్థలు అంగీకరించినట్లు ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్ లోకల్ సర్కిల్స్ ఆదివారం ఒక నివేదికలో తెలిపింది. 159 జిల్లాల వ్యాప్తంగా నిర్వహించిన సర్వేలో 18,000 స్పందనలు వచ్చినట్లు పేర్కొంది. తాము బలవంతంగా ముడుపులు చెల్లించినట్లు 54 శాతం సంస్థలు తెలియచేయగా, తమ పని వేగవంతం అయ్యేందుకు తామే స్వచ్ఛందంగా ముడుపులు చెల్లించినట్లు 46 శాతం సంస్థలు వెల్లడించినట్లు నివేదిక తెలిపింది. ప్రభుత్వ శాఖల నుంచి పర్మిట్లు, అనుమతులు, లైసెన్సుల ప్రతులు, ఆస్తులకు సంబంధించిన ఏ వ్యవహారాలకైనా ముడుపులు చెల్లించడం ఆనవాయితీగా మారిందని అనేక వ్యాపార సంస్థలు భావిస్తున్నాయి.
అనేక కార్యాలయాలలో కంప్యూటరీకరణ జరిగినప్పటికీ సీసీటీవీలకు దూరంగా రహస్యంగా వ్యాపార సంస్థల నుంచి ముడుపులు పుచ్చుకోవడం కొనసాగుతూనే ఉందని నివేదిక పేర్కొన్నది. మార్కెటింగ్ రంగంలో ఈ-ప్రొక్యూర్‌మెంట్ వంటి కొత్త విధానాలు అవినీతిని తగ్గించడానికి సరైన అడుగులే అయినప్పటికీ సరఫరాదారుగా అర్హత సాధించడం, టెండర్ ప్రక్రియలో అక్రమాలు, కంప్లీషన్ సర్టిఫికెట్లు, ప్రభుత్వం నుంచి చెల్లింపులు వంటి విషయాలలో అవినీతి అంతం కాలేదని తెలిపింది. ఈ ఏడాది మే 22 నుంచి నవంబర్ 30 మధ్య ఈ సర్వే జరిగింది.
న్యాయ, తూనికలు, ఆహార, ఔషధ, ఆరోగ్య తదితర శాఖలకు చెందిన అధికారులకు ఈ ముడుపులలో 75 శాతం వెళ్లినట్లు సర్వేలో తేలింది. జీఎస్టీ, కాలుష్య నియంత్రణ, మున్సిపల్ కార్పొరేషన్, విద్యుత్తు శాఖ అధికారులకు సైతం ముడుపులు చెల్లించినట్లు అనేక వ్యాపార సంస్థలు తెలియచేశాయి.
66 శాతం- గడచిన 12 నెలల్లో వివిధ ప్రభుత్వ శాఖలకు ముడుపులు ముట్టచెప్పినట్లు తెలిపిన వ్యాపార సంస్థలు
54 శాతం- బలవంతంగా ముడుపులు చెల్లించాల్సి వచ్చిందని చెప్పిన సంస్థలు
46 శాతం- పని త్వరగా పూర్తయ్యేందుకు స్వచ్ఛందంగా ముడుపులు ఇచ్చినట్టు తెలిపిన సంస్థలు
19 శాతం- లంచం చెల్లించాల్సిన అవసరం రాలేదని చెప్పిన సంస్థలు
16 శాతం- ముడుపులు చెల్లించకుండానే తమ పని పూర్తి చేసుకున్నామని తెలిపిన సంస్థలు

## రాజ్యసభ అభ్యర్థులను ప్రకటించిన బీజేపీ.. ఏపీ నుంచి ఆర్.కృష్ణయ్యకు అవకాశం



**న్యూఢిల్లీ-నవభూమి:** ఆంధ్రప్రదేశ్ సహా నాలుగు రాష్ట్రాల్లో త్వరలో రాజ్యసభ ఉప ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మూడు రాష్ట్రాలకు సంబంధించి అభ్యర్థులను బీజేపీ ప్రకటిం చింది. ఆంధ్రప్రదేశ్, హర్యాణా, ఒడిశా రాష్ట్రాలకు సంబంధించి అభ్యర్థులను కమలం పార్టీ సోమవారం ప్రకటించింది. ఏపీ నుంచి ఆర్. కృష్ణయ్య కు అవకాశం కల్పించింది. గతంలో వైసీపీ నుంచి ఆయన రాజ్యసభకు ఎన్నికై ఇటీవలే రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఇప్పుడు బీజేపీ తరఫున పెద్దల సభకు ఆయనకు అవకాశం వచ్చింది. ఇక హర్యాణా నుంచి రేఖా శర్మ, ఒడిశానుంచి సుజీత్ కుమార్‌ను అభ్యర్థులుగా ప్రకటించింది.

## మహారాష్ట్ర అసెంబ్లీ స్పీకర్‌గా రాహుల్ నర్వేకర్ ఏకగ్రీవ ఎన్నిక



**ముంబై-నవభూమి:** మహారాష్ట్ర అసెంబ్లీ స్పీకర్‌గా బీజేపీ ఎమ్మెల్యే రాహుల్ నర్వేకర్ ఎన్నికయ్యారు. వరుసగా రెండోసారి ఆయన ఆ పదవికి ఎన్నికయ్యారు. స్పీకర్ పదవి కోసం ఆయన ఆదివారం నామినేషన్ దాఖలు చేశారు. సీఎం దేవేంద్ర ఫడ్నవీస్, డిప్యూటీలు అజిత్ పవార్, ఏకనాథ్ షిండే, ఇతర బీజేపీ నేతలు ఆయనకు సపోర్టు ఇచ్చారు. స్పీకర్ పోస్టు కోసం మహా వికాశ్ అగాధీ కూటమి నామినేషన్ దరఖాస్తు చేయలేదు. ప్రతిపక్ష నేత ఎన్నిక అంశంలో స్పీకర్ నర్వేకర్ పాత్రపై అందరి దృష్టి ఉన్నది. అసెంబ్లీలో ప్రస్తుతం ప్రతిపక్ష పార్టీకి 10 శాతం కన్నా తక్కువ సీట్లు ఉన్నాయి. దీంతో ప్రతిపక్ష నేత హోదాను ఇస్తారా లేదా అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. జూలై 2022లో తొలిసారి నర్వేకర్ స్పీకర్‌గా నియమితుడయ్యారు. శివసేన ఎమ్మెల్యేలు అనర్హత పిటీషన్లు దాఖలు చేసిన సమయంలో ఆయన కీలక పాత్ర పోషించారు. తాజాగా ముగిసిన మహా అసెంబ్లీ ఎన్నికల్లో మహాయుతి కూటమికి 288 సీట్లలో 230 సీట్లు దక్కాయి. మహా వికాశ్ అగాధికి 46 సీట్లు వచ్చాయి.

## ఉదయం పాఠశాలలు.. ఇప్పుడు హోటల్.. దేశంలో కలకలం రేపుతున్న వరుస బాంబు బెదిరింపులు



**న్యూఢిల్లీ-నవభూమి:** దేశంలో వరుస బాంబు బెదిరింపులు కలకలం రేపుతున్నాయి. ఇవాళ ఉదయం దేశ రాజధాని ఢిల్లీలోని ఏకంగా 44 పాఠశాలలకు ఇలాంటి బెదిరింపులు వచ్చిన విషయం తెలిసిందే. తాజాగా మహారాష్ట్రలోని ఓ హోటల్‌కు ఈ తరహా బెదిరింపులే వచ్చాయి. నాగ్‌పూంలోని గణేష్‌పేట్ కాలనీ ప్రాంతంలో గల హోటల్ ద్వారకామాయి)కి బాంబు బెదిరింపులు వచ్చాయి. ఆగంతకులు ఈ మెయిల్ ద్వారా బెదిరింపులకు పాల్పడ్డారు. అప్రమత్తమైన హోటల్ యాజమాన్యం వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. రంగంలోకి దిగిన పోలీసులు బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌తో ఘటనాస్థలికి చేరుకొని తనిఖీలు చేపట్టారు. అందులోని సిబ్బందిని బయటకు పంపించారు. అయితే, ఈ తనిఖీల్లో ఎలాంటి అనుమానాస్పద వస్తువులూ, పేలుడు పదార్థాలూ లభించలేదని నాగ్‌పూర్ పోలీస్ డీసీపీ రాహుల్ మక్నికర్ తెలిపారు. ఈ ఘటనపై విచారణ చేపట్టినట్లు వెల్లడించారు.

## కొచ్చి వెళ్తున్న విమానం చెన్నైలో ఎమర్జెన్సీ ల్యాండింగ్

**న్యూఢిల్లీ-నవభూమి:** 100 మంది ప్రయాణికుల తో కేరళలోని కొచ్చి బయల్దేరిన ఓ ప్రైవేట్ విమానంలో సాంకేతిక సమస్య తలెత్తింది. దీంతో విమానాన్ని చెన్నైలో అత్యవసరంగా ల్యాండ్ చేయాల్సి వచ్చింది.ప్రయాణికులు, సిబ్బంది సహా మొత్తం 117 మందితో ఓ ప్రైవేట్ విమానం ఇవాళ చెన్నై నుంచి కొచ్చి బయల్దేరింది విమానం టేకాఫ్ అయిన కాసేపటికే సాంకేతిక సమస్య తలెత్తింది. దీంతో అప్రమత్తమైన పైలట్ ముందు జాగ్రత్త చర్యగా విమానాన్ని తిరిగి చెన్నైకి మళ్లించారు. అక్కడ సేఫ్‌గా ల్యాండ్ చేశారు. అందులోని ప్రయాణికులు, సిబ్బంది సేఫ్‌గానే ఉన్నట్లు అధికారులు తాజాగా వెల్లడించారు.



## తెలంగాణ మాతృమూర్తి సోనియా

తెలంగాణ రాష్ట్రంపై సోనియాకు ఉన్న ప్రేమ ప్రత్యేకమైంది. ప్రత్యేక తెలంగాణ కోసం 1969 నుండి జరిగిన అనేక ఉద్యమాలు, బలిదానాలను దృష్టిలో ఉంచుకుని, తెలంగాణ ప్రజల చిరకాల వాంఛ అయిన ప్రత్యేక రాష్ట్ర కలను సాకారం చేస్తామని 2004లో కరీంనగర్ వేదికగా సోనియాగాంధీ హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం 2009 డిసెంబర్ 9న హోం మంత్రి చిదంబరం ద్వారా తెలంగాణ ఏర్పాటు ప్రక్రియను ప్రకటింపజేశారు. అలా తెలంగాణ ప్రజల కలను నెరవేర్చడమే కాకుండా 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడడానికి ఆమె ఎనలేని కృషి చేశారు. తెలంగాణ ప్రజలకు ఆమె తల్లితో సమానం.కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీ నాలుగు దశాబ్దాల రాజకీయ ప్రస్థానం... ప్రపంచానికే ఆదర్శం. అధికారం కోసం ఆమె రాజకీయాల్లోకి రాలేదు. రాజకీయ కుటుంబంలో ఉన్నా ఒక సాధారణ గృహిణిగానే పరిమితమైన ఆమెను విషాదకరమైన పరిస్థితులు రాజకీయాల్లోకి నడిపించాయి. వార్డు మెంబర్ పదవిని త్యాగం చేయడానికి కూడా సిద్ధపడని నేటి రోజుల్లో మూడుసార్లు ప్రధానమంత్రి పదవిని త్యాగం చేసి కర్మయోగిలా రెండు విడతలలో మొత్తం 22 ఏళ్ల పాటు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలిగా ఆమె సేవలు అందించారు. లౌకికవాదానికి కట్టుబడుతూ కులం, మతం, ప్రాంతం, భాష... ఇలా ఏ విషయంలోనూ వివక్ష చూపకుండా అన్ని వర్గాలను ఆదరించే నెహ్రూ-గాంధీ వారసత్వాన్ని ఆమె కొనసాగిస్తున్నారు."దుఃఖాన్ని మర్చిపోలేం... అలాగని అధిగమించలేం. దానితో కలిసి బతకడం నేర్చుకోవాలి" అని సంజయ్ గాంధీ మరణించినప్పుడు ఇందిరాగాంధీ చెప్పిన మాటలను సోనియాగాంధీ తన జీవితానికి అన్వయించుకున్నారు. రాజకీయాల్లోకి రావాల్సి వస్తుందని సోనియా ఏనాడు ఊహించలేదు.దురదృష్టవశాత్తు 1984 అక్టోబర్ 31న ప్రధానమంత్రిగా ఉన్న ఇందిరాగాంధీ హత్యతో సోనియాగాంధీ అంతులేని దిగ్భ్రాంతికి గురయ్యారు. అనంతరం రాజీవ్‌గాంధీ ప్రధానమంత్రి అయ్యాక సోనియా ఎక్కువగా ఆయన్నే అంటిపెట్టుకుని ఉండేవారు. ఆయన కోసం పిల్లలతో గడిపే సమయాన్ని కూడా ఆమె త్యాగం చేశారు. రాజీవ్‌గాంధీ బయటికెళ్లాక ఇంటికి క్షేమంగా తిరిగి వచ్చేవరకు తాను, పిల్లలు భయంతో ఉండేవాళ్లం అని ఒక ఇంటర్వ్యూలో ఆమె చెప్పిన మాటలను బట్టి అప్పటి వారి వేదనను అర్థం చేసుకోవచ్చు.1991 లోక్‌సభ ఎన్నిక ప్రచారానికి రాజీవ్ దేశవ్యాప్తంగా పర్యటించాల్సి ఉండడంతో, సోనియాగాంధీని అమేథి నియోజకవర్గం చూసుకోమని ఆయన చెప్పారు. ఆమె అమేథీ ప్రజలతో మమేకమై అక్కడ రాజీవ్‌గాంధీని అఖండ విజయంతో గెలిపించినా దురదృష్టవశాత్తు ఆ విజయాన్ని ఆస్వాదించడానికి ఆయన లేరు. రాజీవ్ గాంధీ గురించి ఆమె భయపడినట్టే తమిళనాడులో ఎన్నికల ప్రచారానికి వెళ్లిన ఆయన ఉగ్రవాదుల ఆత్మహుతి దాడిలో హత్యకు గురయ్యారు. ఏడేళ్ల వ్యవధిలో దేశం కోసం ఇద్దరు కుటుంబ సభ్యులను పోగొట్టుకున్న సోనియాగాంధీ తీవ్ర నిరాశా నిస్పృహల్లోకి జారిపోయారు. రాజీవ్ మరణం తర్వాత కాంగ్రెస్ అధ్యక్షపదవి చేపట్టి, ప్రధానమంత్రి కావాలని యావత్ దేశం కోరినా సోనియాగాంధీ తిరస్కరించి, రాజకీయాలకు దూరంగా ఉన్నారు.దేశంలో కుల, మత రాజకీయాలు పెరిగిపోవడంతో లౌకికవాదంతో పాటు కాంగ్రెస్ పార్టీ కూడా బలహీనపడడంతో, పార్టీలోని సీనియర్ నాయకుల ఒత్తిడితో సోనియాగాంధీ 1997లో కాంగ్రెస్ పార్టీ సభ్యత్వం తీసుకున్నారు. అనంతరం 1998లో పార్టీ అధ్యక్ష పదవి చేపట్టారు. 1999 ఎన్నికల్లో కాంగ్రెస్ 114 స్థానాలు గెలవడంతో సోనియాగాంధీ లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా ప్రజల గొంతుకయ్యారు.'షైనింగ్ ఇండియా' అంటూ గారడి మాటలతో గడిపిన వాజపేయి నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వంపై ప్రతిపక్ష నేతగా సోనియాగాంధీ అలుపెరగని పోరాటం చేశారు. 2004 ఎన్నికల సందర్భంగా 'కాంగ్రెస్ కీ హాత్.. గరీబోంకీ సాత్' (కాంగ్రెస్ హస్తం.. పేదల నేస్తం) అనే నినాదం ఇచ్చి దేశ ప్రజల మనస్సులను చూరగొనడమే కాకుండా 2004లో కాంగ్రెస్ పార్టీ కేంద్రంలో అధికారం చేపట్టడానికి ఆమె ఎంతో కృషిచేశారు. ప్రజా వ్యతిరేక ప్రభుత్వాన్ని గద్దె దించడానికి, లౌకికవాదాన్ని కాపాడడానికి ఆమె ప్రతిపక్ష పార్టీలను ఒక్కతాటిపైకి తీసుకొచ్చి యూపీఏ కూటమిని ఏర్పాటు చేశారు.సోనియాగాంధీ 2003లో దేశవ్యాప్తంగా పర్యటించి దాదాపు 150 ర్యాలీల్లో పాల్గొన్నారు. దీంతో బెంబేలెత్తిన బీజేపీ ఆమెపై వ్యక్తిగత దూషణలు చేయడంతో 'ఇది నా మెట్టినిల్లు. మట్టిలో కలిసిపోయే వరకు నేను భారతీయురాలినే. ఈ దేశం నా ప్రాణం కంటే ఎక్కువ' అని వారి కుట్రలకు సమాధానం ఇచ్చారు. వామపక్ష పార్టీల మద్దతుతో 2004లో సోనియాగాంధీకి ప్రధానమంత్రి అయ్యే అవకాశం వచ్చింది. కానీ ఓటమి చెందిన బీజేపీ ఆమెపై కక్షగట్టి అనేక రకాలుగా అడ్డుపడింది. విదేశీ మహిళ ప్రధానమంత్రి అయితే తాను గుండు గీయించుకుని తెల్లచీర కట్టుకుంటానని బీజేపీ నాయకురాలు సుష్మా స్వరాజ్ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. అయినా, ఆమెపైన ఎటువంటి కక్షను పెంచుకోకుండా సుష్మాస్వరాజ్ బతికున్నంత కాలం ఆమెతో సోనియాగాంధీ ఎంతో సన్నిహితంగా ఉండేవారు. తనకు పదవి కంటే దేశం సుభిక్షంగా ఉంటే చాలు అని తలచిన సోనియాగాంధీ ప్రధాని పదవిని త్యాగం చేశారు. వారి బెదిరింపులకు భయపడి ఆమె వెనకడుగు వేయలేదు. వారి విమర్శలను కూడా సానుకూలంగానే తీసుకున్నారు. 'వారు నన్ను విదేశీయురాలిగా చూస్తున్నారని నేనెప్పుడూ అలా భావించలేదని, ఒక భారతీయురాలిగా దేశాభివృద్ధి కోసం కృషి చేస్తాను..' అని ఎంతో సహనంతో పరిణతితో కూడిన సమాధానం ఇచ్చారు. దేశాభివృద్ధి కోసం అనుభవజ్ఞుడైన, నిజాయతీపరుడైన ఆర్థికవేత్త డాక్టర్ మన్మోహన్ సింగ్ ప్రధానమంత్రి పదవి చేపట్టేందుకు కృషి చేయడంతోపాటు ఆయనకు 10 సంవత్సరాలపాటు సంపూర్ణ మద్దతు అందజేశారు.దేశ సమస్యలను పరిష్కరించేందుకు సోనియాగాంధీ నేతృత్వంలో ఏర్పాటైన నిపుణుల కమిటీ 'నేషనల్ అడ్వైజరీ కౌన్సిల్' అనేక సంస్కరణలపై అధ్యయనం చేసి, ఎన్.ఏ.సీ ద్వారా ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్‌కు, యూపీఏ ప్రభుత్వానికి అనేక సిఫార్సులు చేశారు. సమాచార హక్కు చట్టం, ఆహార భద్రత చట్టం, విద్యాహక్కు చట్టం, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ వంటి ప్రపంచంలోనే సంచలనమైన పథకాలను యూపీఏ ప్రభుత్వం ప్రవేశపెట్టడంలో సోనియాగాంధీ కృషి వెలకట్టలేనిది.సోనియాగాంధీ దేశం కోసం పలు విప్లవాత్మక నిర్ణయాలను తీసుకుంటుంటే ఓర్వలేని బీజేపీ నిరాధార ఆరోపణలు చేస్తే ఆమె ఎన్.ఏ.సీ చైర్మన్ పదవికి, ఎంపీ పదవికి రాజీనామా చేసి, పదవులు తనకు తృణప్రాయమని మరోసారి నిరూపించారు. సోనియాగాంధీ యూపీఏ చైర్మన్‌గా ఉన్నప్పుడే చట్ట సభల్లో మహిళా రిజర్వేషన్ బిల్లు పెట్టారు.

ఆమె కాంగ్రెస్ అధ్యక్షురాలిగా ఉన్నప్పుడే దేశానికి తొలి మహిళా రాష్ట్రపతిగా ప్రతిభా పాటిల్, తొలి దళిత మహిళా లోక్‌సభ స్పీకర్‌గా

# ఇన్ టీచింగ్ నో చీటింగ్



ఈ వ్యాస టైటిల్ కొంత ఇబ్బందిగా, డిఫరెంట్‌గా ఉండవచ్చు కానీ టీచింగ్ (కేజీ నుండి పీజీ) అనేది బోధనను తన వృత్తిగా స్వీకరిస్తూ విద్యార్థుల అంతర్గత నైపుణ్యాలు, కౌశలాలను, అంతరంగంలో విజ్ఞాన జ్యోతులను వెలిగించే అత్యున్నతమైనది. పుడమి పైనగల సకల వృత్తుల్లో విలక్షణమైనదిగా ఎంచబడింది. ఎవరైనా, ఎంతటి వారైనా, ఏ స్థాయి వారైనా ఉపాధ్యాయుని వద్ద పాఠాలు నేర్చుకోవాల్సిందే కదా!

టీచింగ్ ఏ స్థాయి అయినా సర్వశక్తియుక్తులతో, సకల సామర్థ్యాలతో విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దే పవిత్రమైనది మరియు బహు శ్రేష్టమైనది కూడా ఉపాధ్యాయ వృత్తియే! అందుకే టీచింగ్ అనేది ఆషామాషి వ్యవహారం కాదు. భవిష్యత్తు నిర్మాణంలో ముడిపడి ఉన్న పవిత్రమైన వృత్తి. ఏదో టైం పాస్ కోసం ఇత రాతరాత్రా కారణాలపై ఉపాధ్యాయ వృత్తి స్వీకరించడం కరెక్ట్ కాదు. సమాజంలో జరిగే, ఆర్థిక, సాంఘిక, రాజకీయ, సామాజిక, సాంకేతిక ప్రగతికి ప్రధాన మూలం కేవలం విద్య మాత్రమే. అట్టి విద్యను అందించే వారే ఉపాధ్యాయులు అందుకే ఉపాధ్యాయులు ధన్యులు. అలాగే ప్రవర్తించాల్సి ఉంటుంది. అప్పుడే సమాజంలో సముచిత స్థానం లభిస్తుంది. విద్యార్థులు తమ గురువులను జీవితాంతం గుర్తుంచుకుంటారు.

ఉపాధ్యాయులు (కేజీ టు పీజీ) తమ విశిష్ట బోధనల ద్వారా, ప్రవర్తన ద్వారా విద్యార్థులను ప్రభావితం చేస్తారు. అందుకే తల్లిదండ్రుల తర్వాత స్థానాన్ని ఉపాధ్యాయులే ఆక్రమిస్తారు. ఈ మేరకు ఉపాధ్యాయులు పేరెంట్ సరోగేట్ గా గుర్తించబడ్డారు. అంటే తల్లిదండ్రులకు ప్రత్యామ్నాయం అన్నమాట. కొన్ని సందర్భాల్లో విద్యార్థులు తమ తల్లిదండ్రుల కంటే ఉపాధ్యాయలనే అమితంగా గౌరవించడం నేను గమనించాను. అట్టి ఉపాధ్యాయులు నిజంగా ధన్యజీవులు. అవును ఉపాధ్యాయులు తమ విశిష్ట బోధనల ద్వారా, ప్రవర్తన ద్వారా విద్యార్థులను ప్రభావితం చేస్తారు. ఉపాధ్యాయులు తరగతి గదిలో ప్రవర్తించే విధానమే పిల్లల భవిష్యత్తును నిర్ణయిస్తుంది.

బంక మట్టితో వివిధ ఆకృతులను కుమ్మరి తన నేర్పరితనంతో ఎలా చేస్తారో పిల్లలను (విద్యార్థులను) భావిపద నిర్దేశకులుగా తీర్చిదిద్దే గురుతర బాధ్యతలను నిర్వహించేది కేవలం ఉపాధ్యాయులే! ఇంతటి గొప్ప సముచిత స్థానం మరే దేనికీ లేదు. అందుకే, ఉపాధ్యాయ వృత్తి



అనేది ఆషామాషీ వ్యవహారం కాదు. చిత్తశుద్ధి, అంకితభావంతో సమర్థవంతమైన బోధనను అనుసరిస్తేనే అది ఫలప్రదం అవుతుంది. ఖచ్చితంగా పిల్లలందరిలో అంతర్గత నైపుణ్యాలు కౌశలాలు అంతర్లీనంగా దాగి ఉంటాయి. వాటిని గుర్తించి వెలికి తీసేదే ఉపాధ్యాయ వృత్తి.

ఉపాధ్యాయుడు ప్రతి విద్యార్థి పట్ల ప్రత్యేక దృష్టిని సారిస్తూ వారి వారి నైపుణ్యాలను సామర్థ్యాలను గుర్తిస్తూ వాటికి అనుగుణంగా తగురీతుల్లో మార్గదర్శకం చేస్తే ఖచ్చితంగా వారు ఉత్తమ పౌరులుగా సమాజానికి అందించబడతారు. సమర్థవంతమైన రీతుల్లో బోధన చేసే ఉపాధ్యాయులను విద్యార్థులు తమ జీవితాంతం గుర్తుంచుకుంటారు. ఉపాధ్యాయునికి ఇంతకంటే కావాల్సింది ఇంకా ఏముంటుంది చెప్పండి!

సమర్థవంతమైన బోధన అంటే క్లుప్తంగా...

ప్రతి తరగతిలో పీరియడ్ ముందు, సదరు పీరియడ్ సమయంలో, పీరియడ్ తర్వాత ప్రవర్తనల్లో మార్పు గమనించబడితే పాఠ్య బోధనలో సక్సెస్ అయినట్లే. దీన్ని ప్రి మరియు పోస్ట్ బిహేవియరల్ ఛేంజ్ అంటారు. ఉత్తమ టీచింగ్ లో ఇదే ప్రధాన లక్ష్యం.

బోధించే సబ్జెక్టు కాంటెంట్ పై పట్టు, భావ స్పష్టత, విద్యార్థులతో మంచి సంబంధాలు కలిగి ఉండటం.

బోధించే విషయాన్ని ప్రతి విద్యార్థి త్వరగా బాగా అవగాహన చేసుకునే విధంగా బోధించడం.

విద్యార్థిని ఉన్నతంగా తీర్చిదిద్దేలా తగు బోధన విధానాలను అవలంబించడం.

పిల్లల (విద్యార్థుల) శక్తిసామర్థ్యాలను, ఆలోచన రీతులను అవగాహన చేసుకుంటూ సమయానుకూలంగా బోధించడం.

ఇలా పలు విధాలుగా సమర్థవంతమైన బోధనను గూర్చి నిర్వచించవచ్చు.

పూర్తిగా లక్షణంగా తయారైన కుండకు రంగులు దిద్దటం సులువే కానీ బంక మట్టిని కోరుకున్న ఆకృతిలో చేసేందుకు కుమ్మరి పడే కష్టాలు గొప్పవి. ఇదే ప్రక్రియను ఉపాధ్యాయులకు ఆపాదించవచ్చు. ఉపాధ్యాయుడు తన సామర్థ్యాలను ఎప్పటికప్పుడు పెంచుకుంటూ అంకితభావంతో కృషి చేస్తే అజ్ఞానినీ జ్ఞానిగా, అవివేకినీ వివేకిగా, సంస్కారహీనుడిని సంస్కారిగా, నిష్ప్రయోజకులను ప్రయోజకులుగా, ప్రతిభ గల వారిని అత్యంత ప్రతిభ గలవారుగా, ఉన్నతులను మహోన్నతులుగా చేయవచ్చు.

సమర్థవంతమైన బోధన ముఖ్య సూత్రాలు:

1. బోధించే సబ్జెక్టుపై పట్టు కలిగి ఉంటూ ఇష్టపడుతూ బోధించాలి.
2. విద్యార్థుల పూర్వస్థాయి, అంతరంగ భావాలు, అనుభవాలను పసిగట్టాలి.
3. నిజజీవన సన్నివేశంలో సమర్థవంతంగా వ్యవహరించాలి.
4. విద్యార్థుల పట్ల తల్లిదండ్రుల్లా, పవిత్రతతో ప్రవర్తించాలి.
5. భావోద్రేక సమతుల్యతతో, సమర్ధతతో ఉండాలి.
6. మంచి శీలంతో, సానుభూతితో వృత్తిపర అంకిత భావం కలిగి ఉండాలి.
7. సామాజిక స్పృహ, నాయకత్వ సామర్థ్యం, సహ పాఠ్య కార్యక్రమాల్లో అభివృద్ధి కలిగి ఉండాలి.

వీటిని కలిగి ఉంటే ఇక సమర్థుడైన ఉపాధ్యాయునిగా గుర్తింపు లభిస్తుంది. మరియు ఉపాధ్యాయుడు అల్పంగా ఉండకుండా హుందాగా ఉండాలి. విద్యార్థులందరినీ ప్రభావితం చేసేలా విజ్ఞతతో ప్రవర్తించాలి. సబ్జెక్టును తెలుసుకోవడం, సబ్జెక్టును ఇష్టపడడం, సదరు సబ్జెక్టును బోధించడం ఈ మూడు కలిస్తే ఇక ఉపాధ్యాయ వృత్తికి తిరుగే ఉండదు. తరగతి గదిలో పిల్లలు (విద్యార్థులు) ఉపాధ్యాయునిలో తల్లిదండ్రులను చూసే విధంగా ప్రవర్తించాలి. నైతికతతో సమగ్ర వ్యక్తిత్వము గల ఉపాధ్యాయుడు ప్రతినిత్యం గౌరవించబడతాడు. తన వృత్తికి పూర్తిగ అంకితమవ్వడమే ఉపాధ్యాయ వృత్తికి వన్నె తెస్తుంది. రావలసిన గుర్తింపు వస్తుంది. అందుకే సకలవృత్తుల్లోకెల్లా ఉపాధ్యాయ వృత్తి ఘనమైనది.


**డాక్టర్ ప్రభు దయాల్**
**మాజీ సెనేట్ మెంబర్ - కాకతీయ యూనివర్సిటీ,**
**జీవిత సభ్యుడు - ఐఏటిఈ,**
**మండల విద్యాశాఖ అధికారి - కొత్తగూడెం**


# మన హక్కులను కాపాడుకుందాం - సువర్ణ భవిష్యత్తును నిర్మిద్దాం



**డిసెంబర్ 10 ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా...**

ఒక దేశాభివృద్ధి అక్కడున్న మానవవనరుల మీద ఆధారపడుతుందనేది నిర్వివాదాంశం. వారికి ఉండే హక్కులు చక్కగా అమలయ్యేటప్పుడు మాత్రమే వారు ఆయా రంగాలలో స్వేచ్ఛగా పని చేయగలుగుతారు. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకొని ప్రపంచ మానవ హక్కుల దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం డిసెంబర్ 10న ప్రపంచవ్యాప్తంగా జరుపుకుంటారు. మానవ హక్కుల రంగంలో చేసిన కృషికి గాను ఐదు యేళ్లకొకసారిచ్చే బహుమతిని, ఇంకా ఈ యేడాది నోబెల్ శాంతి బహుమతిని పొందిన వారికి ఈ రోజున అవార్డును ప్రధానం చేస్తారు.

**మానవ హక్కుల ప్రకటన:**

"మానవ హక్కుల సార్వత్రిక ప్రకటన" అనేది మానవ హక్కుల చరిత్రలో మైలురాయి వంటిది. ఇవి ఐక్యరాజ్యసమితి మొదటి ప్రధాన విజయాలలో ఒకటిగా నిలిచాయి. ఇది ప్రపంచంలోని అన్ని ప్రాంతాల నుండి విభిన్న చట్టపరమైన సాంస్కృతిక నేపథ్యాలు కలిగిన ప్రతినిధులచే రూపొందించబడడమే కాకుండా మొట్టమొదటిసారిగా ప్రాథమిక మానవ హక్కులను విశ్వవ్యాప్తంగా రక్షించబడాలని నిర్ణయించింది. ఈ ప్రకటన "జాతి, రంగు, మతం, లింగం, భాష, రాజకీయ, ఇతర అభిప్రాయాలతో సంబంధం లేకుండా మానవుడిగా ప్రతి ఒక్కరూ పొందవలసిన అమూల్యమైన హక్కులను పొందుపరిచింది."

**మానవ హక్కులు అంటే ఏమిటి?**

ప్రతీ వ్యక్తికి గౌరవం, విలువ ఉంటుంది. మానవ హక్కులనేవి సమానత్వం న్యాయానికి సంబంధించినవి. ఇవి వారి వారి జీవితాలను ఎంపిక చేసుకోవడానికి, మానవులుగా వారి సామర్థ్యాన్ని పెంపొందించుకోవడానికి, స్వేచ్ఛగా, స్వతంత్రంగా, భయం, వేధింపులు, వివక్ష లేకుండా జీవితాన్ని గడపడం కోసం అవసరమైనవి. ప్రతి వ్యక్తి ప్రాథమిక విలువను గుర్తించే మార్గాలలో మొదటిది "వారి మానవ హక్కులను గుర్తించి గౌరవించడం." ఇవి ప్రతిరోజూ ప్రతి ఒక్కరినీ ప్రభావితం చేస్తాయి.

**ఈ యేడాది థీమ్:**

ఈ ఏడాది థీమ్ " ప్రస్తుత మన హక్కులు, మన భవిష్యత్తు. " మానవ హక్కుల ప్రాముఖ్యత, ఔచిత్యాన్ని గుర్తించడానికి, ప్రతికూల మూసధోరణులు, అపోహలను ఎదుర్కోవడం ద్వారా అవగాహనలను మార్చడానికి, మానవ హక్కుల కోసం ప్రపంచ ఉద్యమాన్ని పునరుజ్జీవింపజేయడానికి, కార్యాచరణను సమీకరించడానికి ప్రతి ఒక్కరినీ ఇప్పుడే ప్రేరేపించాలాన్నదే దీని సారాంశం.

ఈ థీమ్ మానవ హక్కుల విద్యపై తక్షణ శ్రద్ధ, ప్రాముఖ్యతను నొక్కి చెబుతుంది.




**ప్రధాన మానవ హక్కులు:**

జీవించే స్వేచ్ఛ, బానిసత్వం హింస నుండి స్వేచ్ఛ, అభిప్రాయం భావప్రకటనా స్వేచ్ఛ, పని, విద్య హక్కు, ప్రభుత్వంలో పాల్గొనే హక్కు. ఈ మానవ హక్కులు 30 ఆర్టికల్స్ గా పొందుపరచబడ్డాయి. ఆర్టికల్స్ 1 నుండి 2 గౌరవం, స్వేచ్ఛ, సమానత్వ ప్రాథమిక భావనల హక్కుల గురించి, 3 నుండి 5 జీవించే హక్కు, బానిసత్వం, చిత్రహింసల నిషేధం వంటి ఇతర వ్యక్తిగత హక్కుల గురించి, 6 నుండి 11 మానవ హక్కుల ప్రాథమిక చట్టబద్ధత ఉల్లంఘనకు గురయ్యేటప్పుడు బాధితుల రక్షణ నిర్దిష్ట పరిష్కారాల గురించి, 12 నుండి 17 ప్రతి దేశంలో నివాస స్వేచ్ఛ, ఆస్తి హక్కు, జాతీయత హక్కుతో సహా సంఘం పట్ల వ్యక్తి హక్కుల గురించి, 18 నుండి 21 ఆలోచనా స్వేచ్ఛ , అభిప్రాయ వ్యక్తీకరణ, మతం, మనస్సాక్షి , వ్యక్తి శాంతియుత సహవాసం, సమాచారాన్ని స్వీకరించడం, అందించడం, ఆధ్యాత్మిక, ప్రజా రాజకీయ స్వేచ్ఛ, ఏదైనా మీడియా ద్వారా ఆలోచనలు పంచుకునే హక్కుల గురించి, 22 నుండి 27 వ్యక్తి ఆరోగ్య సంరక్షణ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక హక్కులను మంజూరు చేయుటలో తగినంత జీవన ప్రమాణాలకు విస్తారమైన హక్కును సమర్థిస్తూ మాతృత్వం లేదా బాల్యంలో వారికి ఇవ్వబడిన సంరక్షణ గురించి, 28 నుండి 30 ఈ హక్కులను వినియోగించుకునే సాధారణ మార్గాల గురించి నిర్దేశించడం గురించి చెప్పడం జరిగింది.

**మన దేశంలో హక్కులు:**

ఇక మన దేశంలో చూస్తే జాతీయ మానవ హక్కుల కమిషన్ అనేది 1993 మానవ హక్కుల పరిరక్షణ చట్టానికి సంబంధించి భారత రాజ్యాంగం ప్రకారం 1993 లో స్థాపించబడిన ఒక చట్టబద్ధమైన సంస్థ. పిహెచ్ఆర్ చట్టంలోని సెక్షన్ 2 (1) (డి) మానవ హక్కులను రాజ్యాంగం ద్వారా హామీ ఇవ్వబడిన లేదా అంతర్జాతీయ ఒడంబడికలలో పొందుపరచబడిన, భారతదేశంలోని న్యాయస్థానాలు అమలు చేయగల వ్యక్తి యొక్క జీవితం, స్వేచ్ఛ, సమానత్వం, గౌరవానికి సంబంధించిన వాటిని హక్కులుగా పేర్కొంది. మన దేశ పౌర హక్కులను పరిరక్షించడం, ప్రోత్సహించడం ఈ కమిషన్ లక్ష్యం. మానవ హక్కుల ఉల్లంఘనలకు సంబంధించిన అన్ని ఫిర్యాదులను కమిషన్ పరిష్కరిస్తుంది, తీర్మానాలు సూచనలను అందిస్తుంది. పౌర, రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక హక్కులను కాపాడేందుకు నిరంతరం కృషి చేస్తోంది. దాని పరిధిని విస్తృతం చేయడానికి, కేసుల పరిష్కారాన్ని వేగవంతం చేయడానికి, హెచ్ ఆర్ సి నెట్ పోర్టల్ ను అనేక రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌లను చేర్చి, ఫిర్యాదుల డూప్లికేషన్‌ను తొలగించడంలో కేసుల స్థితిని ట్రాక్ చేయడంలో సహాయం చేస్తుంది. గతంలో ఈ కమిషన్ వివిధ వర్గాల మానవ హక్కుల కారణాన్ని మెరుగుపరిచే నిర్దిష్ట సలహాలను జారీ చేయడానికి తన ప్రయత్నాన్ని కొనసాగించింది. ఇది ఉద్దేశపూర్వకంగా స్వీయ హాని, ఖైదీల ఆత్మహత్యాయత్నాలను తగ్గించడం, లింగమార్పిడి వ్యక్తుల సంక్షేమాన్ని నిర్ధారించడానికి సంబంధించి సలహాలను జారీచేసింది. వాతావరణ మార్పు, వ్యాపారం, మానసిక ఆరోగ్యం మెరుగుదలకు సంబంధించిన సమస్యలతో పాటు కమిషన్‌కు ప్రధాన ఆందోళనగా ఉన్న ఢిల్లీ ఎన్‌సిఆర్‌లో వాయు కాలుష్యంపై నమోదు చేసిన స్వయంప్రతిపత్తి కేసుల విచారణను కమిషన్ కొనసాగిస్తోంది. జాతీయ కమిషన్‌లు రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌లతో సమావేశాలు, క్యాంపు సిట్టింగ్, ప్రత్యేక రిపోర్టర్‌లు, ప్రత్యేక మానిటర్‌ల సందర్శనలు, మానవ హక్కుల ఉల్లంఘనలను పరిశీలించడం, పర్యవేక్షించడం, మూల్యాంకనం చేయడం, సలహా ఇవ్వడం నివేదించడం, జైళ్లు, అబ్జర్వేషన్ హోమ్‌లు, పాఠశాలలు, మానసిక ఆరోగ్య సంస్థలు, పోలీస్ స్టేషన్‌లు, బాలబాలికల కోసం జువైనల్ హోమ్‌లు, రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖలు, వృద్ధుల గృహాలు, ఆసుపత్రులు, అంగన్‌వాడీలు మొదలైన వాటిలో ఎన్‌హెచ్‌ఆర్‌సి అనుసరించిన కొన్ని సమర్థవంతమైన విధానాలు దేశంలోని మానవ హక్కుల పరిస్థితిని గమనించి సంబంధిత అధికారులకు అవసరమైన సిఫార్సులు చేస్తుంది.

**నమోదైన కేసులు:**

ఈ ఏడాది నవంబర్ వరకు 44,940 కేసులు, 2023 సం.లో 79,364 కేసులు నమోదు చేయబడ్డాయి. ఇందులో ఉత్తరప్రదేశ్ లో 32,666(41.2%), ఢిల్లీలో 5550 (7.0%) , బీహార్లో 4736 ( 6.0% ), తమిళనాడులో 3218 (4.1% ) , వెస్ట్ బెంగాల్ 3564 (4.4 %) , ఇతర రాష్ట్రాలలో 2960 (37.4 %) నమోదయ్యాయి. ప్రారంభమైనప్పటి నుండి గత 30 సం.లలో కమిషన్ 22.48 లక్షలకు పైగా కేసులను నమోదు చేసింది, 22.41 లక్షల పైబడి కేసులను పరిష్కరించింది. హక్కుల ఉల్లంఘన బాధితులకు రూ. 230 కోట్లు మానవ సాయంగా ఇప్పించింది.


**మన రాజ్యాంగం ప్రసాదించే హక్కులు:**

భారత రాజ్యాంగంలో ఆరు ప్రాథమిక హక్కులు ఉన్నాయి. సమానత్వపు హక్కు (ఆర్టికల్ 14 - 18), స్వేచ్ఛా హక్కు (ఆర్టికల్ 19 - 22), దోపిడీకి వ్యతిరేకంగా హక్కు(ఆర్టికల్ 23 - 24), మతస్వేచ్ఛ హక్కు(ఆర్టికల్ 25 - 28), సాంస్కృతిక, విద్యా హక్కులు (ఆర్టికల్ 29 - 30), రాజ్యాంగ పరిష్కారాల హక్కు (ఆర్టికల్ 32) ఉన్నాయి. వీటంటినీ అమలు చేసే బాధ్యత కేవలం ప్రభుత్వాల మీదనే కాదు, ఈ హక్కులు ఉల్లంఘన కాకుండా చూడవలసిన బాధ్యత ప్రతీ పౌరిని మీదా ఉంది. జై హింద్ !


**జనక మోహన రావు దుంగ**
**ఫోన్:8247045230**


భక్తి

# కల్కి వచ్చేది అప్పుడే



కల్కి అవతారాన్ని భవిష్యత్తులో జరగబోయేదిగా మన పూర్వ ఋషులు వర్ణించారు. ఆయన జన్మించే శంభల గ్రామం ధర్మబద్ధమైనదనీ, అది సామాన్యులకు అగోచరంగా... అంటే కంటికి కనిపించకుండా ఉంటుందనీ కూడా వెల్లడించారు. కానీ ప్రజలలో కుతూహలం పెరిగి, వాటిపై రకరకాల కల్పిత కథనాలు ఊహాపోహలు ఎక్కువయ్యాయి. నిరాధారమైన అప్రామాణిక కథలు చిలవలుపలవలుగా సామాజిక మాధ్యమాలలో చక్కర్లు కొడుతున్నాయి. ఈ నేపథ్యంలో సనాతన ధార్మిక గ్రంథాలు చెబుతున్న అసలు విషయాలను తెలుసుకొనే ప్రయత్నం చేయాలి. కల్కి ఈ యుగాంతంలో ఆవిర్భవించే అవతారం. 'అథాసౌ యుగసంధ్యాయాం...' అంటే 'యుగసంధిలో...' అని పురాణాలు స్పష్టంగా చెబుతున్నాయి. దానికి ఇంకా చాలా సమయం ఉంది.సృష్టి స్థితి లయకారకుడైన పరమాత్మ... ధర్మ ప్రతిష్ఠాపన కోసం, అధర్మ నిర్మూలన కోసం తనను తాను యోగమాయా శక్తితో అవతరింపజేసుకుంటాడనేది సనాతన ధర్మ శాస్త్రాలు చెబుతున్న మాట. వాటిలో ప్రధానంగా... త్రేతాయుగంలో రామావతారం, ద్వాపర యుగంలో కృష్ణావతారం, కలియుగాంతంలో కల్కి అవతారం సంభవిస్తాయని పూర్వ ఋషులు పలుచోట్ల ప్రస్తావన చేశారు. ప్రజలు ఒకరంటే ఒకరికి గిట్టక... పరస్పర కలహాలతో ధర్మనాశనం జరిగే కాలం కలియుగం. 'కల్యంతే కలహం కుర్వంత్యస్మిన్నితి కలిః' అని వ్యుత్పత్తి. పాపం, దురాచారం, విచ్చలవిడితనం, మర్యాదారాహిత్యం, పరస్పర హింస, ప్రకృతి వైపరీత్యాలు లాంటి దుర్లక్షణాలు... కలి స్వభావాలు. దుర్మార్గులు పాలకులై, ధర్మ విరోధుల దాష్టీకాలతో దెబ్బతిన్న కలియుగంలో... ధర్మ రక్షణ కోసం శ్రీమహావిష్ణువు ఆవిర్భవిస్తాడనే విషయాన్ని 'విష్ణుపురాణం', 'శ్రీమద్భాగవతం', 'విష్ణు ధర్మోత్తర పురాణం' తదితర పురాణాలలో, కొన్ని కావ్యాల్లో వివరించారు. భాగవతానికి అనుబంధమైన ఉప పురాణం 'శ్రీ కల్కి పురాణం'లో కల్కి కథ విస్తృతంగా వివరించి ఉంది.

ఇత్థం కలౌ గతప్రాయే జనేషు ఖర ధర్మిషు... ధర్మత్రాణాయ సత్త్వేన భగవానవతరిష్యతి... శంభల గ్రామ ముఖ్యస్య బ్రాహ్మణస్య మహాత్మనః... భవనే విష్ణుయశసః కల్కిః ప్రాదుర్భవిష్యతి... తదితర శ్లోకాల్లో కల్కి అవతార విశేషాలను 'శ్రీమద్భాగవతం' వర్ణించింది. ఇదే అర్థాన్ని ఇచ్చే వాక్యాలు, శ్లోకాలు ఇతర పురాణాలలోనూ ఉన్నాయి. "గాడిదల మాదిరిగా ప్రవర్తించే జంతుప్రాయులైన మానవుల వల్ల అధర్మం ప్రబలుతుంది. దానివల్ల ప్రకృతి వైపరీత్యాలు విజృంభిస్తాయి. ఆ సమయంలో భగవానుడు ధర్మ రక్షణ కోసం సత్త్వగుణంతో అవతరిస్తాడు. సకలలోక గురువైన, సర్వులకూ ఆత్మ అయిన, సర్వేశ్వరుడైన మహావిష్ణువు... సాధువులను రక్షించడానికి ఆవిర్భవిస్తాడు. శంభల గ్రామంలో విష్ణుయశుడనే వేదవేత్తకు తనయుడిగా జన్మిస్తాడు. దేవదత్తమనే అశ్వాన్ని అధిరోహిస్తాడు.

నవభూమి

www.navabhoomi.in
www.epaper.navabhoomi.in

5 | హైదరాబాద్ మంగళవారం 10 । డిసెంబర్ । 2024


## పెంపుడు జంతువులతో జాగ్రత్త!



మనం ఇళ్లలో సాధారణంగా కుక్కలు, పిల్లులు, మేకలు లాంటి జంతువుల్ని చిలుకలు, బాతులు, పావురాలు లాంటి పక్షులను పెంచుకుంటూ ఉంటాము. వీటి ఆరోగ్యం, పరిశుభ్రత తదితరాలపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తూ ఉంటాం. అయినప్పటికీ పెంపుడు జంతువులు లేదా పక్షుల నుంచి మనకు కొన్ని అంటువ్యాధులు సోకే ప్రమాదం ఉంటుంది. వాటి గురించి తెలుసుకుందాం!రేబిస్: పిల్లలకు పాలిచ్చి పెంచే క్షీరదజాతి జంతువులైన కుక్కలు, పిల్లులు, తదితరాల నుంచి రేబిస్ వ్యాధి వ్యాప్తి చెందుతుంది. ఈ వ్యాధి సోకిన జంతువుల లాలాజలంలో వ్యాధికారక క్రిములు ఉంటాయి. పెంపుడు జంతువులతో దగ్గరగా మసలుతున్నపుడు అవి కరచినా, తుమ్మినా వ్యాధి క్రిములు మన శరీరంలోకి చేరతాయి. తీవ్రమైన తలనొప్పి, గొంతునొప్పి, జ్వరం వంటివి రేబిస్ లక్షణాలు. ఇది ప్రాణాంతక వ్యాధి. రేబిస్ వేక్సిన్ తీసుకున్నప్పటికీ ఆర్నెల్ల నుంచి రెండేళ్ల వరకు మాత్రమే రక్షణ లభిస్తుంది. పెంపుడు జంతువులతో గడుపుతున్నపుడు మాస్కులు ధరించడం, తరచూ చేతులు పరిశుభ్రం చేసుకోవడం అలవాటు చేసుకోవాలి. పెంపుడు జంతువులకు ప్రతినెలా ఆరోగ్య పరీక్షలు చేయించి అవసరమైన చికిత్సలు అందించాలి.బర్డ్ ఫ్లూ: ఇది కోళ్లు, బాతుల వల్ల వ్యాప్తి చెందుతుంది. వీటివల్ల మనుషులకే కాదు జంతువులకు కూడా బర్డ్ ఫ్లూ వచ్చే ప్రమాదం ఉంది. ఈ వ్యాధి సోకిన పక్షుల రెట్టలు, లాలాజలం, కళ్ల స్రావాల్లో వ్యాధి కారక వైరస్ ఉంటుంది. బర్డ్ ఫ్లూ వ్యాధికి గురైన వారిని దగ్గు, శ్వాసకోశ ఇబ్బందులు, తలనొప్పి, జ్వరం, కండరాల నొప్పి, ముక్కు కారడం, గొంతు నొప్పి లాంటివి వేధిస్తుంటాయి.

# వీరనాయికా జయహో!



తొడగొట్టిన కట్టబొమ్మన్.. విల్లంబులు ఎక్కుపెట్టిన అల్లూరి..మీసం మెలేసిన భగత్‌సింగ్.. ఇలా.. వందేమాతరం అన్న మొన్నటి తరంలో మేరునగ మగధీరులు ఎందరో! స్వాతంత్ర్యోద్యమ చరిత్రను పరికిస్తే..నడుం బిగించి.. పగవాడికి మగవాడి కన్నా ప్రమాదకరం అని నిరూపించిన వీరనాయికలూ కనిపిస్తారు. ఆంగ్లేయుల కుత్తికలు కోసిన వీరమంగై.. నేతాజీ పిలుపు అందుకున్న శివగామి.. బాపూజీకి అండగా నిలిచిన బీ అమ్మ.. ఇలా మరెందరో! భారత స్వతంత్ర దినోత్సవ వేళవారి చరిత్రను తలుచుకుందాం.. త్యాగాలను స్మరించుకుందాం.

**తెల్లదొరలను ఓడించిన వీరమంగై**

బ్రిటిష్‌వారికి వ్యతిరేకంగా రాజులు, సైనికుల పోరాటం అంటే మనకు 1857లో జరిగిన సిపాయిల తిరుగుబాటే గుర్తుకువస్తుంది. నానాసాహెబ్, రాణి లక్ష్మీబాయి లాంటివారి పేర్లే స్ఫురిస్తాయి. కానీ, అంతకంటే చాలా ఏండ్ల ముందే స్వదేశీ రాజ్యాల పాలకులు బ్రిటిష్‌వారిపై పోరాటం చేశారు. రాణి కిత్తూరు చెన్నమ్మ, వీరపాండ్య కట్టబొమ్మన్ లాంటివారు ప్రసిద్ధి చెందారు. రాణి వేలు నాచ్చియార్ కూడా ఈ కోవలోకే వస్తారు.

ఆమె 1730 జనవరి 3న తమిళనాడు రాష్ట్రం రామనాథపురంలో జన్మించారు. బ్రిటిష్‌వారిపై తిరుగుబాటు బావుటా ఎగురవేసిన తొలి భారతీయ పాలకురాలు వేలు నాచ్చియార్. అందుకే ఆమెను తమిళులు 'వీరమంగై' అని పిలుచుకుంటారు. బ్రిటిష్‌వారిపై పోరాటం కోసం ఆమె ఆయుధాలు పట్టడం, తమిళ పోరాట కళలైన వలరి, శీలంబం, గుర్రపు స్వారీ, విలువిద్యలను నేర్చుకున్నారు. అంతేకాదు ఆమె తన మాతృభాష తమిళంతోపాటు ఇంగ్లిష్, ఉర్దూ, ఫ్రెంచి కూడా మాట్లాడగలరు.

వేలు నాచ్చియార్ వివాహం శివగంగై పాలకుడు ముత్తువడుగనాథపెరియ ఉడైయదేవర్‌తో జరిగింది. భర్త బ్రిటిష్‌వారి చేతుల్లో మరణించడంతో ఆమె స్వయంగా యుద్ధరంగంలో అడుగుపెట్టారు. మైసూరు పాలకుడు హైదర్ అలీ, గోపాల నాయకర్‌తో కలిసి ఆంగ్లేయులతో పోరాడారు. హెూరాహెూరీ పోరులో బ్రిటిష్ సైన్యంపై రాణి విజయం సాధించారు. అలా శివగంగై సంస్థానాన్ని తన అధీనంలోకి తెచ్చుకున్నారు. 1780 నుంచి మరుదు సోదరుల సహకారంతో పరిపాలన కొనసాగించారు. దశాబ్దం తర్వాత వేలు నాచ్చియార్ కూతురు వెల్లాచ్చి సంస్థానాధీశురాలు అయింది. 1796 డిసెంబర్ 25న నాచ్చియార్ మరణించారు.

**వయసులో చిన్న..పోరాటంలో మిన్న**

భారత స్వరాజ్య సమరంలో నేతాజీ సుభాష్‌చంద్ర బోస్ ఆధ్వర్యంలో నడిచిన భారత జాతీయ సైన్యం పోరాటం ఆంగ్లేయులకు ముచ్చెమటలు పట్టించింది. సింగపూర్ నుంచి ప్రారంభమైన బోస్ పోరాటం బర్మా మీదుగా భారత దేశ సరిహద్దుల వరకు సాగింది. ఈ నేపథ్యంలో నేతాజీ ఉపన్యాసాలు ఎంతోమందిలో పోరాట స్ఫూర్తిని నూరిపోశాయి. ఆయన మాటలకు తూటాల్లా దూసుకెళ్లిన యోధుల్లో ఒకరు శివగామి అమ్మయ్యార్.

ఆమె 1933లో తమిళనాడులోని ధర్మపురి జిల్లా అణ్ణాసాగరం



గ్రామంలో జన్మించారు. మారిముత్తు ముదలియార్, చిన్నతాయి ఆమె తల్లిదండ్రులు. తన కుటుంబంతోపాటు శివగామి మలేసియాకు వలసవెళ్లారు. అక్కడ మారిముత్తు ఓ తేయాకు తోటలో పనిచేసేవారు. శివగామి మలేసియా రాజధాని కౌలాలంపూర్‌లో ఉన్న జై హింద్ హిందూ పాఠశాలలో చదువుకున్నారు. అదే సమయంలో భారత జాతీయ సైన్యం పోరాటం మొదలైంది.

అప్పుడు సుభాష్‌చంద్ర బోస్ ఉపన్యాసంతో స్ఫూర్తిపొందిన శివగామి, పదకొండేండ్ల వయసులోనే భారత జాతీయ సైన్యంలో భాగమైన 'బాలక్ సేన'లో చేరారు. అలా 1942 1945 మధ్యకాలంలో శివగామి సాంఘిక సంక్షేమ వసతి గృహంలో కేర్‌టేకర్‌గా సేవలందించారు. ఆ సమయంలో ఆమె తన సోదరుడు పరంధామ్‌తో కలిసి 'వీరవనిత' అనే వీధి నాటకం ప్రదర్శించారు. వీధుల్లో ప్రదర్శనలు ఇస్తూ భారత జాతీయ సైన్యం కోసం నిధుల సేకరణ చేపట్టారు. స్థానిక ప్రజల్లో భారత స్వాతంత్ర్య పోరాటం గురించి ప్రచారం చేశారు.

ఆమె గురించి తెలుసుకున్న నేతాజీ బర్మా రావాలని శివగామిని అడిగారు. కానీ, ఆమె అందుకు ఒప్పుకోలేదు. కాగా, రెండో ప్రపంచ యుద్ధ సమయంలో బాంబు దాడుల్లో గాయపడ్డవారిని తన సోదరుడితో కలిసి శివగామి కాపాడింది. అయితే, శివగామి ఆధ్వర్యంలో నడుస్తున్న వసతిగృహాన్ని 1943లో బ్రిటిష్ వాళ్లు స్వాధీనం చేసుకున్నారు. ఆమెను బ్రిటిష్ అధికారుల ముందు డ్యాన్స్ చేయాలని సైనికులు ఒత్తిడిచేశారు. కానీ, ఆమె ధైర్యంగా అందుకు నిరాకరించారు. రెండో ప్రపంచ యుద్ధకాలంలో అతిపిన్న వయసులోనే దేశమాత స్వాతంత్ర్యం కోసం ఆరాటపడిన శివగామిని తమిళనాడు ప్రభుత్వం 1973లో 'త్యాగ చెమ్మాళ్' పురస్కారంతో గౌరవించింది.

**స్వరాజ్య సాధనలో అమ్మ పాత్ర**

ఇప్పుడు ఎక్కువమందికి ఆబాదీ బానో బేగం పేరు అంతగా తెలియకపోవచ్చు. ఆమె స్వాతంత్ర్య పోరాటంలో గాంధీజీతో కలిసి పోరాడిన అలీ సోదరుల (మౌలానా మహమ్మద్ అలీ, మౌలానా షౌకత్ అలీ) తల్లి. జాతీయోద్యమ చరిత్రలో ఆమె 'బీ అమ్మ'గా ప్రసిద్ధి చెందారు. అంతేకాదు, స్వాతంత్ర్య పోరాటంలో చురుగ్గా పాల్గొన్న తొలి ముస్లిం మహిళగా పేరుగాంచారు. ఆమె 1850లో ఉత్తరప్రదేశ్‌లోని అమ్రోహాలో జన్మించారు.

రాంపూర్ రాజ్యానికి చెందిన అబ్దుల్ అలీ ఖాన్‌ను పెళ్లి చేసుకున్నారు. అయితే ఆమె భర్త చిన్న వయసులోనే కలరాతో మరణించారు. తర్వాత బేగం తన నగలను పిల్లలు చదువుకోవడానికిగాను ఓ ఇంగ్లిష్ మీడియం పాఠశాలకు విరాళంగా ఇచ్చేశారు. తర్వాత కాలంలో ఆమె తన కొడుకులతో కలిసి స్వాతంత్ర్య పోరాటంలో ప్రధాన ఘట్టాలైన ఖిలాఫత్ ఉద్యమం, సహాయ నిరాకరణ ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొన్నారు. ఈ క్రమంలో లాహెూర్‌లో జరిగిన ఓ సమావేశంలో ఆబాదీ బానో బేగం స్ఫూర్తిదాయకమైన ఉపన్యాసం ఇచ్చారు. దేశం బ్రిటిష్ వారి చేతుల్లోకి వెళ్లడానికి భారతీయులు చేసిన పొరపాట్లను అందులో వివరించారు.

అనీబిసెంట్, తన కొడుకులను బ్రిటిష్ ప్రభుత్వం అరెస్ట్ చేసినప్పుడు దానికి నిరసనగా జరిగిన ఓ ర్యాలీలో ఆమె పాల్గొన్నారు. ఖద్దరు ప్రాధాన్యం గురించి ప్రచారం చేశారు. హిందువులు ముస్లింల మధ్య ఐక్యతకు కృషిచేశారు. స్వరాజ్య సాధన కోసం భారతీయులంతా కలిసి పోరాడాలని పిలుపునిచ్చారు. గాంధీజీ ఆధ్వర్యంలో జరిగిన సహాయ నిరాకరణ ఉద్యమంలో బేగం పాట్నా, భగల్‌పూర్ మధ్య పర్యటించారు. అదే సమయంలో జరిగిన ఖిలాఫత్ ఉద్యమం కోసం ఆమె అరవైవేల రూపాయలు సేకరించారు. అలా 1924లో తాను మరణించేవరకు ఆబాదీ బానో బేగం దేశ స్వాతంత్ర్యం కోసం కృషిచేశారు. ఆమె స్మారకంగా దిల్లీలోని జామియా మిల్లియా ఇస్లామియా విశ్వవిద్యాలయంలోని మహిళల వసతి గృహానికి 'బీ అమ్మ' పేరుపెట్టారు.



## నిత్యపూజ కోసం పువ్వులు సమకూర్చుకోవడం కష్టమవుతోందా..



అష్టోత్తర నామాలతో పాటు అష్టోత్తర పుష్పాలనూ సమర్పించడం మన పూజా విధానంలో భాగం. నిత్యపూజ కోసం అన్ని పువ్వులు సమకూర్చుకోవడం కష్టమనే ఉద్దేశంతో కొంతమంది రజత పుష్పాలను ఎంచుకుంటారు. నూట ఎనిమిది వెండిపూలు ఓ సెట్టుగా కలువ మొగ్గల ఆకారంలో.. వెండి రంగులో లభించేవి ఇన్నాళ్లూ. ఇప్పుడు, అసలు పువ్వులకు దీటుగా ఎన్నో వన్నెల్లో తయారు చేస్తున్నారు స్వర్ణకారులు.

సువర్ణ, రజతాలకు మన సంప్రదాయంలో పవిత్ర స్థానం ఉంది. ఒకప్పుడు మహారాణులు బంగారు పువ్వులతో పూజలు చేసేవారని అంటారు. కలవారి కోడలిని ఉద్దేశించి, 'బంగారు పువ్వులతో పూజ చేసుకున్నట్టుంది. ఎంత గొప్ప జీవితం అనుభవిస్తున్నదో!' అనుకునేవారు. ఇక, ఈ రోజుల్లో బంగారం ప్రియం కావడంతో వెండిపూల సెట్లు ఆ స్థానాన్ని భర్తీ చేస్తున్నాయి. అచ్చంగా వెండి రంగులోనే కనిపించేవే కాదు, బంగారు పూత పూసినవీ వస్తున్నాయి. వాటిలోనూ వైవిధ్యాన్ని కోరుకునేవారి కోసం 'ఎనామిల్ ఫ్లవర్లు' ముస్తాబవుతున్నాయి.

రకరకాల ఆకృతుల్లో, చూడచక్కని వర్ణాల్లో ఎనామిల్ పువ్వుల్ని తయారు చేస్తున్నారు. గులాబీ వన్నెలు చిందించే తామర పూలు, వింత రంగుల్లో విరిసే గన్నేరులు, ఎరుపు, పసుపు వర్ణాల్లో మందారాలు.. ఇలా అనేకరకాల పుష్పాలు వస్తున్నాయి. విభిన్న ఆకృతుల్లో ఆకట్టుకునేలా.. వీటిని తీర్చిదిద్దుతున్నారు. అర్చనకు వాడే నూట ఎనిమిది పువ్వుల సెట్లే కాదు, దేవుడి అలంకరణకు పనికొచ్చేందుకూ రకరకాల పువ్వుల్ని రూపొందిస్తున్నారు.



# కళ్లు పొడిబారుతున్నాయా?

**కళ్లలో నీళ్లు తక్కువగా ఉత్పత్తి కావడం వల్ల అవి కంటిని తేమగా ఉంచేందుకు సరిపోక కళ్లు పొడిబారుతుంటాయి. కళ్లలో నీళ్లు త్వరగా ఆవిరైపోతున్నా కూడా ఈ సమస్య వస్తుంది. దీనివల్ల కళ్లు దురదగా ఉండడం, ఎర్రబడడం, మంట అనిపించడం, వెలుగును చూడలేకపోవడం, ఏదో పడినట్లుగా గుచ్చుతుండడం లాంటి అసౌకర్యాలు కలుగుతాయి. కొన్ని ఇంటి చిట్కాలతో వీటినుంచి ఉపశమనం పొందవచ్చు. అవి...**



**వేడి గుడ్డతో ఒత్తడం:** మెత్తని గుడ్డ లేదా కొంచెం దూదిని తీసుకుని వేడి నీటిలో ముంచి గట్టిగా పిండండి. దీనిని గుండ్రంగా మడిచి మూసిన కంటి రెప్పల మీద ఉంచి చిన్నగా ఒత్తండి. వెంటనే కంటి రెప్పల్లో ఉన్న నూనె గ్రంథులు పూర్తిగా తెరుచుకుంటాయి. కంటిలో సన్నని నూనె పొర పరచుకుంటుంది. దీనివల్ల కంటిలో గరగర, మంట, దురద తగ్గుతాయి.

తేమగా ఉండేలా: కళ్లు పొడిబారకుండా నీళ్లతో నిండి తేమగా ఉండాలంటే ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్ ఉన్న ఆహారం తీసుకోవాలి. చేపలు, వాల్‌నట్స్, అవిసె గింజలు, చియా గింజలను ఆహారంలో చేర్చుకోవడం వల్ల కళ్లలో నీళ్లు ఎక్కువగా ఉత్పత్తి అవుతాయి. దాహం అనిపించకపోయినా ప్రతి మూడు గంటలకు ఒకసారి గ్లాసు మంచినీళ్లు తాగాలి. కళ్లలోకి ఎక్కువగా వెలుతురు, దుమ్ము సోకకుండా జాగ్రత్త తీసుకోవాలి.

కలబందతో: కలబంద ఆకు నుంచి గుజ్జును తీసుకుని మంచినీటిలో ముంచి తీయాలి. దీనిని మూసిన కంటి రెప్పల మీద పరచాలి. ఇది కంటిలోపలికి వెళ్లకుండా జాగ్రత్త తీసుకోవాలి. పది నిముషాల తరవాత కళ్లను కడగాలి. ఇలా రోజుకు రెండుసార్లు చేస్తూ ఉంటే కలబందలోని ఔషధ గుణాల వల్ల కళ్లవాపు, దురద తగ్గుతాయి.


**20-20-20 నిబంధనతో:** ఎక్కువసేపు కంప్యూటర్‌ను చూస్తూ పనిచేయడం వల్ల రెప్పపాటు తగ్గి కళ్లు పొడిబారుతాయి. రెప్పపాటు వల్లనే కన్నీళ్లు వ్యాపించి కన్ను మొత్తం తేమగా ఉంటుంది. అందుకే ఈ 20-20-20 నిబంధనను పాటించాలి. ఇందులో ప్రతి 20 నిమిషాలకోసారి 20 అడుగుల దూరంలో ఉన్నవాటిని 20 సెకండ్లపాటు చూస్తూ ఉండాలి. ఇలా తరచూ చేస్తూ ఉంటే కంప్యూటర్ స్క్రీన్ వల్ల కలిగే అలసట తగ్గి కన్ను విశ్రాంతి పొందుతుంది. పచ్చని చెట్లను, ఆకాశాన్ని, ఎగిరే పక్షులను, పారే నీటిని చూస్తున్నా కూడా కళ్లకు తేలికపాటి వ్యాయామం చేసినట్లవుతుంది.

**కీరాతో:** కీరాను సన్నని చక్రాలుగా కోసి కళ్లమీద ఉంచుకోవాలి. కనీసం పావుగంటసేపు కళ్లు మూసుకుని విశ్రాంతి తీసుకోవాలి. కీరాలో ఉన్న నీరు, యాంటీ ఆక్సిడెంట్లు కంటి చుట్టూ ఉన్న చర్మానికి తేమని అందించి కళ్లకు చల్లదనాన్ని కలిగిస్తాయి. కళ్లలో దురద తగ్గుతుంది. చల్లని పాలలో దూదిని ముంచి కళ్లమీద ఉంచుకున్నా కూడా కళ్లు విశ్రాంతి పొందుతాయి.

### పండ్లు తింటే

# రక్తపోటు పరార్!

రక్తపోటును అదుపులో ఉంచుకోవాలంటే పండ్లను అధికంగా తీసుకోమంటున్నారు పరిశోధకులు. యాపిల్స్, పియర్స్, ద్రాక్షలు, ఎండు ద్రాక్షలు, ఇతర డ్రైఫ్రూట్స్ తీసుకుంటే రక్తపోటు పెరిగే అవకాశం తక్కువని సూచిస్తున్నారు. పండ్లు ఎక్కువగా తీసుకోని వాళ్లకంటే పండ్లు తినేవాళ్లలో అధిక రక్తపోటు అవకాశం చాలా తక్కువ. బ్రాకోలి, క్యారెట్ లాంటి కూరగాయలు కూడా అధిక రక్తపోటును తగ్గించడంలో తోడ్పడతాయి. ఈ పండ్లు, కూరగాయల్లో పొటాషియం, ఫ్లేవినాయిడ్లు సమృద్ధిగా ఉంటాయి. ఈ రెండూ కూడా రక్తపోటును తగ్గించడంలో కీలకమైనవని చెబుతున్నారు పోషకాహార నిపుణులు.



నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
6 | హైదరాబాద్
మంగళవారం
10 । డిసెంబర్ । 2024






# నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు.. 200 పాయింట్లు పతనమైన సెన్సెక్స్..



**ముంబై-నవభూమి:**దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా రెండోరోజూ నష్టాల్లో ముగిశాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 2024-25లో వృద్ధి అంచనాలను 7.2శాతం నుంచి 6.6శాతానికి తగ్గించింది. అలాగే, ద్రవ్యోల్బణం అంచనాలను 4.5శాతం నుంచి 4.8శాతం శాతానికి పెంచింది. ఈ క్రమంలో మార్కెట్లు ఒడిదుడుకులను ఎదుర్కొన్నాయి. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్ 81,602.58 వద్ద నష్టాల్లో మొదలైంది. ఆ తర్వాత మళ్లీ లాభాలబాటలో పట్టినా చివరకు పతనమయ్యాయి. ఒక దశలో 81,783.28 పాయింట్లకు పెరిగిన సెన్సెక్స్.. అత్యల్పంగా 81,411.55 పాయింట్లకు తగ్గింది. చివరకు 200.66 పాయింట్ల నష్టంతో 81,508.46 వద్ద ముగిసింది.నిఫ్టీ 58.80 పాయింట్లు తగ్గి.. 24,619.00 వద్ద ముగిసింది. దాదాపు 2,222 షేర్లు పురోగమించగా.. 1,692 షేర్లు పతనమయ్యాయి. నిఫ్టీ నష్టపోయిన వాటిలో టాటా కన్స్యూమర్, హెచ్‌యూఎల్, టాటా మోటార్స్, యాక్సిస్ బ్యాంక్, నెస్లే ఇండియా ఉన్నాయి. ఎల్‌అండ్‌టీ, విప్రో, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్, బీపీసీఎల్, టాటా స్టీల్ లాభపడ్డాయి. సెక్టార్లలో ఎఫ్ఎంసీజీ, మీడియారంగాల షేర్లు 2శాతం చొప్పున, ఫార్మా, పీఎస్‌యు బ్యాంక్, ఆటో, ఎనర్జీ 0.5 శాతం చొప్పున పతనమయ్యాయి. మెటల్ ఇండెక్స్ 0.6 శాతం, క్యాపిటల్ గూడ్స్ ఇండెక్స్ ఒకశాతం చొప్పున పెరిగాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.3 శాతం, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 0.5 శాతం వృద్ధిని నమోదు చేశాయి.

# మహిళలకు గుడ్‌న్యూస్.. బంగారం కొనేందుకు ఇదే కరెక్ట్ టైమ్



**ముంబై-నవభూమి:**బంగారాన్ని ఇష్టపడని వారు ఉండరంటే అతిశయోక్తి కాదు. అందునా మహిళలు అయితే చెప్పనక్కర్లేదు. పసిడి అంటే స్త్రీలకు చాలా ఇష్టం. మన దేశంలో గోల్డ్‌ను ఆభరణంగానే గాక ఇన్వెస్ట్‌మెంట్‌గానూ చూస్తారు. ఏదైనా అత్యవసరం ఉంటే బంగారాన్ని తనఖా పెట్టొచ్చని భావిస్తారు. అందుకే ఇదో పెట్టుబడిగా మారింది. డబ్బులు ఉంటే గోల్డ్ కొని పక్కన పెట్టడం చాలా మందికి అలవాటు. దీన్ని స్టేటస్ సింబల్‌గానూ చూస్తుంటారు. కాబట్టి ఎంత గోల్డ్ ఉంటే అంత తోపు అనే భావన కూడా ఎక్కువ మందిలో ఉంది. ఇలా ఎన్నో ప్రత్యేకతలు సంతరించుకున్న బంగారం ధరలు ఇవాళ ఎలా ఉన్నాయి? అనేది ఇప్పుడు చూద్దాం..


**తులం ఎంతంటే..**

ఈ మధ్య బంగారం ధరలు భారీగా తగ్గుతున్నాయి. డిసెంబర్ 9వ తేదీ సోమవారం కూడా గోల్డ్ రేట్స్ తగ్గాయి. బంగారం 10 గ్రాములకు సుమారుగా రూ.600 తగ్గింది. హైదరాబాద్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ రేట్ 77,649 పలుకుతోంది. అదే 22 క్యారెట్ల 10 గ్రాములు బంగారం ధర చూసుకుంటే రూ.71,179గా ఉంది. వెండి విషయానికొస్తే.. కేజీ సిల్వర్ రేట్ రూ.1,03,300 పలుకుతోంది. ఇక, బంగారం ధరలు ఈ మధ్య భారీగా తగ్గుతున్నాయి. నవంబర్ నెలలో గరిష్ట స్థాయిలో తులం రూ.84 వేల వరకు వెళ్లినా.. ఆ తర్వాత క్రమంగా పడిపోతూ వచ్చింది.

**ఇదే బెస్ట్ టైమ్**

నవంబర్ నెలలోని ఆల్‌టైమ్ హైతో పోల్చి చూస్తే ఇప్పుడు రూ.77 వేల వరకు వచ్చేసింది బంగారం. గత నెలతో పోలిస్తే ఇది చాలా తక్కువ అనే చెప్పాలి. నెల రోజుల వ్యవధిలో దాదాపుగా రూ.7 వేల మేర రేటు తగ్గడం మామూలు విషయం కాదు. అందుకే గోల్డ్ కొనాలనుకుంటే ఇదే బెస్ట్ టైమ్ అని నిపుణులు సూచిస్తున్నారు. కాగా, అంతర్జాతీయంగా చోటుచేసుకుంటున్న పలు పరిణామాల వల్లే బంగారం ధరల్లో భారీ మార్పు వస్తోందని ఎక్స్‌పర్ట్స్ అంటున్నారు. యూఎస్‌లో డాలర్ బలపడే కొద్దీ గోల్డ్ రేట్ తగ్గుతుందని చెబుతున్నారు. డొనాల్డ్ ట్రంప్ గెలుపుతో అక్కడి ఇన్వెస్టర్లు బంగారం మీద పెట్టుబడులు తగ్గించుకుంటున్నారని అంటున్నారు. గోల్డ్ నుంచి స్టాక్ మార్కెట్‌లో లాభాలు ఎక్కువగా ఉండటంతో అటు వైపు షిఫ్ట్ అవుతున్నారని అంచనా వేస్తున్నారు.

# సామాన్యుడికి షాక్ ఇస్తున్న కూరగాయలు.. నెలాఖరు వరకు దంచుడే..



**హైదరాబాద్-నవభూమి:** కూరగాయలు, నిత్యావసర వస్తువులు సామాన్యుడికి షాక్ ఇస్తున్నాయి. ఒక్కసారిగా పెరిగిన ధరల కారణంగా కొని తినలేని పరిస్థితి నెలకొంది. వాటి కోసం దుకాణానికి వెళ్లాలంటే భయపడాల్సిన సిచ్యువేషన్. సామాన్య, మధ్యతరగతి ప్రజల్ని వెజిటేబుల్ రేట్స్ బెంబేలెత్తిస్తున్నాయి. బియ్యం నుంచి మినపపప్పు వరకు, ఉల్లి నుంచి ఆలూ వరకు అన్నీ కొండెక్కి కూర్చున్నాయి. దీంతో వంట వండుకోవడం కంటే పస్తులు ఉండటం బెటర్ అనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఒక్కసారిగా పెరిగిన ధరలు ఇప్పట్లో తగ్గేలా లేవు. నెలాఖరు వరకు దంచుడే అనేలా ఉంది పరిస్థితి.

**జేబులు గుల్ల**

గత వారం రోజులుగా కూరగాయలు, నిత్యావసర సరుకుల ధరలు అమాంతం పెరిగాయి. దాదాపు 15 నుంచి 20 శాతం పెరిగి సామాన్యుడి జేబులు గుల్ల చేస్తున్నాయి. బియ్యం ధరలు కనీసం కిలో రూ.50, పాత బియ్యం అయితే రూ.59 నుంచి రూ.70 దాకా ఉంటున్నాయి. ఈ పది రోజుల్లో బియ్యం రేట్లు రూ.5 నుంచి రూ.9 వరకు పెరిగాయి. కందిపప్పు ధర అయితే డబుల్ సెంచరీ దాటేసింది. కిలో కందిపప్పు ధర రూ.200 నుంచి రూ.230 వరకు ఉంది. అదే వంటల్లో అధికంగా వాడే మినపపప్పు అయితే రూ.130-రూ.148గా ఉంది.

**ముట్టుకుంటే షాకే**

పెసరపప్పు ధరలు కూడా భగ్గుమంటున్నాయి. కిలో పెసరపప్పు రూ.160గా ఉంది. శనగపప్పు కూడా కొండెక్కింది. మామూలు కంటే రూ.30 అధికంగా ఉంది. రవ్వ, పల్లీల రేట్స్ కూడా రూ.10 నుంచి రూ.20 దాకా పెరిగాయి. కిచెన్‌లో ఎంతో కీలకమైన వంట నూనెల ధరలు నెల రోజుల్లో రూ.20 వరకు పెరిగాయి. గత వారం రోజులుగా ఉల్లి, టమాట ధరలు మంట పుట్టిస్తున్నాయి. కిలో ఉల్లిగడ్డ రూ.60గా ఉంది. అదే టమాట కిలో రూ.50 నుంచి రూ.60 దాకా ఉంది. క్యారెట్, బీట్రూట్ ధర రూ.60, బంగాళదుంపలు రూ.50.. దొండకాయ, బెండకాయ, గోరు చిక్కుడుకాయ, వంకాయ రూ.40కి పైగా ఉన్నాయి.

# ఎలక్ట్రిక్ ట్రక్ మార్కెట్ ను పెంచే పిఎం E-డ్రైవ్: డిఐసివి సత్యకమ్ ఆర్య




**న్యూఢిల్లీ-నవభూమి:**ఈ కార్యక్రమం వాహనాల ఆధునికతను ప్రోత్సహించడమే కాకుండా ఎలక్ట్రిక్ వాహనాల యొక్క పరిచయం కోసం అనుకూలమైన వాతావరణాన్ని కూడా కల్పిస్తుందని సత్యకమ్ ఆర్య, డిఐసివి యొక్క ఎండి - సిఇఓ, చెప్పారు.

కార్బన్-తటస్థ సంచారానికి భారతదేశపు పరివర్తనలో ప్రభుత్వపు పిఎం E-డ్రైవ్ పథకం ప్రధానమైన చర్యగా డైమ్లర్ ఇండియా కమర్షియల్ వెహికిల్స్ (డిఐసివి) ప్రశంశించింది. డిఐసివి మేనేజింగ్ డైరెక్టర్ -సిఇఓ సత్యకమ్ ఆర్య ఎలక్ట్రిక్ వాహనాల ఉపయోగాన్ని పథకం పెంచే అవకాశం ఉందని తెలిపారు, కంపెనీ సుస్థిరతా లక్ష్యాలతో పరిపూర్ణంగా అనుసంధానం చేసారు.

పాత ట్రక్స్ ను నిర్మూలించడాన్ని పిఎం E-డ్రైవ్ పథకం ప్రోత్సహిస్తుంది, ఇది మెరుగైన భద్రతా ప్రామాణాలను ఉద్గారాలను తగ్గించడాన్ని ప్రోత్సహిస్తుంది. ఈ చొరవ వాహనాల ఆధునికీకరణను ప్రోత్సహించడమే కాకుండా ఎలక్ట్రిక్ వాహనాలను పరిచయం చేయడానికి అనుకూలమైన వాతావరణాన్ని కూడా కల్పిస్తుందని ఆర్య అన్నారు.

"పిఎం E-డ్రైవ్ పథకం భారతదేశంలో కార్బన్-తటస్థ సంచారానికి పరివర్తనను పెంచడంలో కీలకమైన చర్యను గుర్తిస్తుంది. పాత ట్రక్స్ ను తొలగించడానికి ప్రోత్సాహకాలను అనుసంధానం చేయడం ద్వారా, పథకం మెరుగైన భద్రతా ప్రమాణాలను ప్రోత్సహించడమే కాకుండా ఉద్గారాలను కూడా తగ్గిస్తుంది, వాహనాల ఆధునికీకరణను కూడా ప్రోత్సహిస్తుంది, డైమ్లర్ ఇండియా కమర్షియల్ వాహనాలలో మా లక్ష్యాలతో పరిపూర్ణంగా అనుసంధానం చేస్తుంది" అని ఆర్య ఒక ప్రెస్ కార్యక్రమంలో వ్యాఖ్యానించారు.

రూ.10,900 కోట్ల పిఎం E-డ్రైవ్ పథకం, ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని పెంచడం ఛార్జింగ్ మౌలికసదుపాయాలను విస్తరించే లక్ష్యంతో అక్టోబర్ 1 నుండి అమలవుతోంది. మార్చి 31, 2026 వరకు కొనసాగే ఈ పథకం, మార్చిలో ముగిసిన గత రూ. 11,500 కోట్ల ఫాస్టర్ అడాప్షన్ మాన్యుఫ్యాక్చరింగ్ ఆఫ్ (హైబ్రిడ్ ) ఎలక్ట్రిక్ వెహికిల్స్ కార్యక్రమాన్ని నిర్మూలించింది.

ఇంకా, ఎలక్ట్రిక్ ట్రక్స్ ను వినియోగించడాన్ని ప్రోత్సహించడంలో ఛార్జింగ్ మౌళికసదుపాయాల విస్తరణ పైన పథకం దృష్టి కేంద్రీకరించాలని, దీర్ఘకాలం సుస్థిరాభివృద్ధి కోసం కావలసిన మద్దతును కేటాయించాలని ఆర్య అన్నారు. "ఈ కార్యక్రమం వాణిజ్య వాహనాల రంగంలో గణనీయమైన అవకాశాలను అందిస్తుంది, పర్యావరణానుకూలమైన భవిష్యత్తు కోసం పరిశుభ్రమైన, సమర్థవంతమైన మరియు సాంకేతికపరంగా ఆధునిక రవాణా పరిష్కారాలను అభివృద్ధి చేస్తుందని" ఆయన వ్యాఖ్యానించారు.ప్రపంచంలో అతి పెద్ద ట్రక్ తయారీదారు యొక్క భారతదేశపు అనుబంధ సంస్థ, డైమ్లర్ ఇండియా కమర్షియల్ వెహికిల్స్ దేశంలో జీరో-ఉద్గారాల ట్రక్ మార్కెట్ లోకి ప్రవేశించినట్లు ప్రకటించిన నెల రోజుల తరువాత ఈ పురోగతి కలిగింది. కంపెనీ దేశంలో తమ లైట్-డ్యూటీ ఎలక్ట్రిక్ ట్రక్ eCante క్లీనికల్ ప్రయోగం ప్రారంభించింది, ఇది రాబోయే 6-12 నెలల్లో రోడ్ల పైకి రానుంది అని కంపెనీ ఏప్రిల్ లో గతంలో పేర్కొంది.దేశంలో ఈ-కామర్స్ కోసం పెరుగుతున్న అవసరాలకు సేవలు అందించడానికి భారతదేశపు మార్కెట్‌లో eCante మూడవ తరం కూర్పు చేయబడుతుంది. మోడల్ విడుదల కూడా భారత్ బెంజ్ యొక్క 3.5 నుండి 7.5 టన్నుల ట్రక్ కూడా మార్కెట్‌లో ప్రవేశించడాన్ని సూచిస్తుంది- ఇప్పటి వరకు కంపెనీకి ఇక్కడ ఉనికి లేదు.ఇప్పటి వరకు అంతర్జాతీయంగా, డైమ్లర్ ట్రక్స్ రోడ్డు పైన 8 మిలియన్ కిలోమీటర్స్ తో ప్రపంచవ్యాప్తంగా 2500 eCantersను విక్రయించాయి. మిట్సుబిషి ఫ్యూజో ప్లాట్ ఫాం ఆధారంగా, లైట్-డ్యూటీ ట్రక్ జపాన్ లో మరియు యూరప్ లో కూడా కూర్చబడింది మరియు భారతదేశం మూడవ ప్రధాన మార్కెట్ కాబోయే భారతదేశంలో ఈ మోడల్ ను స్థానికంగా కూర్చబడుతుంది.

# యానిమల్ ప్లానెట్‌ది ప్రధాన కార్యక్రమాలలో ప్రైడ్ రూల్స్, ది హంగ్రీ గేమ్స్: అలాస్కాస్ బిగ్ బేర్ ఛాలెంజ్, ప్రాజెక్ట్ టైగర్

**న్యూఢిల్లీ-నవభూమి:**వార్నర్ బ్రదర్స్ డిస్కవరీ యానిమల్ ప్లానెట్ తెలుగు ప్రసారాలను ప్రారంభించేందుకు సంతోషిస్తోంది. ప్రాంతీయ భాషలలో అధిక-నాణ్యతతో కూడిన కంటెంట్‌ని అందించేందుకు ఛానెల్ అంకితభావాన్ని ఇది మరింతగా పెంచుతోంది. ఈ కొత్త వ్యూహం ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణలోని ప్రేక్షకులను లక్ష్యంగా చేసుకుని, భారతీయుల నివాసాలకు ఆకర్షణీయమైన వన్యప్రాణులు మరియు ప్రకృతి కథలను తీసుకు వచ్చేందుకు యానిమల్ ప్లానెట్ లక్ష్యంలో ఒక ముఖ్యమైన మైలురాయిని సూచిస్తుంది. అన్ని డీటీహెచ్, కేబుల్ ప్లాట్‌ఫారాలలో అందుబాటులో ఉన్న తెలుగు ప్రసారాలు యానిమల్ ప్లానెట్ సిగ్నేచర్ ప్రోగ్రామింగ్‌ను కలిగి ఉంటుంది. ఇది వేటాడే ప్రాణులు, పెద్ద పిల్లులు (పులులు), దట్టమైన అరణ్యం, తదితరాలకు సంబంధించిన థ్రిల్లింగ్ కథనాలను ప్రదర్శిస్తుంది.తెలుగులో ప్రసారాలు ప్రారంభం కావడం, వీక్షకుల అనుభవాన్ని మెరుగుపరచేలా రూపొందించారు. కంటెంట్‌ని మరింత అందుబాటులోకి తీసుకురావడం ద్వారా ఈ ప్రాంతంలోని కుటుంబాలకు అనుకూలతను అందిస్తుంది. దీని ద్వారా, తెలుగు మాట్లాడే ప్రేక్షకులు ఇప్పుడు వందల గంటల పాటు తమకు నచ్చిన ఈ కార్యక్రమాలపై లీనమై ఆస్వాదించవచ్చు. వన్యప్రాణులు, ప్రకృతి విషయాలతో దక్షిణ భారతదేశం దృఢమైన అనుబంధంతో, ఈ ప్రాంతం యానిమల్ ప్లానెట్‌కు అభివృద్ధికి చక్కని అవకాశాలను అందించనుంది. అదే విధంగా ప్రాంతీయ మార్కెట్లలో తన ఉనికిని విస్తరించేందుకు, తెలుగు మాట్లాడే ప్రేక్షకులతో అనుసంధానమయ్యేందుకు ఛానెల్ నిబద్ధతను బలపరుస్తుంది.ఈ ప్రసారాలు ప్రారంభం కావడంపై దక్షిణాసియాలోని వార్నర్ బ్రదర్స్ డిస్కవరీలో ఫ్యాక్చువల్ మరియు లైఫ్‌స్టైల్ క్లస్టర్ హెడ్ సాయి అభిషేక్ తన ఉత్సాహాన్ని పంచుకుంటూ, "ఆంధ్రప్రదేశ్, తెలంగాణా ప్రాంతాలలోని వీక్షకులతో మా సంబంధాన్ని మరింత బలోపేతం చేసుకుంటూ, అసాధారణమైన మా ప్రయాణాన్ని కొనసాగించడం, మాకు సంతోషాన్ని కలిగిస్తోంది. వన్యప్రాణుల ప్రపంచం నుంచి భారతీయ నివాసాల్లోకి ఇప్పటి వరకు వినని కథలు అందిస్తాము. తెలుగు ప్రసారాలను ప్రారంభించడం ద్వారా గ్లోబల్ స్టోరీ టెల్లింగ్‌ను స్థానిక రుచులతో మిళితం చేయడం ద్వారా వీక్షకుల అనుభవాన్ని మరింత సుసంపన్నం చేయడానికి అనుమతిస్తుంది. ఈ ప్రాంతంలోని కుటుంబాలకు ప్రత్యేకమైన మరియు ఆకర్షణీయమైన అనుభవాన్ని అందిస్తుంది. స్థానికీకరణ అనేది మా వ్యూహానికి హృదయ భాగంలో ఉంది. మేము మా ప్రేక్షకులతో ప్రతిధ్వనించే కంటెంట్‌ని అందజేస్తామని నిర్ధారించుకునేందుకు మేము వారిని విన్నపాలను సమీపం నుంచి ఆలకిస్తున్నాము" అని తెలిపారు.యానిమల్ ప్లానెట్ విస్తృత వ్యూహానికి అనుగుణంగా, తెలుగు ప్రసారాలు స్థానికంగా డబ్ చేయబడిన కంటెంట్‌ను కలిగి ఉంటుంది. ఈ ప్రాంతానికి చెందిన వాయిస్ మరియు రైటింగ్ ఆర్టిస్టుల నెట్‌వర్క్ ద్వారా ప్రామాణికతను నిర్ధారిస్తుంది. వన్యప్రాణుల కంటెంట్‌కు బలమైన అనుబంధం కారణంగా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ వార్నర్ బ్రదర్స్ డిస్కవరీకి కీలకమైన మార్కెట్‌లను సూచిస్తుంది. ప్రముఖుల సహకారాలు కీలకమైన టెంట్‌పోల్ ప్రోగ్రామింగ్‌ను మరింత విస్తరింపజేస్తాయి. ప్రేక్షకులతో ఎంగేజ్‌మెంట్‌ను పెంచుతూ, వీక్షకులతో మా అనుబంధాన్ని బలోపేతం చేస్తాయి.

# 25 ఏళ్లు.. రూ.85 లక్షల కోట్లు



**న్యూఢిల్లీ-నవభూమి:**సరళీకృత ఆర్థిక విధానాలతో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ)కు భారత్ కేంద్రంగా మారుతోంది. 2000 సంవత్సరం సెప్టెంబరు నుంచి 2024 సెప్టెంబరు మధ్య కాలంలో మన దేశం 1,03,340 కోట్ల డాలర్ల (సుమారు రూ.84.5 లక్షల కోట్లు) ఎఫ్‌డీఐని ఆకర్షించింది. పారిశ్రామిక, అంతర్గత వాణిజ్య ప్రోత్సాహక శాఖ (డీపీఐఐటీ) ఆదివారం ఇందుకు సంబంధించిన గణాంకాలు విడుదల చేసింది. ఈక్విటీ పెట్టుబడులు, ఆ పెట్టుబడులపై వచ్చిన ఆదాయాన్ని తిరిగి పెట్టుబడిగా పెట్టడం, ఇతర మూలధన పెట్టుబడులన్నీ ఎఫ్‌డీఐ కోవలోకి వస్తాయి. ఈ పాతికేళ్లలో మన దేశానికి వచ్చిన మొత్తం ఎఫ్‌డీఐలో 25 శాతం ఒక్క మారిషస్ నుంచే రావడం విశేషం. సింగపూర్ (24 శాతం), అమెరికా (10 శాతం), నెదర్లాండ్ (7 శాతం), జపాన్ (6 శాతం), యూకే (5 శాతం), యూఏఈ (3 శాతం) వరుసగా తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.

కేమన్ ఐలాండ్స్, జర్మనీ, సైప్రస్ నుంచి 6 శాతం పెట్టుబడులు వచ్చినట్టు డీపీఐఐటీ తెలిపింది. ఈ కాలంలో మారిషస్ నుంచి 17,718 కోట్ల డాలర్లు, సింగపూర్ నుంచి 16,747 కోట్ల డాలర్లు, అమెరికా నుంచి 6,780 కోట్ల డాలర్ల విదేశీ పెట్టుబడులు వచ్చాయి.

**అన్ని రంగాల్లోకి..**

సేవల విభాగం, కంప్యూటర్ సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్, టెలికమ్యూనికేషన్స్, ట్రేడింగ్, కన్‌స్ట్రక్షన్ డెవలప్‌మెంట్, ఆటోమొబైల్, కెమికల్స్, ఫార్మాస్యూటికల్స్ రంగాల్లోకి పెద్దఎత్తున ఎఫ్‌డీఐ వచ్చినట్లు డీపీఐఐటీ తెలిపింది. కాగా 2004-14 కాలంతో పోల్చితే 2014-24 మధ్య కాలంలో దేశంలోకి వచ్చిన ఎఫ్‌డీఐ ఏకంగా 119 శాతం మేర పెరిగిందని పేర్కొంది.

ఎఫ్‌పీఐల

**పెట్టుబడులు షురూ**

గత రెండు నెలలుగా అమ్మకాలతో హోరెత్తించిన విదేశీ పోర్టుఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐ) మళ్లీ భారత స్టాక్ మార్కెట్లో పెట్టుబడులకు దిగారు. ఈ నెల తొలి వారంలోనే రూ.24,454 కోట్ల విలువైన షేర్లను కొనుగోలు చేశారు. అక్టోబరులో రూ.94,017 కోట్లు, నవంబరులో రూ.21,612 కోట్ల పెట్టుబడులను ఎఫ్‌పీఐలు వెనక్కి తీసుకున్నాయి. కుదుటపడుతున్న అంతర్జాతీయ పరిస్థితులు, అమెరికా కేంద్ర బ్యాంక్ ఫెడ్ రిజర్వ్ ఈ నెల మరోసారి వడ్డీ రేట్లు తగ్గించబోతోందన్న అంచనాలతో ఎఫ్‌పీఐలు మళ్లీ కొనుగోళ్లకు దిగాయని భావిస్తున్నారు. ట్రంప్ ఆర్థిక విధానాలు, మూడో త్రైమాసిక ఆర్థిక ఫలితాలు, జీడీపీ వృద్ధి రేటు ముందు ముందు మన దేశంలో ఎఫ్‌పీఐల పెట్టుబడులను నిర్ణయించనున్నాయి.

**ఈ వారం 11 ఐపీఓలు**

ఐపీఓ మార్కెట్లోనూ జోరు పెరుగుతోంది. రూ.18,500 కోట్ల సమీకరణ కోసం ఈ వారం 11 కంపెనీలు పబ్లిక్ ఇష్యూలకు వస్తున్నాయి. ఇందులో ఐదు విశాల్ మెగా మార్ట్, ఫిన్‌టెక్ కంపెనీ ఒన్ మొబిక్విక్ సిస్టమ్స్, ఇన్వెంచరస్ నాలెడ్జ్ సొల్యూషన్స్ లిమిటెడ్, ఇంటర్నేషనల్ జెమ్మాలాజికల్ ఇనిస్టిట్యూట్, హైదరాబాద్ కేంద్రంగా పని చేసే సాయి లైఫ్ సైన్సెస్ పెద్ద కంపెనీల ఐపీఓలు. మిగతా ఆరు ఐపీఓలు మాత్రం ఎస్ఎంఈ విభాగం నుంచి వస్తున్నాయి.

# యూజర్లకు షాక్ ఇచ్చిన వాట్సాప్..! 33 మొబైల్స్‌కు త్వరలో సర్వీసులు బంద్..!




**న్యూఢిల్లీ-నవభూమి:**వాట్సాప్ యూజర్లకు షాక్ ఇచ్చేందుకు సిద్ధమైంది. ఇప్పటికే పాత వర్షెన్ ఫోన్లకు వాట్సాప్ సేవలను నిలిపివేసిన విషయం తెలిసిందే. తాజాగా మరో 33 ఫోన్లకు సైతం సర్వీసులను నిలిపివేయనున్నట్లు ప్రకటించింది. ఈ మోడల్స్‌లో ఆండ్రాయిడ్, ఐఓఎస్ యూజర్లకు సేవలు నిలిచిపోతాయని పేర్కొంది. ఐఫోన్స్, హువావే, లెనెవో, ఎల్‌జీ, మోటరోలా, సామ్‌సంగ్, సోనీ కంపెనీలకు చెందిన మోడల్స్ ఉన్నాయి. మోటా యాజమాన్యంలోని మెసేజింగ్ యాప్ వాట్సాప్ ఐఓఎస్ 15.1 కంటే పాత వెర్షన్లకు సపోర్ట్‌ని నిలిపి వేయాలని నిర్ణయించింది. వచ్చే ఏడాది నుంచి మోడల్స్‌లో ఇక వాట్సాప్ పని చేయదని వాట్సాప్ ట్రాకర్ వాబీటాఇన్ఫో పేర్కొంది.వాట్సాప్ ఇకపై ఐఓఎస్ 15.1 కంటే పాత వెర్షన్‌లను మే 5న, 2025 నుంచి సపోర్ట్ ఇవ్వనున్నట్లు చెప్పింది. వాట్సాప్‌తో పాటు వాట్సాప్ బిజినెస్‌కి సైతం వర్తిస్తుందని తెలిపింది. ఐఓఎస్ వెర్షన్ యూజర్లు తప్పనిసరిగా కొత్త మొబైల్స్‌కి మారాలని సూచించింది. వాస్తవానికి, ఈ మోడల్స్‌లో సెక్యూరిటీ అప్‌డేట్స్ రావడం నిలిచిపోయింది. కంపెనీ ఆండ్రాయిడ్ 5.0 తర్వాత.. 12 తర్వాతి ఓఎస్‌లో వాట్సాప్ సపోర్ట్ ఇస్తున్నది. ప్రస్తుతం ఆయా మోడల్స్ ఫోన్లు వాడే వారంతా తప్పనిసరిగా వాట్సాప్‌ని ఉపయోగించడానికి స్మార్ట్‌ఫోన్‌ను అప్‌గ్రేడ్ చేయడం తప్పనిసరి. లేకపోతే వాట్సాప్ ఇకపై పని చేయదని స్పష్టం చేసింది. ఈ మేరకు వాట్సాప్ ఆయా మోడల్స్ జాబితాను విడుదల చేసింది.

ఇక వాట్సాప్ పని చేయని ఫోన్లు ఇవే..

iPhone 5
iPhone 6
iPhone 6S
iPhone 6 Plus
iPhone 7 Plus
Huawei Ascend G525
Huawei Ascend P6S
Huawei C199
Huawei P20 Pro
Huawei Y625
Lenovo-46600
Lenovo A820
Lenovo A858T
Lenovo-P70
Lenovo S890
LG Optimus 4X HD
LG Optimus G
LG Optimus G Pro
LG Optimus L7
Motorola Moto G
Motorola Moto X
Samsung Galaxy Ace 2018
Samsung Galaxy Note 10
Samsung Galaxy Note 2
Samsung Galaxy A32
Samsung Galaxy Note 3
Samsung Galaxy S3 Mini
Samsung Galaxy S4 Active
Samsung Galaxy S4 Mini
Samsung Galaxy S4
Sony Xperia E3
Sony Xperia M
Sony Xperia Z1

# ఐఫోన్ లవర్స్‌కు గుడ్‌న్యూస్.. త్వరలోనే ఆపిల్ నుంచి మడతబెట్టేఫోన్ వచ్చేస్తోంది..!



**న్యూఢిల్లీ-నవభూమి:**మార్కెట్‌లో ఆపిల్ ఉత్పత్తులకు మంచి డిమాండ్ ఉన్నది. ముఖ్యంగా ఐఫోన్లకు ఉన్న క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ప్రస్తుతం గ్లోబల్ మార్కెట్‌లో మొబైల్ కంపెనీలు ఫోల్డబుల్ ఫోన్లపై దృష్టి సారిస్తున్నాయి. ఇప్పటి వరకు శామ్‌సంగ్, వన్‌ప్లస్ తదితర కంపెనీలు ఫోల్డబుల్ మొబైల్స్‌ని పరిచయం చేశాయి. ఆపిల్ మాత్రం ఫోల్డబుల్‌పై దృష్టి మాత్రం సారించలేదు. ప్రస్తుతం కంపెనీ ఫోల్డబుల్ మోడల్‌పై దృష్టి సారించినట్లు సమాచారం. అయితే, కంపెనీ అధికారికంగా ప్రకటించకపోయినప్పటికీ.. ఆపిల్ తొలి ఫోల్డబుల్ ఐఫోన్‌ని 2026 నాటికి లాంచ్ చేయనున్నదని ఓ నివేదిక తెలిపింది. ఫోల్డబుల్ స్మార్ట్‌ఫోన్స్ గత కొద్దిరోజులుగా స్థిరమైన వృద్ధిని సాధించింది. ఈ రంగంలో శాంసంగ్, హువావే, మోటరోలా తదితర ప్రధాన కంపెనీలు ముందున్నాయి. శామ్‌సంగ్ జెడ్-సిరీస్‌తో మార్కెట్‌లో ముందంజలో ఉన్నది. ప్రతి కొత్త వెర్షన్‌తో డిజైన్‌తో పాటు క్వాలిటీని సైతం మెరుగుపరుస్తూ వస్తున్నది.

ఆపిల్ ఫోల్డబుల్ స్మార్ట్‌ఫోన్‌ను లాంచ్ చేస్తుందన్న వార్త వినియోగదారుల్లో ఉత్సాహాన్ని పెంచింది. ఆపిల్ ఫోల్డబుల్ ఐఫోన్ మార్కెట్లో కొత్త అవకాశాలను తెరిచి, యూజర్లకు సరికొత్త ఎక్స్‌పీరియన్స్‌ను అందించనుందని నివేదిక పేర్కొంది. ఇటీవల డీఎస్-సీసీ (డిస్‌ప్లే సప్లై చైన్ కన్సల్టెంట్స్) నివేదిక 2019 నుంచి 2023 వరకు ప్రతి సంవత్సరం 40 వృద్ధి చెందుతున్న తర్వాత.. 2024లో మార్కెట్ కేవలం 5శాతం పెరుగుతుందని అంచనా వేస్తూ ఫోల్డబుల్ స్మార్ట్‌ఫోన్ మార్కెట్ సవాళ్లను హైలైట్ చేసింది. 2024లో థర్డ్ క్వార్టర్‌లో ఫోల్డబుల్ స్మార్ట్‌ఫోన్ డిస్‌ప్లేల డిమాండ్ సంవత్సరానికి 38శాతానికి తగ్గింది. ఫ్లెక్సిబుల్ ఓఎల్ఈడీ డిస్‌ప్లే మిలియన్ల సార్లు ఫోల్డ్ చేసినా ఎలాంటి నష్టం లేకుండా పని చేస్తుంది. ఆపిల్ కొత్త డిజైన్.. ప్రస్తుత ఐఫోన్ ఫీచర్స్, కొత్త ఫోల్డింగ్ మెకానిజానికి జోడించడం ద్వారా ఓ ప్రత్యేకమైన ఎక్స్‌పీరియన్స్ అందించనున్నది. ఆపిల్ ఫోల్డబుల్ స్మార్ట్‌ఫోన్స్ అందుబాటులోకి వస్తే మార్కెట్‌పై భారీ ప్రభావం చూపే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఎందుకంటే ఇప్పటికే ఆపిల్ ఉత్పత్తులు మార్కెట్లకు భారీగా డిమాండ్ ఉన్న విషయం తెలిసిందే.



# అన్నదాతల 'ఢిల్లీ చలో' ఉద్రిక్తం



**న్యూఢిల్లీ-నవభూమి:** అన్నదాతల ఆందోళనలతో పంజాబ్, హరియాణా సరిహద్దు ప్రాంతం శంభు ఆదివారం అట్టుడికింది. కనీస మద్దతు ధర సహా 12 డిమాండ్ల సాధనకు పిలుపునిచ్చిన 'ఢిల్లీ చలో' ఉద్రిక్తంగా మారింది. రైతులు ఢిల్లీలోకి ప్రవేశించకుండా హరియాణా ప్రభుత్వం శంభూ సరిహద్దులో భారీగా పోలీసులు, పారా మిలిటరీ బలగాలను మోహరించింది. పోలీసులు పెద్దఎత్తున బారికేడ్లు ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం 12 గంటలకు రైతులు పాదయాత్ర మొదలు పెట్టేందుకు సిద్ధం కాగా అనుమతి ఉంటే చూపించాలని పోలీసులు కోరారు. రైతులు బారికేడ్లు దాటుకుని ముందుకు వెళ్లేందుకు ప్రయత్నించగా వారిని చెదరగొట్టే ప్రయత్నం చేశారు. ఈ దశలో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. పోలీసులు లాఠీచార్జ్ చేశారు. టియర్ గ్యాస్ ప్రయోగించారు. ఈ ఘటనలో కొందరు రైతులు గాయపడ్డారు. ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ఆదివారం 'ఢిల్లీ చలో' పాదయాత్రను నిలిపివేస్తున్నట్టు రైతు సంఘాల నేతలు ప్రకటించారు. పోలీసుల లాఠీచార్జ్, టియర్ గ్యాస్ ప్రయోగంతో ఎనిమిది మందికిపైగా రైతులు గాయపడ్డారు. "పోలీసులు 101 మంది రైతులకు అనుమతి ఇస్తామని చెప్పారు. కానీ అక్కడికి వచ్చిన తర్వాత అనుమతి లేదని లాఠీచార్జ్ చేశారు" అని రైతు నాయకుడు సర్వన్ సింగ్ పంధేర్ తెలిపారు.

## న్యూఢిల్లీలో ప్రయాణికులకు అందుబాటులోకి వచ్చిన మరో ఎయిర్ పోర్ట్



**న్యూఢిల్లీ-నవభూమి:** దేశ రాజధాని న్యూఢిల్లీలో మరో అంతర్జాతీయ విమానాశ్రయం త్వరలో ప్రయాణికులకు అందుబాటులోకి రానుంది. అందుకోసం సోమవారం నోయిడాలోని జేవర్ విమానాశ్రయంలో తొలిసారిగా విమానాల ట్రయిల్ రన్ నిర్వహించారు. ప్రస్తుతం న్యూఢిల్లీ నగరంలోని జీఎంఆర్ ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నిత్యం ప్రయాణికుల రద్దీతో కిటకిటలాడుతోంది. ఈ నేపథ్యంలో విమాన ప్రయాణికుల సౌలభ్యం కోసం.. ఢిల్లీ సమీపంలోని నోయిడా శివారులో జేవర్ వద్ద అధునాతన హంగులతో, అత్యాధునిక సదుపాయాలతో మరో అంతర్జాతీయ విమానాశ్రయాన్ని కేంద్రప్రభుత్వం సిద్ధం చేస్తోంది.

## పెద్దల సభకు ఏపీ, హర్యానా, ఒడిశా అభ్యర్థులను ప్రకటించిన బీజేపీ



**న్యూఢిల్లీ-నవభూమి:** షెడ్యూల్ ప్రకారం రాజ్యసభకు ఉప ఎన్నికలు డిసెంబర్ 20న నిర్వహిస్తారు. అదేరోజు ఫలితాలను ప్రకటిస్తారు. ఆంధ్రప్రదేశ్, ఒడిశా, పశ్చిమబెంగాల్, హర్యానా నుంచి ఆరుగురు సభ్యులను రాజ్యసభకు ఎంపిక చేయాల్సి ఉంది. ఆంధ్రప్రదేశ్ నుంచి 3 సీట్లు, ఒడిశా, పశ్చిమబెంగాల్, హర్యానా నుంచి ఒక్కో సీటు ఖాళీగా ఉన్నాయి.ఆంధ్రప్రదేశ్: ఆంధ్రప్రదేశ్ నుంచి ముగ్గురు ఎంపీలను రాజ్యసభకు పంపాల్సి ఉంది. జగన్ మోహన్ రెడ్డి వైఎస్ఆర్‌సీపీకి చెందిన ఎంపీలు వెంకటరమణ రావు మోపిదేవి, బీద మస్తాన్ రావు యాదవ్, రాగ్య కృష్ణయ్య రాజ్యసభకు రాజీనామా చేయడంతో ఆ మూడు స్థానాలకు ఎన్నిక అనివార్యమైంది. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు టీడీపీ ఈ మూడు సీట్లు గెలుచుకోవడం ఖాయమనే చెప్పాలి.ఒడిశా: నవీన్ పట్నాయక్ సారథ్యంలోని బిజు జనతా దళ్ (బీజేడీ) ఎంపీ సుజీత్ కుమార్ రాజ్యసభకు రాజీనామా చేశారు. బీజేపీ ఈ సీటును గెలుచుకునే అవకాశం ఉంది.పశ్చిమబెంగాల్: అధికార తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన జవహర్ సర్కార్ రాజ్యసభ పదవికి రాజీనామా చేశారు. ఉపఎన్నికల్లో ఈ సీటును టీఎంసీ సునాయాసంగా గెలుచుకోనుంది.హర్యానా: అధికార బీజేపీకి చెందిన కృష్ణలాల్ పన్వర్ రాజ్యసభ సీటుకు రాజీనామా చేశారు. ఈ సీటను బీజేపీ తిరిగి నిలబెట్టుకోనుంది. హర్యానాలో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు రాజ్యసభ సీటుకు పన్వర్ రాజీనామా చేసారు. ప్రస్తుతం ఆయన నయబ్ సింగ్ షైని మంత్రివర్గంలో అభివృద్ధి, పంచాయతీరాజ్, గనులు, భూగర్భ శాఖ మంత్రిగా ఉన్నారు.

## హమ్మయ్య.. ఎట్టకేలకు పని చేస్తున్న రైల్వే వెబ్‌సైట్..

**న్యూఢిల్లీ-నవభూమి:** మెయింటెనెన్స్ కారణంగా నిలిచిపోయిన



ఐఆర్‌సీటీసీ ఆన్‌సేవలు తిరిగి పునరుద్ధరించారు. ఈ విషయాన్ని రైల్వే అధికారులు ప్రకటించారు. ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ (ఐఆర్‌సీటీసీ) వెబ్‌సైట్ సోమవారం ఉదయం కొన్ని గంటపాటు పనిచేయలేదు. దీంతో ఆన్‌లైన్‌లో టిక్కెట్లు బుక్ చేసుకోవడాని ప్రయత్నించిన వినియోగదారులు అవస్థలు పడ్డారు. మెయింటెనెన్స్ యాక్టివిటీ కారణంగా ఇ-టికెటింగ్ సేవ చాలా సమయం పని చేయలేదు. దీంతో సోషల్ మీడియా వేదికగా తాము ఎదుర్కొంటున్న సమస్యను రైజ్ చేశారు కస్టమర్లు.వెబ్‌సైట్‌కి లాగిన్ అయిన తర్వాత వినియోగదారులు.. 'మెయింటెనెన్స్ యాక్టివిటీ కారణంగా, తదుపరి ఒక గంట వరకు ఇ-టికెటింగ్ సేవ అందుబాటులో ఉండదు. దయచేసి తర్వాత ప్రయత్నించండి. రద్దు/ఫైల్ కోసం, దయచేసి కస్టమర్ కేర్ నంబర్‌కు కాల్ చేయండి. 14646, 0755-6610661 0755-4090600 లేదా etickets@irctc.co.inకి మెయిల్ చేయండి.' అంటూ మెసేజ్ డిస్ప్లే అయ్యింది. దీంతో వినియోగదారులు చాలా ఇబ్బంది పడ్డారు. సర్వర్ డౌన్ కారణంగా ఆన్‌లైన్ బుకింగ్, రద్దు, తత్కాల్ టికెట్ బుకింగ్ సేవలు నిలిచిపోయాయి. ఈ ఘటనతో చాలా మంది వినియోగదారులు సోషల్ మీడియాలో తమ అసంతృప్తిని, నిరాశను వ్యక్తం చేశారు.

### సరిహద్దుల్లో త్వరలో సమగ్ర డ్రోన్ విధ్వంసక వ్యవస్థ

**న్యూఢిల్లీ-నవభూమి:** సరిహద్దుల్లో భద్రతను పటిష్ఠం చేసేందుకు త్వరలో సమగ్ర డ్రోన్ విధ్వంసక విభాగాన్ని ఏర్పాటు చేయనున్నట్లు కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రకటించారు. ఆదివారం రాజస్థాన్‌లో జోధ్‌పూర్‌లోని బీఎస్ఎఫ్ ట్రైనింగ్ క్యాంప్‌లో నిర్వహించిన బీఎస్ఎఫ్ 60వ రైజింగ్ డే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లేజర్ యాంటీ డ్రోన్ గన్ మౌంటెడ్ మెకానిజం మంచి ఫలితాలు ఇచ్చిందని, దీని వల్ల పంజాబ్‌లో పాకిస్థాన్‌తో సరిహద్దు ప్రాంతంలో శత్రు డ్రోన్ల గుర్తింపు, కూల్చివేతలు 3 శాతం నుంచి 55 శాతానికి పెరిగాయని అన్నారు.

రాబోయే రోజుల్లో శత్రువుల నుంచి డ్రోన్ల ముప్పు మరింత

# మీ స్మార్ట్‌ఫోన్‌లో ఫేక్ యాప్‌లను ఇలా గుర్తించి, తొలగించుకోండి..



**న్యూఢిల్లీ-నవభూమి:** ప్రస్తుతం దేశంలో సైబర్ క్రైమ్ ఘటనలు క్రమంగా పెరుగుతున్నాయి. కష్టపడి సంపాదించిన సొమ్మును సైబర్ నేరగాళ్లు లూటీ చేస్తున్నారు. ఇలాంటి వార్తలు ప్రతిరోజూ వందల సంఖ్యలో వస్తున్నాయి. ఈ క్రమంలో నిరక్షరాస్యులు మాత్రమే కాదు, చదువుకున్న వారు సైతం తమ సంపాదనను కోల్పోతున్నారు. ఈ క్రమంలో స్మార్ట్‌ఫోన్ వినియోగించే విషయంలో అప్రమత్తంగా ఉండాలని సైబర్ నిపుణులు సూచిస్తున్నారు. ఈ నేపథ్యంలో మీ ఫోన్‌లో ఉన్న హానికరమైన యాప్‌లను ఎలా తొలగించుకోవాలనే విషయాలను సైబర్ నిపుణులు సూచించారు.

**వ్యక్తిగత ఫోటోలు**

సైబర్ కేటుగాళ్లు బాధితులను స్కామ్ చేయడానికి పలు రకాల యాప్స్ ఉపయోగిస్తున్నారు. దీంతో వారు మీ వ్యక్తిగత ఫోటోలు లేదా వీడియోలకు యాక్సెస్ కలిగి ఉంటే వారి ద్వారా బ్లాక్ మెయిల్‌కు గురయ్యే ఛాన్స్ ఉంది. దీంతో ఈ ప్రమాదకరమైన యాప్‌ల గురించి అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు ముమ్మరం చేసింది. ఇటీవల టెలికమ్యూనికేషన్స్ డిపార్ట్‌మెంట్ మీ స్మార్ట్‌ఫోన్‌లో హానికరమైన యాప్‌ల కోసం ఎలా తనిఖీ చేయాలనే దానిపై ముఖ్యమైన వీడియోను షేర్ చేసింది.

ఈ ప్రమాదకర యాప్‌లను ఎలా స్కాన్ చేయాలనేది ఇక్కడ తెలుసుకుందాం

1. మీ ఫోన్‌లో Google Play స్టోర్‌ని ఓపెన్ చేయండి
2. ఎగువన కుడి మూలలో ఉన్న మీ ప్రొఫైల్ చిహ్నంపై క్లిక్ చేయండి
3. కనిపించే మెను నుండి "ప్లే ప్రొటెక్ట్" ఆప్షన్ ఎంచుకోండి
4. తదుపరి స్క్రీన్‌లో "స్కాన్"పై క్లిక్ చేయండి
5. అప్పుడు స్కానర్ మీ ఫోన్‌ని తనిఖీ చేస్తుంది.
6. ఆ తర్వాత ఏదైనా హానికరమైన యాప్‌లు కనుగొనబడితే అప్పుడు మీకు స్కానర్ తెలియజేస్తుంది

**సురక్షితంగా ఉంచుకోవచ్చు**

ఈ దశలను అనుసరించడం ద్వారా మీరు స్కామ్ యాపుల నుంచి మిమ్మల్ని మీరు రక్షించుకుంటారు. దీంతోపాటు మీ వ్యక్తిగత సమాచారాన్ని కూడా సురక్షితంగా ఉంచుకోవచ్చు. ఈ అంశంపై ప్రస్తుతం డిపార్ట్‌మెంట్ చురుగ్గా పనిచేస్తోంది. వివిధ గ్రూపులతో సంప్రదింపులు కూడా జరిపామని అధికారులు పేర్కొన్నారు. టెలికమ్యూనికేషన్స్ రెగ్యులేటర్‌కు అవసరమైన మార్పులు చేసే అధికారాన్ని కూడా పరిశీలిస్తున్నారు.

**రూ. 10 కోట్లు**

నవంబర్ 2024లో ఢిల్లీలో రిటైర్డ్ ఇంజనీర్ సైబర్ మోసానికి గురై రూ. 10 కోట్లు పోగొట్టుకున్నాడు. ఇంజనీర్ అయినప్పటికీ సైబర్ నేరగాళ్లు ఆ వ్యక్తిని ఎనిమిది గంటలపాటు డిజిటల్‌గా అరెస్టు చేయగలిగారు. ఈ మోసంలో ఆయన జీవిత పొదుపును మొత్తం లాగేశారు. ఆయన కుటుంబం బాగా చదువుకుంది. విదేశాలలో ఉంది. అయినప్పటికీ కూడా ఈ సైబర్ నేరం నుంచి తప్పించుకోలేకపోయాడు.

## సిసోడియా సీటు మార్పు, 13 సిట్టింగ్‌లకు దక్కని చోటు



**న్యూఢిల్లీ-నవభూమి:** ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు ముందుగానే కసరత్తు ప్రారంభించిన ఆమ్ ఆద్మీ పార్టీ 20 మంది అభ్యర్థులతో కూడిన రెండో జాబితాను సోమవారంనాడు విడుదల చేసింది. మాజీ ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియా సీటును ఈసారి మార్పు చేసింది. ప్రతాప్‌గంజ్ ఎమ్మెల్యేగా ఉన్న సోసిడియా ఈసారి జంగ్‌పుర నియోజకవర్గం నుంచి పోటీ చేయనున్నారు. ప్రతాప్‌గంజ్ నియోజకవర్గాన్ని ఇటీవలే పార్టీలో చేరిన విద్యావేత్త, పాపులర్ యూట్యూబర్ అవధ్ ఓఝాకు కేటాయించారు. పార్టీ అభ్యర్థుల రెండో జాబితాలో జితేందర్ సింగ్ షంటి (షాదరా నుంచి), సురిందర్ పాల్ సింగ్ బిట్టు (తిమర్‌పూర్) పేర్లు చోటుచేసుకున్నాయి. బిట్టు ఇటీవలే బీజేపీ నుంచి ఆప్‌లో చేరారు.

ఎస్‌కే బగ్గా కుమారుడు వికాస్ బగ్గాకు కృష్ణానగర్ నుంచి టిక్కెట్ లభించగా, ప్రహ్లాద్ సింగ్ సాహ్నీ కుమారుడు పునర్‌దీప్ సింగ్ సాహ్నీ నుంచి చౌంద్నీ చౌక్ టిక్కెట్ ఇచ్చారు. పటేల్ నగర్ నుంచి పర్వేష్ రతన్‌ను ఆప్ బరిలోకి దింపిది. పటేల్ నగర్ సిట్టింగ్ ఎమ్మెల్యే, ఢిల్లీ మాజీ మంత్రి రాజ్ కుమార్ ఆనంద్ ఇటీవల ఆప్‌ను వీడి బీజేపీలో చేరారు. గాంధీనగర్ నుంచి నవీన్ చౌదరి, రోహిణి నుంచి ప్రదీప్ మిట్టల్ పోటీలో ఉన్నారు. గత ఎన్నికల్లో ఓటమి చవిచూసిన దీపు చౌదరికి గాంధీనగర్ టిక్కెట్ లభించింది. రాఖి బిద్లాన్‌కు మదిపూర్, ప్రవీణ్ కుమార్‌కు జానక్‌పురి టిక్కెట్ లభించింది. 13 మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలకు రెండో జాబితాలో చోటు దక్కలేదు. వారిలో శరద్ చౌహాన్, దిలీప్ పాండే, పవన్ శర్మ, ధర్మపాల్ లక్ర, ప్రహ్లాద్ సింగ్ సాహ్నీ, గిరీష్ సోని, రాజేష్ రిషి, భూపిందర్ సింగ్ జూన్, భావనా గౌర్, ప్రకాష్ జార్వాల్, రోహిత్ కుమార్ మెహ్రౌలియా, ఎస్‌కే బగ్గా, హాజి యూనస్ ఉన్నారు. ఆమ్ ఆద్మీ పార్టీ 11 మంది అభ్యర్థులతో ఇటీవల తొలి జాబితాను విడుదల చేసింది. 70 మంది సభ్యులున్న ఢిల్లీ అసెంబ్లీకి 2025 ఫిబ్రవరికి ముందే ఎన్నికలు జరగాల్సి ఉన్నాయి.

కేజ్రీవాల్‌కు సిసోడియా కృతజ్ఞతలు

కాగా, తనపై నమ్మకం ఉంచి జంగ్‌పుర నియోజకవర్గం నుంచి పోటీచేసే బాధ్యత అప్పగించిన పార్టీ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌కు సిసోడియా కృతజ్ఞతలు తెలిపారు. తనను తాను ఒక రాజకీయవేత్తగా కాకుండా ఒక టీచర్‌గానే భావిస్తుంటానని, ప్రతాప్ గంజ్ తనకు కేవలం అసెంబ్లీ నియోజకవర్గమే కాదని, ఢిల్లీలో విద్యా విప్లవానికి గుండెకాయ వంటిదని చెప్పారు.

అవధ్ జోఝా పార్టీలోకి రావడం, ఎన్నికల్లో పోటీ చేయాలనే డిమాండ్ రావడంతో ఒక టీచర్‌కు ప్రతాప్‌గంజ్‌కు మించిన మంచి నియోజకవర్గం ఉండదని తాను భావించినట్టు ఆయన చెప్పారు.

## పాఠశాలలకు మళ్లీ బాంబు బెదిరింపులు.. కలకలం



**న్యూఢిల్లీ-నవభూమి:** దేశ రాజధాని న్యూఢిల్లీలో మళ్లీ పాఠశాలలకు బాంబు బెదిరింపులు వచ్చాయి. దాదాపు 40కిపైగా పాఠశాలలకు ఈ తరహా బెదిరింపులు అందడంతో.. ఒక్కసారిగా కలకలం రేగింది. దీంతో పాఠశాలలకు వచ్చిన విద్యార్థులను మళ్లీ ఇళ్లకు పంపివేశారు. అనంతరం ఆయా పాఠశాలల్లో పోలీసులు, భద్రతా సిబ్బంది ముమ్మర తనిఖీలు చేపట్టారు. ఇవి నకిలీ బెదింపుగా గుర్తించామని ఢిల్లీ పోలీస్ పీఆర్వో సంజయ్ త్యాగి వెల్లడించారు. అయితే దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామన్నారు. అందులోభాగంగా బాంబు బెదిరింపులు అందిన ఈ మెయిల్ ఐపీ అడ్రస్ ఎక్కడ నుంచి వచ్చిందనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఈ బెదిరింపులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

నగరంలోని అన్ని స్కూళ్లు, విద్యార్థులకు భద్రత కల్పిస్తామని ఈ సందర్భంగా సంజయ్ త్యాగి భరోసా ఇచ్చారు. డీపీఎస్ ఆర్కే పురం, జీడీ గోయెంకాతోపాటు దాదాపు 44 స్కూళ్లకు ఈ మెయిల్ ద్వారా బాంబు బెదిరింపులు అందాయని వివరించారు. ఈ నేపథ్యంలో స్కూల్ యాజమాన్యం.. విద్యార్థులను ఇంటికి పంపి.. అనంతరం దీనిపై పోలీసులకు సమాచారం అందించాయని తెలిపారు. ఆదివారం రాత్రి 11.38 గంటలకు పాఠశాల భవనాల్లో పలు బాంబులు అమర్చినట్లు ఈ మెయిల్ ద్వారా పాఠశాలల యాజమాన్యాలకు బెదిరింపులు వచ్చాయన్నారు. ఈ బాంబులు పేలకుండా ఉండాలంటే.. రూ. 30 వేల యూఎస్ డాలర్లు తమకు అందజేయాలని ఈ మెయిల్ పంపిన వ్యక్తులు డిమాండ్ చేశారని వివరించారు.

# ఆప్ అభ్యర్థుల రెండో జాబితా విడుదల



**న్యూఢిల్లీ-నవభూమి:** ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు మరికొద్ది రోజుల్లో నగారా మోగనుంది. అలాంటి వేళ అధికార ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్).. తన అభ్యర్థుల జాబితాలను వరుసగా విడుదల చేస్తోంది. అందులోభాగంగా సోమవారం మరో జాబితాను విడుదల చేసింది. 20 మంది అభ్యర్థుల పేరులతో రెండో జాబితాను ఆప్ విడుదల చేసింది. పట్పర్ గంజ్ ఎమ్మెల్యే, మాజీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియా ఈ సారి తన అసెంబ్లీ నియోజకవర్గాన్ని మార్చుకోనున్నారు. రానున్న ఎన్నికల్లో జంగ్ పురా అసెంబ్లీ స్థానం నుంచి మనీశ్ సిసోడియా ఆప్ ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో నిలువనున్నారు. ఇక పట్పర్ గంజ్ అసెంబ్లీ స్థానం నుంచి ఆప్ అభ్యర్థిగా అవధ్ ఓఝా పోటీ చేయనున్నారు. ఈ మేరకు రెండో జాబితాలో స్పష్టం చేసింది. నవంబర్ మాసంలో 11 మంది అభ్యర్థుల జాబితాను ఆప్ తొలి జాబితాను విడుదల చేసిన విషయం విధితమే. అయితే ఢిల్లీ అసెంబ్లీలో మొత్తం 70 స్థానాలున్నాయి. వాటిలో ఆప్ నేటి వరకు 39 మంది అభ్యర్థుల పేర్లను ప్రకటించినట్లు అయింది.2013 ఎన్నికల్లో జంగ్ పురా అసెంబ్లీ స్థానం నుంచి ఢిల్లీ అసెంబ్లీ మాజీ స్పీకర్ మణిందర్ సింగ్ ధీర్ విజయం సాధించారు. అనంతరం ఆయన బీజేపీలో చేరారు. దీంతో 2015, 2020లో ఆప్ అభ్యర్థిగా ప్రవీణ్ కుమార్ ను బరిలో దింపింది. అయితే రానున్న ఎన్నికల్లో ఈ అసెంబ్లీ స్థానం నుంచి మనీశ్ సిసోడియాను బరిలో నిలపాలని ఆప్ నిర్ణయించింది. మరోవైపు ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో మనీ ల్యాండరింగ్ వ్యవహారంలో డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియాను ఈడీ అరెస్ట్ చేసింది.దీంతో ఆయన తన పదవికి రాజీనామా చేశారు. అనంతరం తీహాడ్ జైల్లో ఉన్నారు. ఆయనకు ఇటీవల బెయిల్ మంజూరు చేసింది. ప్రజా తీర్పు అనంతరం మళ్లీ ప్రభుత్వంలో చేరతానంటూ మనీశ్ సిసోడియా స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. ఆ కొద్ది రోజులకే.. ఇదే వ్యవహారంలో ఆప్ జాతీయ కన్వీనర్, సీఎం అరవింద్ కేజ్రీవాల్ ను సైతం ఈడీ అరెస్ట్ చేసింది. ఆయన సైతం బెయిల్ పై బయటకు వచ్చారు. అయితే ప్రజా తీర్పు తర్వాతే.. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపడతానంటూ సీఎం కేజ్రీవాల్..తన ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశారు. దీంతో ఆప్ ఎమ్మెల్యే అతిషిని ఢిల్లీ సీఎంగా ఎంపిక చేసి.. బాధ్యతలు కట్టబెట్టారు. ఇక డిసెంబర్ మొదట్లో అవధ్ ఓఝా ఆప్ లో జాయిన్ అయ్యిన సంగతి తెలిసిందే.ఢిల్లీలో అధికారాన్ని మళ్లీ చేపట్టాలని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. ఇంకోవైపు ఈ సారి ఎలాగైన ఢిల్లీలో పాగా వేయాలని బీజేపీ సైతం అదే చాణక్యంతో వ్యవహరిస్తోంది. దీంతో దేశ రాజధాని ఢిల్లీలో అధికార పగ్గాలు చేపట్టాలని ఈ రెండు పార్టీల మధ్య ప్రధానంగా పోరు నడవనుంది. అయితే ఈ రెండు పార్టీల్లో ఏ పార్టీ వైపు హస్తిన ఓటరు మొగ్గు చూపుతాడంటే.. మాత్రం చెప్పడం కష్టమన్నది సుస్పష్టం.

## కేంద్ర మంత్రుల ర్యాంప్ వాక్



**న్యూఢిల్లీ-నవభూమి:** కేంద్రమంత్రులు జ్యోతిరాదిత్య సింధియా, సుకాంత మజుందార్ ర్యాంప్ వాక్ చేశారు. శనివారం ఢిల్లీలోని భారతమండపంలో జరిగిన 'అష్టలక్ష్మి మహోత్సవ్' ఫ్యాషన్ షో ఇందుకు వేదికైంది. ఇద్దరు కేంద్రమంత్రులు ఈశాన్య రాష్ట్రాల సంస్కృతిని ప్రతిబింబించేలా కోట్లను ధరించి ఈ షోలో పాల్గొన్నారు. ఈశాన్య భారత సాంస్కృతిక వారసత్వ ప్రదర్శన కోసం ఈ ఫ్యాషన్ షోను ప్రధాని మోదీ ఈ నెల 6న ప్రారంభించారు. 8ఈశాన్య రాష్ట్రాల(అసోం, అరుణాచల్‌ప్రదేశ్, మిజోరం, నాగాలాండ్, త్రిపుర, మణిపూర్, మేఘాలయా, సిక్కిం) సంఖ్య వచ్చేలా ఈ ఫ్యాషన్ షోకు అష్టలక్ష్మి అని పేరు పెట్టారు.

# బంగ్లాదేశ్ చేరుకున్న విదేశాంగ కార్యదర్శి



**ఢాకా-నవభూమి:** బంగ్లాదేశ్?లో హిందువులపై దాడులు రోజు రోజుకు పెరుగుతోన్నాయి. దీనిపై సర్వత్ర ఆందోళనలు వ్యక్తమవుతోన్నాయి. దీంతో పొరుగునున్న భారత్ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ తరహా చర్యలను నియంత్రించేందుకు బంగ్లాదేశ్‌తో చర్చించాలని భారత్ నిర్ణయించింది. అందులోభాగంగా భారత విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ సోమవారం ఉదయం బంగ్లాదేశ్ రాజధాని ఢాకా చేరుకున్నారు. ఢాకా అంతర్జాతీయ విమానాశ్రయంలో విక్రమ్ మిస్రీకి ఆ దేశ అత్యున్నత అధికార యాంత్రాంగం ఘనంగా స్వాగతం పలికింది. ఇరు దేశాల విదేశాంగ కార్యదర్శుల నేతృత్వంలోని ప్రతినిధి బృందం ఈ దేశాల మధ్య ఏర్పాటు చేసిన ఫారిన్ ఆఫీస్ కన్సల్టేషన్ (ఎఫ్ఓసీ)లో పాల్గొనుంది. ఈ సందర్భంగా భారత్, బంగ్లాదేశ్ ల మధ్య ద్వైపాక్షిక సంబంధాలపై చర్చించనున్నారని తెలుస్తుంది. ఆ క్రమంలో పలు అంశాలపై ఈ సందర్భంగా చర్చించనున్నట్లు సమాచారం.

మరోవైపు బంగ్లాదేశ్‌లో మైనారిటీలపై హింస పెరిగిపోయిందంటూ వార్తా కథనాలు వెల్లువెత్తుతోన్నాయి. డిసెంబర్ 6వ తేదీన రాజధాని ఢాకా నగర శివార్లలో హిందూ దేవాలయానికి దుండగులు నిప్పు పెట్టారు. అలాగే ఢాకా నగర ఉత్తర ప్రాంతంలోని ధోర్ గ్రామంలోని మహా భాగ్యలక్ష్మీ నారాయణ మందిరంపై సైతం దాడి జరిగింది. ఈ వరుస దాడి ఘటనలపై పోలీసులకు ఫిర్యాదులు అందుతోన్నాయి.

ఇంకోవైపు నవంబర్ 25వ తేదీన చిట్టగాంగ్‌లో ఆధ్యాత్మిక గురువు చిన్మోయ్ కృష్ణ దాస్ ను దేశ ద్రోహ ఆరోపణలపై ఢాకాలో పోలీసులు అరెస్టు చేశారు. అక్టోబర్ 31న హిందు సమాజం నిర్వహించిన ర్యాలీలో బంగ్లాదేశ్ జాతీయ జెండాను చిన్మోయ్ దాస్ తో పాటు ఇతరులు అగౌరవపరిచారంటూ స్థానిక రాజకీయ నాయకుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో చిన్మోయ్ కృష్ణదాస్ ను పోలీసులు అరెస్ట్ చేశారు.ఈ ఏడాది సెప్టెంబర్‌లో.. బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వ విదేశాంగ సలహాదారు (మంత్రి) ఎండీ తౌహిద్ హుస్సేన్ న్యూయార్క్‌లో ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీలో జరిగిన సమావేశానికి హాజరయ్యారు. ఇదే సమావేశానికి భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ సైతం హాజరయ్యారు. ఈ సందర్భంగా వీరిద్దరు సమావేశమయ్యారు. భారత్, బంగ్లాదేశ్ ల మధ్య ఎఫ్ఓసీ నిర్వహించాలని నిర్ణయించారు. ఆ క్రమంలో విదేశీ వ్యవహారాల శాఖ కార్యదర్శి సోమవారం ఢాకా చేరుకున్నారు. బంగ్లాదేశ్‌లో మహమ్మద్ యూనస్ నేతృత్వంలోని మధ్యంతర ప్రభుత్వం బాధ్యతలు చేపట్టిన తర్వాత ఇది మొదటి ఉన్నత స్థాయి అధికారిక పర్యటన కావడం గమనార్హం.బంగ్లాదేశ్ లో షేక్ హసీనా ప్రభుత్వంపై ప్రజాగ్రహం వెల్లువెత్తింది. దీంతో ఆమె తన ప్రధాని పదవికి రాజీనామా చేయక తప్పని పరిస్థితి నెలకొంది. పదవికి రాజీనామా చేసిన అనంతరం ఆమె భారత్ లో తలదాచుకున్నారు. ఇక బంగ్లాదేశ్ లో మహ్మద్ యూనస్ నేతృత్వంలో మధ్యంతర ప్రభుత్వం కొలువు తీరింది. అనంతరం ఆ దేశంలో హిందువులు, దేవాలయాలపై దాడులు పెరుగుతోన్నాయి. దీంతో ప్రపంచవ్యాప్తంగా ఉన్న హిందూ సమాజం దీనిపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తోంది.

## శబరిమలలో పంపా నుంచి సన్నిధి వరకు సీసీ కెమెరాలు




**న్యూఢిల్లీ-నవభూమి:** శబరిమల, డిసెంబరు 8: శబరిమలలో మొట్టమొదటి సారిగా.. పంపా బేస్ క్యాంప్ నుంచి సన్నిధానం వరకు ప్రతి అంగుళం కవర్ అయ్యేలా సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. పంపా నుంచి శరణ్‌గుత్తి వరకు రెండువైపులా మార్గాలతోపాటు.. నడపందల్, పదునెట్టాంబడి, సన్నిధానం, భస్మకులం ప్రాంతాల్లో మొత్తం 258 హెచ్‌డీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. వీటిని రేయింబవళ్లు పర్యవేక్షించేలా ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు.



# పుష్ప 2 సక్సెస్.. అల్లు అర్జున్‌ను చిరంజీవి విష్ చేశాడా..?

అల్లు అర్జున్ -సుకుమార్ కాంపౌండ్ నుంచి వచ్చిన మోస్ట్ ఎవెయిటెడ్ ఫ్రాంఛైజీ ప్రాజెక్ట్ పుష్ప 2 ది రూల్ . డిసెంబర్ 5న తెలుగు, తమిళం, మలయాళం, హిందీ, కన్నడ భాషల్లో గ్రాండ్‌గా విడుదలైన ఈ చిత్రం.. అన్ని స్క్రీన్లలో సూపర్ హిట్ టాక్‌తో స్క్రీనింగ్ అవుతూ టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా నిలుస్తోంది. ఈ నేపథ్యంలో మెగాస్టార్ చిరంజీవి అల్లు అర్జున్‌కు శుభాకాంక్షలు తెలియజేశాడంటూ ఓ ఫోటో నెట్టింట వైరల్ అవుతోంది. బన్నీకి చిరంజీవి, సురేఖ దంపతులు స్వీట్ తినిపించి సక్సెస్‌ను సెలబ్రేట్ చేశారు. అయితే నెటిజన్లు షేర్ చేస్తున్న ఈ ఫొటో తాజాది కాదు. అల్లు అర్జున్ పుష్ప ది రైజ్ సినిమాకుగాను ఉత్తమ నటుడిగా నేషనల్ అవార్డు అందుకున్న తర్వాత చిరంజీవి ఆశీర్వాదాలు తీసుకున్న సందర్భంలో తీసినది. కొందరు నెటిజన్లు పాత ఫొటోలు షేరింగ్ చేస్తూ తప్పుడు సమాచారాన్ని నెట్టింట పోస్ట్ చేస్తున్నారు. అసలు విషయమేంటంటే చిరంజీవి, అల్లు అర్జున్ ఈ మధ్యకాలంలో కలవలేదని ఫిలింనగర్ సర్కిల్ టాక్. ఇక ఫొటో పాతదా.. కొత్తదా అని సంబంధం లేకుండా ఎప్పటిదైతే ఏంటీ..? అన్నట్టుగా కొందరు మూవీ లవర్స్ మాత్రం ఈ స్టిల్‌ను చూసి ఎంజాయ్ చేస్తున్నారు.

నవచిత్ర





# చీరలో సంయుక్త గ్లామర్ ఘాటు

సంయుక్తా తన తాజా గ్లామర్ లుక్‌తో సోషల్ మీడియా ప్రపంచాన్ని మరోసారి ఉపేస్తోంది. ఈ ఫోటోల్లో ఆమె ధరించిన పసుపు, పింక్ కలర్ కాంబినేషన్ చీర ఆమె అందాన్ని మరింత హైలెట్ చేస్తూ కనిపిస్తోంది. చెవిపోగులు, మెడలో పూసలహారం, అలాగే కంచు బ్రాస్‌లెట్ లాంటి ఆభరణాలతో ఆమె లుక్ మరింత ఆకర్షణీయంగా మారింది. సంయుక్తా తన ఈ లుక్ కోసం చాలా శ్రద్ధ తీసుకున్నట్లు కనిపిస్తోంది, ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. సంయుక్త ఎలా కనిపించినా అందంగానే ఉంటుందని మరోసారి నిరూపించింది. ఫ్యాషన్ డ్రెస్సులలోనే కాకుండా చీరలో కూడా తన వయ్యారంతో మైమరిపిస్తోంది. ఇక సంయుక్తా కెరీర్ విషయానికి వస్తే, ఆమె తన ఫిల్మ్ ఇండస్ట్రీ ప్రయాణాన్ని మలయాళ చిత్రాల ద్వారా ప్రారంభించి, తెలుగు, తమిళ భాషల్లో కూడా మంచి గుర్తింపు తెచ్చుకుంది. తెలుగులో ఈమధ్య ఆమె చేసిన సినిమాలు బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని అందుకున్నాయి. ఆమె ప్రస్తుతం స్వయంభు అనే సినిమాలో నటిస్తోంది, నిఖిల్ సిద్ధార్థ్ హీరోగా వస్తున్న ఈ చిత్రం పై భారీ అంచనాలు ఉన్నాయి. ఈ పీరియాడిక్ ఫిల్మ్ ద్వారా సంయుక్తా తన నటనతో అభిమానులను ఆకట్టుకోబోతుందని పోస్టర్స్ చూస్తే అర్థమవుతోంది. ఇక సంయుక్తా తన ఫోటోషూట్ల ద్వారా అభిమానులతో ఎప్పటికప్పుడు టచ్‌లో ఉంటోంది. ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ఆమె షేర్ చేసిన ఈ ఫోటోలు ఆమెను మరింత దగ్గరగా కలిపేలా చేస్తున్నాయి. ఒకవైపు ఆమె ట్రెండిషనల్ లుక్స్‌తో అభిమానులను ఆకర్షిస్తుంటే, మరోవైపు గ్లామర్ లుక్స్ లో కూడా ఆమె తన ప్రత్యేకతను చూపిస్తుంది. ఇక రాబోయే ప్రాజెక్టల విషయానికి వస్తే, సంయుక్తా ప్రముఖ హీరోలతో కలిసి పలు సినిమాలు చేస్తోంది. ప్రస్తుతం ఆమె నటిస్తున్న మరో కీలక చిత్రం రామ్, మోహన్ లాల్ సరసన ఒక కీలక పాత్రలో కనిపించబోతోంది. ఈ సినిమా మలయాళంలోనే కాకుండా ఇతర భాషల్లో కూడా విడుదల కానుంది. అదేవిధంగా, శర్వానంద్, బెల్లంకొండ శ్రీనివాస్ నెక్స్ట్ సినిమాలలో కూడా ఆమె మెయిన్ హీరోయిన్‌గా అవకాశం అందుకుంది.

# అందమైన చీర కట్టులో ఆన్ స్క్రీన్ మహానటి



ఈతరం ప్రేక్షకులు మహానటి సావిత్రిని చూడలేదు.. కానీ ఆమెను కీర్తి సురేష్‌లో చూసి ఆమె జీవిత చరిత్రను 'మహానటి' సినిమాతో తెలుసుకున్నారు. తమిళ్ సినిమా ఇండస్ట్రీ నుంచి తెలుగు సినిమా ఇండస్ట్రీకి నేను శైలజతో వచ్చి మంచి గుర్తింపు దక్కించుకోవడంతో పాటు, మొదటి సినిమాతోనే స్టార్‌గా నిలిచింది. మహానటి సినిమా తర్వాత పాన్ ఇండియా స్థాయి సినిమా హీరోయిన్‌గా ఈ అమ్మడు నిలిచింది. ఆకట్టుకునే అందంతో పాటు మంచి ఫిజిక్ కీర్తి సురేష్ సొంతం అంటూ ఆమె ఫ్యాన్స్‌తో పాటు, సోషల్ మీడియాలో నెటిజన్స్ కామెంట్స్ చేస్తూ ఉంటారు. అందమైన రూపం కలిగి ఉన్న కీర్తి సురేష్ ఎలాంటి డ్రెస్‌లు వేసినా భలే అందంగా ఉంటుంది. ఆమె ఫిజిక్‌కి ప్రతి ఒక్క ఔట్ ఫిట్ భలే సెట్ అవుతాయని టాక్ ఉంది. అందుకే కీర్తి సురేష్ మోడ్రన్ డ్రెస్‌తో పాటు, మంచి ఔట్ ఫిట్ ఏది అయినా ఆకట్టుకుంటూ ఉంటుంది. తాజాగా చీర కట్టులో కీర్తి సురేష్ మెరిసింది. ప్రస్తుతం పెళ్లికి రెడీ అవుతున్న కీర్తి సురేష్ చీర కట్టు ఫోటోలను సోషల్ మీడియా ద్వార షేర్ చేసి అందరి దృష్టిని ఆకర్షించింది. విభిన్నమైన డిజైనర్ మోడ్రన్ చీరలో కీర్తి సురేష్ కనిపిస్తోంది. కీర్తి సురేష్ యొక్క అందం ఈ చీర కట్టులో మరింత పెరిగింది అంటూ కామెంట్స్ చేస్తున్న వారు చాలా మంది ఉన్నారు. సైడ్ యాంగిల్, స్ట్రైట్ యాంగిల్.. ఇలా ఏ యాంగిల్ చూసినా కీర్తి సురేష్ అందం అంతకు మించి అన్నట్లుగా అనిపిస్తుంది అంటూ కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తూ ఉన్నారు. పెళ్లికి ముందు కీర్తి సురేష్ నుంచి వచ్చిన ఈ ఫోటోలు ఆమె మొహంలో పెళ్లి కల వచ్చినట్లుగా కామెంట్స్ వస్తున్నాయి. కీర్తి సురేష్ తన చీర కట్టు ఫోటోలతో గతంలో చాలా సార్లు వైరల్ అయ్యింది. ఇప్పుడు అంతకు మించి అన్నట్లుగా ఈ చీర కట్టులో అందంగా కనిపిస్తుంది. బాలీవుడ్‌లో బేబీ జాన్ సినిమాలో మొదటి సారి హద్దులు దాటి అందాల ప్రదర్శన చేసిన ఈ అమ్మడు భలే ముద్దుగా ఉంది అంటూ హిందీ ప్రేక్షకులతోనూ అనిపించుకుంది. ముందు ముందు మరింతగా అందాల ఆరబోత ఫోటోలను షేర్ చేసి సౌత్‌లో మరింతగా ఈ అమ్మడు ఆకట్టుకోవాలని ఫ్యాన్స్ కోరుతున్నారు. పెళ్లికి ముందు కీర్తి సురేష్ అందాల బాంబు పేల్చడం పట్ల కొందరు ప్రశంసలు కురిపిస్తూ ఉంటే కొందరు మాత్రం పెదవి విరుస్తున్నారు. పెళ్లి తర్వాత ఏమాత్రం గ్యాప్ ఇవ్వకుండా బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేస్తానంటూ చెప్పుకొచ్చింది. మరి తెలుగులో ఈ అమ్మడు చేయబోతున్న తదుపరి సినిమా ఏంటో చూడాలి.

# నాలుగు రోజుల్లో రూ.829 కోట్లు.. బాక్సాఫీస్‌పై 'పుష్పరాజ్'

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ప్రధాన పాత్రలో నటించిన తాజా చిత్రం 'పుష్ప ది రూల్' బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతుంది. పుష్ప సినిమాకు సీక్వెల్‌గా వచ్చిన ఈ సినిమా డిసెంబర్ 05న ప్రేక్షకుల ముందుకు వచ్చి సూపర్ హిట్ టాక్‌తో కలెక్షన్ల వర్షం కురిపిస్తుంది. ఈ సందర్భంగా నాలుగో రోజు కలెక్షన్స్‌కు సంబంధించి అప్‌డేట్ ఇచ్చింది చిత్రబృందం.
'పుష్ప ది రూల్'ప్రపంచవ్యాప్తంగా మొదటిరోజు రూ.294 కోట్ల



వసూళ్లు రాబట్టిందని మేకర్స్ ప్రకటించిన విషయం తెలిసిందే. రెండో రోజు ఏకంగా రూ.155 కోట్ల వసూళ్లను సాధించింది. దీంతో రెండు రోజుల్లో రూ.449 కోట్ల కలెక్షన్స్ సాధించింది ఈ చిత్రం. అయితే మూడో రోజు శనివారం కావడంతో రూ.172 కోట్ల వసూళ్లను రాబట్టగా.. 3 రోజులకు కలిపి రూ.621 కోట్ల వసూళ్లను సాధించింది. తాజాగా ఆదివారం నాడు సునామీ సృష్టించింది ఈ చిత్రం నాలుగో రోజు ఏకంగా.. 208 కలెక్షన్స్ రాబట్టి మొత్తం ఇప్పటివరకు రూ.829 కోట్ల వసూళ్లను సాధించింది. మరో రెండు రోజుల్లో ఈ చిత్రం రూ.1000 కోట్లు క్రాస్ చేస్తుందని ట్రేడ్ వర్గాల అంచనా. ఇదిలావుంటే నార్త్‌లో కూడా తన సత్తా చూపిస్తున్నాడు పుష్ప రాజ్. మొదటి రోజు హిందీలో రూ.72 కోట్ల కలెక్షన్లు రాబట్టిన ఈ చిత్రం రెండో రోజు రూ.59 కోట్లు రాబట్టింది. ఇక మూడో రోజు అయితే ఏకంగా రూ.74 కోట్ల వసూళ్లను రాబట్టింది. దీంతో మొదటి రోజున సాధించిన రూ.72 కోట్ల కలెక్షన్లు అధిగమించి తన రికార్డును తానే తిరగరాశాడు అల్లు అర్జున్. అయితే ఆదివారం కూడా ఈ రికార్డులు బద్దలయ్యింది. ఆదివారం రోజున ఏకంగా రూ.86 కోట్ల వసూళ్లతో ప్రభంజనం సృష్టించాడు పుష్పరాజ్. దీంతో నాలుగు రోజుల్లోనే బాలీవుడ్‌లో రూ.294 కోట్ల వసూళ్లను రాబట్టి చరిత్ర సృష్టించాడు.

# అందాల నభా అందమైన వర్కౌట్ లుక్



వజ్రకాయ అనే కన్నడ సినిమాతో సినీ ఇండస్ట్రీలో అడుగు పెట్టిన ముద్దుగుమ్మ నభా నటేష్. తెలుగులో ఈ అమ్మడు సుధీర్ బాబుతో కలిసి నన్ను దోచుకుందువటే సినిమాతో ఎంట్రీ ఇచ్చింది. 2018లో విడుదల అయిన ఆ సినిమాతో తెలుగు ప్రేక్షకుల హృదయాలను దోచుకుంది. ముఖ్యంగా అందంతోనే కాకుండా నటనతో విమర్శకుల ప్రశంసలు దక్కించుకుని మంచి నటి అని కితాబు పొందింది. ఆకట్టుకునే అందం తో పాటు మంచి ప్రతిభ ఉన్న నటి అంటూ నిరూపించుకున్న నేపథ్యంలో ఈ అమ్మడికి టాలీవుడ్ నుంచి వరుసగా ఆఫర్లు దక్కాయి. తెలుగులో ఈ అమ్మడు మొదటి సినిమాతో పాజిటివ్ టాక్ దక్కించుకుని, ఇస్మార్ట్ శంకర్‌తో కమర్షియల్ విజయాన్ని సొంతం చేసుకుంది. బాడీ లాంగ్వేజ్‌తో పాటు, డైలాగ్ డెలవరీ భలే ఉంది అంటూ అందరితోనూ మెప్పు పొందింది. ఇక టాలీవుడ్‌లో ఈ అమ్మడు వెనక్కి తిరిగి చూసుకోవాల్సిన అవసరం లేదు అని అంతా భావించారు. అయితే ఇస్మార్ట్ శంకర్ సినిమా తర్వాత కరోనా వల్ల నభా నటేష్‌కి ఎక్కువ ఆఫర్లు దక్కలేదు. దాంతో మళ్లీ డౌన్ అయ్యింది. ఇప్పుడు కాస్త బిజీగా సినిమాలు చేస్తూ దూసుకు పోతుంది. సోషల్ మీడియాలో ఈ అమ్మడి రచ్చ కంటిన్యూ చేస్తోంది. ఈ నెంబర్ అసలు ఊహించలేదుగా.. రెగ్యులర్‌గా అందాల ఆరబోత ఫోటోలు షేర్ చేయడం ద్వారా వార్తల్లో ఉండే నభా నటేష్ మరోసారి తన అందమైన రూపంతో ఆకట్టుకుంది. ఆకట్టుకునే అందంతో పాటు ఆహా అనిపించే స్థాయిలో ఈ అమ్మడి యొక్క లుక్ ఉండటంతో టాలీవుడ్‌తో పాటు ఇతర భాషల్లోనూ ఈ అమ్మడి యొక్క ఫోటోలు వీడియోలు వైరల్ అవుతూ ఉంటాయి. తాజాగా ఈమె జిమ్‌లో ఉన్న ఫోటోలు వైరల్ అవుతున్నాయి. వర్కౌట్ డ్రెస్‌లోనే ఉన్న నభా నటేష్ మిర్రర్ సెల్ఫీలు తీసుకుని సోషల్ మీడియా ద్వారా షేర్ చేసింది. బక్క పలుచని ఈ అమ్మడు సెల్ఫీ భలే అందంగా ఉంది. ముఖ్యంగా నడుము అందం చూపిస్తూ ఈ అమ్మడు షేర్ చేసిన ఈ ఫోటోలు వైరల్ అవుతున్నాయి. జిమ్‌లో ఇంతటి అందం ఉంటే ఇతరులు వర్కౌట్స్ ఎలా చేస్తారంటూ కొందరు సరదాగా కామెంట్స్ చేస్తూ ఉన్నారు. ఇంతటి అందగత్తెకు దక్కాల్సిన ఆఫర్లు దక్కడం లేదు, ముందు ముందు అయినా ఈమెకు సినిమాల్లో వరుసగా ఆఫర్లు రావాలని ఫ్యాన్స్ కోరుకుంటున్నారు. తెలుగుతో పాటు ఇతర భాషల్లోనూ ఈమె ప్రస్తుతం సినిమాలు చేస్తూ ఉంది.

# సిరాజ్ వర్సెస్ హెడ్.. ఇద్దరికీ ఐసీసీ శిక్ష !



**అడిలైడ్-నవభూమి:** అడిలైడ్‌లో జరిగిన రెండో టెస్టులో.. ఇండియన్ పేసర్ మహమ్మద్ సిరాజ్.. ఆస్ట్రేలియా బ్యాటర్ ట్రావిస్ హెడ్ మధ్య మాటల యుద్ధం జరిగిన విషయం తెలిసిందే. సిరాజ్ బౌలింగ్‌లో 4, 6 కొట్టిన హెడ్‌ను.. ఆ తర్వాత బంతికి క్లీన్ బౌల్డ్ చేశాడు. ఆ సమయంలో ఇద్దరి మధ్య మాటల యుద్ధం సాగింది. దీనిపై అంతర్జాతీయ క్రికెట్ మండలి ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆ ఇద్దరు క్రికెటర్లకు శిక్ష పడే అవకాశాలు ఉన్నట్లు మీడియా కథనాలు పేర్కొన్నాయి. ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘిం చారని ఐసీసీ భావిస్తున్నది. సోమవారం రోజున ఇద్దరు ప్లేయర్లతో ఐసీసీ అధికారులు ముచ్చటిం చారు. ఇద్దర్నీ దోషులుగా ఐసీసీ నిర్ణయించింది. గతంలో ఆ ఇద్దరికీ మంచి రికార్డు ఉన్న కారణంగా.. కేవలం వాళ్లకు మ్యాచ్ ఫీజులో కోత లేదా మందలింపు మాత్రమే ఉంటుందని ఐసీసీ వర్గాల ద్వారా తెలిసింది. డే అండ్ నైట్ టెస్టులో 10 వికెట్ల తేడాతో ఆస్ట్రేలియా విజయం సాధించిన ఆ మ్యాచ్ ఫస్ట్ ఇన్నింగ్స్‌లో ట్రావెస్ హెడ్ 140 రన్స్ స్కోర్ చేశాడు. క్లీన్ బౌల్డ్ అయిన సమయంలో సిరాజ్ బౌలింగ్‌ను మెచ్చుకున్నట్లు హెడ్ తెలిపాడు. కానీ సిరాజ్ మాత్రం ఆ వ్యాఖ్యలను ఖండించాడు. ఔటైన తర్వాత హెడ్ అనుచిత కామెంట్స్ చేశాడని, దాన్ని టీవీల్లోనూ చూడవచ్చు అని సిరాజ్ తెలిపాడు.

# రెండో టెస్టులో శ్రీలంకపై విజయం.. డబ్ల్యూటీసీ ఆశలు పెంచుకున్న దక్షిణాఫ్రికా



**గిబెరా-నవభూమి:** శ్రీలంకతో జరిగిన రెండో టెస్టులో దక్షిణాఫ్రికా 109 రన్స్ తేడాతో నెగ్గింది. దీంతో సిరీస్‌ను 2-0 తేడాతో సఫారీలు కైవసం చేసుకున్నారు. సెయింట్ జార్జ్ పార్క్‌లో జరిగిన మ్యాచ్‌లో 348 రన్స్ టార్గెట్‌లో లంక రెండో ఇన్నింగ్స్ చేపట్టింది. ఇవాళ అయిదో రోజు 143 రన్స్ చేయాల్సి ఉండగా, చివరి అయిదు వికెట్లను లంక త్వరగా కోల్పోయింది. కెప్టెన్ ధనంజయ డిసిల్వా, కుశాల్ మెండిస్ కొంత సేపు ప్రతిఘటించినా.. చివరకు శ్రీలంక 238 రన్స్ వద్ద లంచ్‌కు ముందే ఆలౌటైంది. స్పిన్నర్ కేశ్ మహారాజ్.. ఈ ఇన్నింగ్స్‌లో అయిదు వికెట్లు తీశాడు. టెస్టుల్లో అయిదేసి వికెట్లు తీయడం అతనికి ఇది 11వసారి. సిరీస్‌ను కైవసం చేసుకున్న దక్షిణాఫ్రికా.. వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్‌లో తన పొజిషన్ మెరుగుపరుచుకున్నది. 63.33 పాయింట్లతో ఐసీసీ స్టాండింగ్స్ లిస్టులో సౌతాఫ్రికా ప్రస్తుతం ఆస్ట్రేలియాను వెనక్కి నెట్టి అగ్రస్థానంలో నిలుచున్నది.

నవక్రీడ

# స్క్వాష్ చాంపియన్లు ద్వివేది, వశిష్ట్




**హైదరాబాద్-నవభూమి:** ఈనెల 6 నుంచి 8 మధ్య తెలంగాణ స్క్వాష్ రాకెట్స్ అసోసియేషన్, గేమ్ పాయింట్ సంయుక్తంగా నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర స్క్వాష్ చాంపియన్‌షిప్-2024 ఘనంగా ముగిసింది. మూడురోజుల పాటు హోరాహోరిగా జరిగిన ఈ పోటీలలో భాగంగా అండర్ -13, అండర్ -15, అండర్ -17 విభాగాల్లో యువ క్రీడాకారులు తమ సత్తాచాటగా పురుషులు, మహిళల విభాగాల్లోనూ ప్యాడ్లర్లు ఆకట్టుకున్నారు. అండర్-13 బాలుర విభాగంలో పులి తనుజ్ రెడ్డి విజేతగా నిలవగా అండర్-15 గర్ల్స్ విభాగంలో ఆర్య ద్వివేది టైటిల్ నెగ్గింది. అండర్-17 బాయ్స్ కేటగిరీలో రాజ్‌వీర్ విజేతగా నిలిచాడు. మెన్స్ కేటగిరీలో కరుణ్ వశిష్ట్, ఉమెన్స్ కేటగిరీలో ద్వివేది ఫైనల్‌లో జయకేతనం ఎగురవేశారు.

Printed,Published & Owned by SHAIK SHAHANAZ, Printed at SUPER PRINTERS Web offset Printers 2-3-655/C/118,Azad Nagar,Amberpet Circle 23,HYDERABAD -500113(T.S.), and Published D.No: 10-2-287/1/,Ground Floor,Santhinagar,A.C Guards,Masabtank,HYDERABAD - 500028,State TELANGANA (India). Editor: **SHAIK SHAHANAZ**, Phone: 9246213493,Email : navabhoomidaily@gmail.com,navabhoomi1@gmail.com **RNI No: TEL TEL: 82083**